

ఫిబ్రవరి-65



Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada-2.



జనవరి 15 వ తేదీన జరిగిన సభలో శ్రీ నాగేశ్వరరావు డాక్టర్ చెన్నారెడ్డికి తన పుస్తకాన్ని సమర్పిస్తున్నప్పటి ఫోటో. మధ్యనున్నవారు శ్రీ గార్డ్నర్.



శ్రీ నాగేశ్వరరావుకు జ్యోతిబుక్స్ తరఫున సన్మానపత్రాన్ని సమర్పిస్తున్న "జ్యోతి" మేనేజింగ్ ఎడిటర్ శ్రీ వి. వి. రాఘవయ్య.

జ్యోతి బుక్స్

ఆనాడు కనుము. 'అదెకనుమా, ఇదెవినుమా' అని దూరంగా మైక్ లోంచి పాట వినబడుతోంది. విజయవాడ రైస్ మిల్లర్స్ హాలులో అవాళ నిజంగానే చూడ్డానికి, వినడానికి కావలసినంత పండగ.

జ్యోతి బుక్స్ ప్రచురించిన 'నేనుచూసిన అమెరికా' పుస్తకాన్ని ఆర్థికమంత్రి డాక్టర్ చెన్నారెడ్డిగారు ఆవిష్కరించారు. పురప్రముఖులతో కలకలలాడుతున్న సభకు మద్రాసు యు. ఎస్. ఐ. ఎస్. కల్చరల్ ఆఫీసర్ శ్రీ ఫ్రెంక్లిన్ గార్డ్నర్ అధ్యక్షత వహించారు. గ్రంథకర్త శ్రీ నాగేశ్వరరావు, ఆయన సతీమణిగారూను వేదికపై ఆసీనులయ్యారు. పుస్తక విశిష్టతగురించి డాక్టర్ చెన్నారెడ్డి, శ్రీ గార్డ్నర్ ప్రశంసాపూర్వకంగా ప్రసంగించారు. ఈ సభ పెద్ద పండుగంత సరదాగా జరిగిపోయింది.

నేనుచూసిన అమెరికా

అక్కినేని నాగేశ్వరరావు

130 పేజీల ఈ గ్రంథంలో అక్కినేని చూసిన అమెరికాను మనం కూడా చూడవచ్చు. అక్కడి ప్రజల ఆత్మీయత, ఇండియాపట్ల వారి ఆప్యాయత, వారి జీవనపద్ధతులు, ఆచారాలు, అలవాట్లు, ఆ దేశంలోని వింతలు, థియేటర్లు, మూవీ టీవీ స్టుడియోలు, విశ్వవిద్యాలయాలు—ఇంకా ఎన్నో విశేషాలను కళ్ళకు కట్టేట్టు, చవులూరేట్టు వర్ణించారు. మనం తెలుసుకుని, నేర్చుకోదగిన ఎన్నో అంశాలు తెలిపారు. తన అమెరికా పర్యటనానుభవాలను సరదాగా వివరించారు.

ఈ పుస్తకం ఒక విజ్ఞాన-వినోదయాత్ర. మీరుకూడా ఇందులో పాల్గొనండి. "జ్యోతి" ఏజెంట్లనుగాని, మీ దగ్గరలోగల పుస్తక విక్రేతలనుగాని అడగండి. లేదా నేరుగా ఈ క్రింది అడ్రసుకు వ్రాసి తెప్పించుకోండి. వెల : 2-50. రిజిష్టర్డు బుక్ పోస్టేజితోసహా రు. 3-25; వి. పి. పి. పద్ధతిలేదు.

జ్యోతి బుక్స్, బకింగ్‌హాంపేట పోస్టు, విజయవాడ-2.

తొలిమాట

ఈ సంచికతో "జ్యోతి" రెండేళ్ళు పూర్తిచేసి మూడోయేట అడుగుపెట్టింది. దేశంలో పత్రికా ప్రచురణ ఈనాడెదురుకుంటున్న ఇబ్బందుల దృష్ట్యా ఇది మేము ఎంతైనా సంతోషపడవలసిన విశేషం.

గడచిన రెండేళ్ళలో "జ్యోతి" గణించదగిన విజయాలే సాధించింది; పాఠకుల ఆసక్తిని ఆకర్షించిన కొన్ని కొత్తశీర్షికలను ప్రవేశపెట్టింది. ప్రారంభ సంచికనుంచి "జ్యోతి" ని జాగ్రత్తగా గమనిస్తున్న ఒక పాఠకుడు దాని జయాపజయాలను బేరీజు వేసి మాకు పంపించారు. ఆయన వ్యక్తిగతాభిప్రాయాలను "ఉత్తరాయణం" లో ప్రచురించాము.

ఈ సంచికలో బీనాదేవి రచించిన ఒక పెద్దకథను, చాలా పేజీలు ఆక్రమించినప్పటికి ఆ కథలోని సొగసునుబట్టి, ఒక్కసారే ప్రచురించాము. ఆ కథ మాకొక మాస్టర్‌పీస్‌లా అనిపించింది. మీరు కూడా మెచ్చగలరనే ఆశిస్తున్నాము. ఆ రచయిత్రిదే మరొక కథ "రిబ్బనుముక్క" వచ్చే సంచికలో వెలువడుతుంది.

వి. వి. రాఘవయ్య.

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.
విడిప్రతి వెల : 75 పైసలు — ఏడాది చందా : 9 రూపాయలు
సంపుటి 3 ఫిబ్రవరి 1965 సంచిక 2

ఇదో వరస...

ముఖచిత్రం :

"నాదీ ఆడజన్మే" లో సావిత్రి.

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.
ఆర్ట్ ఎడిటర్ : బాపు.

ఉత్తరాయణం

నా కథానిక "డోలిక" ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రికలోనూ, జ్యోతి మాసపత్రికలోనూ కూడా ప్రచురింపబడింది. అనివార్యమైన ఒక పొరపాటు కారణంగా, ఈ విధంగా జరిగింది. దీనిని సర్దుకోవటానికి ప్రయత్నించీ అశక్తురాలినయ్యాను. ఇందుకు ఆయా పత్రికాధిపతులే సాక్ష్యం. సహృదయులైన పాఠకులకు నా ఈ పొరపాటును మన్నించుడని విజ్ఞప్తి కావించుకొంటున్నాను.

సి. ఆనందారామం,
27-12-64

● ● ●

జ్యోతి పత్రిక స్థాపించి సరిగా రెండేళ్ళయింది. దానిపై నా అభియాన్ని ఈ దిగువ వ్యక్తీకరిస్తున్నాను.

"జ్యోతి" పత్రిక వస్తోందనగానే, హాస్యప్రధానంగా వుండే ఒక క్రొత్త రకం పత్రిక వస్తోందనీ, హాస్యసృష్టిలోనూ, చిత్రకళలోనూ అత్యున్నత స్థాయి నాక్రమించిన శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ, శ్రీ బాపు, మరికొందరు ప్రముఖులూ దీనికి సారథ్యం వహిస్తారనీ, తెలిసి అంతా సంతోషించారు. జ్యోతి బావుంటుందని సహజంగానే ఆశించారు. బాగుందికూడా. కొద్ది కాలంలోనే జ్యోతి చాలామంది ఆదరాభిమానాలను సంపాదించింది. చాలా మందికి అభిమానపత్రిక అయిపోయింది.

జ్యోతి సాధించిన ఘనవిజయాలలో ముఖ్యమైనది ఆరుద్రగారి "కూనలమ్మపదాలు" ప్రచురణ. ఆరుద్ర ఆ రచనలతో తెలుగు సారస్వతంలోనే నూతన శకాన్ని సృష్టించారు.

కథలు : ఉత్తమ శ్రేణి కథలు అందించడానికి జ్యోతి చాలా కృషి చేసింది. 4 వ మజిలీ, కురూపి, సీతాపతికథ, గళ్ళ రుమాలు, రామారావు చతుర్లోకాలు, సర్వీసురిజిష్టరు, అద్దం అబద్ధం చెప్పింది, చావు, స్నేహితులు, ఇల్లు కథలు చాలా బాగున్నాయి. ఇందులో కొన్ని సాహిత్య లోకంలో ఎక్స్‌పెరిమెంట్లుఅనవచ్చు.

మల్లాదివారి కథలని కొన్నింటిని జ్యోతి ప్రచురించింది. వారి శైలి అందరికీ అందుబాటులో ఉండదు.

ఇక విగతా రచయితల విషయం చూస్తే, "అల్లుడి మంచితనం," "ఆదర్శాలూ—ఆచరణలూ", "నీరజపెళ్ళి" లాంటి మాస్టర్ పీసెస్ రాసిన "అరవింద" గారు జ్యోతి కందించిన కథలలో ఏ ఒక్కటీ ఉత్తమ స్థాయికి రాలేదు. అలాగే సులోచనారాణి గారు కూడా ప్రత్యేకత చూపించ

లేదు. ఆమె వ్రాసిన "జ్యోతి". "బహుమతి" కథలు చదవడానికి బాగానే ఉన్నాయి కాని మొదటి తరగతికి చెందినవికావు. శ్రీ ఆదివిష్ణు వ్రాసిన వాటిలో "పెళ్ళయితే" ఒక్కటే బాగుంది. శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మ రాసిన "నవ్వింది జాబిల్లి" మంచి స్థాయిలో లేకపోవడమేకాక ఇదివరకు భమిడిపాటి రామగోపాలంగారు ఆంధ్రపత్రికలో వ్రాసిన "వెన్నెలనీడ" (ప్రైజు కథ)ని పోలివుంది.

సీరియల్స్ : సంవత్సరన్నర తర్వాత జ్యోతి సీరియల్ ప్రచురణకు ఉపక్రమించింది. ఎప్పుడో చెయ్యవలసిన పని అది. పూర్తిగా చదవనిదే విమర్శించడం సబబుకాదుగాని, ఇంతవరకు చదివినదాన్నిబట్టి అది చాలా బాగుందని చెప్పడానికి వీలు లేకుండా వుంది.

శీర్షికలు : పఠాభిపన్‌చాంగం చమత్కారంగా ఉంది. కాని, అది 'లైట్ రీడింగ్' కాదు. పన్నెండుమందిసంగీత కారుల్ని "స్వరలహరి" పేరుక్రింద శ్రీనివాస్ ద్వారా పరిచయం చేసింది. ఇది హర్షించదగ్గ సంగతి. మాస పత్రిక కాబట్టి సినిమాశీర్షిక తాజాగా లేకపోవడంలో ఆశ్చర్యంలేదు.

హాస్యం : జ్యోతి సరికొత్త జోకుల్ని చాలా సృష్టించింది. అన్నీ చాలా బాగున్నాయి. బొమ్మలువేసి శ్రీ బాపు వాటికి కొత్తశోభ చేకూర్చారు. విట్టుచదవటం ఒకఎత్తు, బొమ్మ చూడడం ఒకఎత్తు. సెక్సుకి సంబంధించిన జోకు లున్నప్పటికీ ఎబ్బెట్టుగా గాని, జుగుప్సాకరంగాగాని లేవు.

కార్టూనులు జ్యోతి చాలా ప్రచురించింది. ఇందులో నూటికి 95 వంతులు బాపు వేసినవే. అతిశయోక్తి ప్రధానంగా వారు చాలా కార్టూన్లు వేశారు. అన్నీ బాగున్నాయి. ఆధునిక చిత్రకళపేరిట చెలామణీ అయ్యే పిచ్చిగీతల్ని ఆయన చాలా చక్కగా విమర్శించారు. "జ్యోతిష్యఫలితాలు" కార్టూన్లు ఇప్పటిదాకా వేసినవాటన్నిటిలోనూ బాగున్నాయి. సెక్సరే కూడా బాగుంది.

బొమ్మలు : జ్యోతిలో ప్రత్యేక ఆకర్షణ యివి. జ్యోతినిఅలంకరించడానికి బాపు శాయశక్తులా కృషి చేస్తున్నారు. ప్రపోర్షన్, అందం, ఆకర్షణ ఉండేటట్లు చూస్తూ, బొమ్మలో పాత్ర మన స్తత్వాన్నికూడా చిత్రించగల బాపు ప్రతిభను జ్యోతి పూర్తిగా వినియోగించుకోలేక పోయింది. కారణం జ్యోతి చాలా చిన్నసైజు పత్రిక కావడం. అందుకే "సుందరీ-సుబ్బారావు"కి బాపు వేసిన బొమ్మ లాంటి బొమ్మలు జ్యోతిలో రాలేదు. అయినప్పటికి జ్యోతిలో "రామారావు చతుర్లోకాలు"కి, "కళలు-కలవరింతలు"కి, మల్లాదివారి కథలకి, "మార్పుకి మరోపేరు"కి అద్భుతమైన బొమ్మలు వేశారు శ్రీ బాపు. అసలు దీపావళి (1963) సంచిక

ముఖచిత్రమే రూపాయి విలువ చేసే టట్లు ఉంది.

జ్యోతి "సిల్లీ"గా ఉందని వచ్చిన విమర్శలో నిజం లేకపోలేదు. అది పిల్లల పత్రికలా వ్యవహరించిన సమయాలు (చిత్రాక్షరి, మాయమయ్యే అమ్మాయి) కూడా లేకపోలేదు.

జ్యోతి వచ్చే సంచికలలో ఇంకా బావుంటుందనీ, ఇంకా ఉన్నత స్థాయిలో నడుస్తుందనీ ఆశిస్తూ, అది ఇతోధికంగా పాఠకుల ఆదరణ పొందాలని ఆకాంక్షిస్తున్నాను.

కె. అర్. రావు,
ఏలూరు.

● ● ●

18-6-64 న హైద్రాబాద్‌లో శ్రీ నీలం సంజీవరెడ్డిగారు విశాఖపట్నానికి మధ్యప్రదేశ్‌లోని బైలదిళ్ళనుంచి కోకింగ్ బొగ్గును సులభంగా తెచ్చుకోవచ్చనీ, అందుచేత విశాఖపట్నంలో ఐదవ ఉక్కుకర్మాగారం నిర్మాణం సులభమని సెలవిచ్చారు. తిరిగి శ్రీ సంజీవరెడ్డిగారే 9-8-64 న మహబూబ్‌నగర్‌లో విశాఖపట్నంలో ఐదవ ఉక్కుకర్మాగారం నిర్మిస్తే విశాఖపట్నానికి బైలదిళ్ళనుండి కోకింగ్ బొగ్గు తెచ్చుకోవడం ఎంతో కష్టమని సెలవిచ్చారు.

18-6-64 మొదలు 9-8-64 వరకూగల ఈ మధ్యకాలంలో విశాఖపట్నానికి బైలదిళ్ళ నుంచి కోకింగ్ బొగ్గు తెచ్చుకోవడం ఎందుకు కష్టంగా మారిపోయిందో ఎవరైనా పరిశోధించి థీసిస్ సమర్పిస్తే, విశాఖపట్నం కేంద్రస్థానంగాగల ఆంధ్ర విశ్వవిద్యాలయం "డాక్టరేట్" సమర్పించవచ్చు.

"బంటి", మద్రాసు.

● ● ●

నూతన సంవత్సర ప్రథమసంచిక "జ్యోతి" బాగుంది. హాస్యరసాన్ని ప్రత్యేకించి పోషించే ప్రముఖ మాస పత్రిక, ఇదొక్క టేనంటే ఒప్పుకొని తీరాలి. "సెక్రటరీ" సీరియల్ చాలా బాగుంటున్నది. ముఖ్యంగా ఈ నెలలో మీ మద్రాసు సినిమా ప్రతినిధి వ్రాసిన "సుమతి భానుమతి సుగతి" శీర్షిక క్రింద వ్రాసినదంతా సరియైనదే. నిజంగా భానుమతి "కాలాన్ని జయించిన తార". సినిమా రంగములో ప్రవేశించి 25 సంవత్సరాలయినా ఆమె "పాప్యులారిటీ" తగ్గలేదు.

పి. హేమలతా దేవి, గుంటూరు.

● ● ●

జనవరిసంచికలోని "జ్యోతి" పూర్తిగా మగవారిని మాత్రమే దృష్టిలో పెట్టుకుని వ్రాసినట్లు కనిపిస్తోంది. ప్రస్తుత ప్రతి వెలనుబట్టి, "జ్యోతి" కాంతిగా వెలగడానికి యింకా పరిశ్రమ అవసరం.

సుదక్షిణ, వాల్తేర్సు.

□□□

పెడసరి విధానాలు

విజయవాడలో జనవరి చివరివారం జనసంఘ్ వారం. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఏడువేలమంది ప్రతినిధులతో విజయవాడ కలకలలాడింది. దక్షిణభారత చరిత్రలో ఒక స్వర్ణయుగానికి కర్త అయిన హిందూ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పేరిట నిర్మించిన "నగర్"లో అఖిల భారత జనసంఘ్ 12వ మహాసభ వైభవోపేతంగా జరిగింది. గుంటూరు ఎ. ఐ. సి. సి. కి జరిగిన ఖర్చుతో పోల్చితే కృష్ణదేవరాయనగర్‌కు జరిగింది చాలా స్వల్పం. అయినా, ఏర్పాట్లన్నీ అమోఘంగా జరిగాయి. కొద్ది ఖర్చుతో అంత చక్కటి ఏర్పాట్లు జరగడంచూస్తే ఇప్పుడున్న భారతీయ రాజకీయ పక్షాలన్నిటిలో జనసంఘ్ అంతటి క్రమశిక్షణ కలిగింది మరొకటి లేదనిపిస్తుంది.

జనసంఘ్ విషయంలో అదొక్కటే మెచ్చుకోదగింది. దాని విధానాలు, ప్రణాళిక, పార్టీ కార్యక్రమం పరిశీలిస్తేమాత్రం ఆశాభంగం కలగక మానదు. ఈ పార్టీ "అఖండభారత్" నినాదాన్ని యింకా విడిచిపెట్టలేదు. ఎప్పటికైనా భారత్, పాకిస్తాన్‌లను ఏకం చేయడం దాని ధ్యేయమట. టిబెట్, సింకియాగ్, మంగోలియాలను విముక్తం చేయాలట. ఫార్మోజాను చైనాగా గుర్తించాలట. అణ్వస్త్రాన్ని నిర్మించి చైనా సవాలును ఎదుర్కోవాలట. అలీన విధానానికి స్వస్తి చెప్పాలిట. ప్రణాళికలను పబ్లిక్ రంగానికి మాత్రమే పరిమితం చేసి ప్రయివేటు రంగాన్ని దాని దారిన దాన్ని పోనివ్వాలట. అంతేకాదు, చతుర్థప్రణాళిక పెట్టుబడిని తగ్గించేట్టు ఒత్తిడి చేయడానికి పెద్ద ఉద్యమాన్ని తాను ప్రారంభిస్తుందట. మొత్తం మీద దానివన్నీ పెడసరి విధానాలే.

ఇక, జనసంఘ్ నాయకులు జవ

రాజకీయ వాతావరణం

హర్తాల్ నెహ్రూను దూషించిన విధానం చూస్తే మరీ బాధకలుగుతుంది. గాంధీజీపట్ల ఈ పార్టీకి ఎంత ద్వేషంవుందో నెహ్రూ పట్లకూడా అంతే. బహుశా, ఆ ఇద్దరు నాయకులూ హిందూ ముస్లిం సామరస్యం కోసం చేసినకృషే వారి కోపానికి కారణమై వుంటుంది. ఆ ముక్క పైకి అనకపోవచ్చు. నెహ్రూ దేశాన్ని అధోగతికి ఈడ్చి వదిలి పెట్టాడని వారి దృఢవిశ్వాసం. ఆయన చేసిన మంచిపనులు, దేశానికి ఆయన తెచ్చిన కీర్తిప్రతిష్ఠలు, భావిసౌభాగ్యానికి అయన వేసిన పునాదులు, ఆయన వ్యక్తిత్వప్రతిభ—ఇవేవీ వారు పరిగణించరు. దేశంలోని ప్రతి అనర్థానికి అయన్ని కారకుడుగా చేసి నిందించడం వారికి అదొక ముచ్చట.

ఉత్తరాదిన కొన్ని రాష్ట్రాలలో తప్ప ఈపార్టీకి పలుకుబడి పెద్దగా లేదు. అదైనా కొన్ని వర్గాలకే పరిమితం. ఆంధ్రప్రదేశ్‌ను తమ మహాసభాస్థలంగా ఎంచుకోవడం ఈరాష్ట్రంలో తమ పలుకుబడి పెంచుకోవడానికే కావచ్చు.

● ● ●

పదిహేనవ రిపబ్లిక్ వార్షికోత్సవం రానూ వచ్చింది, పోనూపోయింది. ప్రజా సామాన్యంలో అది బ్రహ్మాండమైన ఉత్సాహాన్ని, ఆవేశాన్ని పూరించిందనడానికి వీల్లేదు. సభలు, ఉపన్యాసాలు, వాగ్దానాలు, పతాకావిష్కరణలు మామూలు ప్రకారం, లాంఛనప్రాయంగా జరిగిపోయాయి. వెనక్కి తిరిగి చూసుకుంటే ఏమీ కనబడదు.

కనబడేదల్లా ఒక విధమైన నిస్పృహ; నిస్తబ్ధత.

స్వాతంత్ర్యం సిద్ధించిన పద్ధెనిమిదేళ్ళ తరువాత, పోనీ— రిపబ్లిక్ అవతరించినపదిహేనేళ్లతరవాత మనం సాధించిన దేమిటి? పంచవర్ష ప్రణాళికలు నిర్వహిస్తున్నాము. ఇతర దేశాల సహాయంతో కొన్ని భారీపరిశ్రమలు స్థాపించుకున్నాము. కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించుకున్నాము. అనివార్యంగా, కనీసంగా చేయవలసినవేవో చేశాము. అంతకుమించి చేసిందేమిటి? సోషలిస్టు సమాజస్థాపన మన లక్ష్యంగా పెట్టుకున్నాము. ఆ లక్ష్యం దిశగా ఎంతదూరం పయనించాము? ప్రజల జీవన ప్రమాణాన్ని ఎంతవరకు పెంచగలిగాము? కూడు, గూడు, గుడ్డ విషయంలోనైనా కనీసపు ప్రమాణాలను సాధించగలిగామా? జనాభా పెరుగుతున్నది. దాని అవసరాలు పెరుగుతున్నాయి. దానికి తగినట్లుగా సౌకర్యాలను సమకూర్చగలిగామా? కనీసం ఆహార విషయంలో స్వయంసమృద్ధినైనా పొందగలిగామా? ఈనాటికీ విదేశాలనుంచి గోధుమలు, బియ్యం దిగుమతి చేసుకోక తప్పడంలేదు. కొన్నికోట్ల విదేశీ ద్రవ్యాన్ని ఈ విధంగా కోల్పోతున్నాము. వేతనాలు పెరిగినమాట నిజమే. కాని, దాన్నిమించి ధరలు పెరిగాయి. ఇంకా పెరుగుతున్నాయి. వాటిని అరికట్టలేక పోతున్నాము. నిత్యజీవితావసరవస్తువులన్నీ సామాన్య మానవుడిదృష్టికి విలాసవస్తువులుగా పరిణమిస్తున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఏకచ్ఛత్రాధిపత్యం వెలిగిస్తున్న కాంగ్రెసుపార్టీ యీ పరిస్థితికి బాధ్యతను వహించక తప్పదు. దాని ఆశయాలు మంచివే, సిద్ధాంతాలు మంచివే—అవి గాంధీ, నెహ్రూలు మన కిచ్చిపోయిన వారసత్వాలుకనక.

కాని, ఆచరణలో జరుగుతున్నదేమిటి? పదిహేనేళ్ళలో సోషలిజం సాధించాలనే ధ్యేయంతో తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది. ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా అది తయారైంది. అనుకున్న లక్ష్యాలనుఅదిసాధించలేదని తేలిపోయింది. జాతీయాదాయం అనుకున్న మేరకు పెరగబోదని స్పష్టమై పోయింది. అందుచేత ఈ లోపాన్ని భర్తీ చేసుకునే విధంగా నాల్గవ ప్రణాళికను—21,500 కోట్లపెట్టుబడితో—రూపొందిస్తున్నారు. అంతధనం ఎలా సేకరించడమో తెలియదు; దాని లక్ష్యాలు ఎలా నెరవేరుతాయో తెలియదు. ప్రణాళిక పెట్టుబడినిమాత్రం ముందే నిర్ణయించేశారు.

అసలు సమస్య—పెట్టుబడిని సేకరించడం, లక్ష్యాల బాగోగులుకాదు—నాయకుల చిత్తశుద్ధి, వారిసామర్థ్యం. తాము చెప్పిన వాటిని తామెంత వరకు చేస్తున్నారు? తమ క్రింది అధికారులచేత ఎంతవరకు చేయించగలుగుతున్నారు? వారి తీర్మానాలు, వాగ్దానాలు ఎంతవరకు నెరవేరుతున్నాయి?

ఇవన్నీ జవాబులు అందరికి తెలిసిన ప్రశ్నలే. వేరే వివరించనక్కర లేదు.

గుంటూరులో కొన్ని లక్షల వ్యయం తరవాత దుర్గాపూర్‌లో మరి కొన్ని లక్షల వ్యయంతో కాంగ్రెసు మహాసభలు జరిగాయి. ఆ సభలలో కొన్ని వినసొంపైన, పసందైన తీర్మానాలు జరిగాయి. పాత లక్ష్యాలను, ఆదర్శాలను పునరుద్ఘాటించడం జరిగింది. కొత్తగా దేశానికొక ఉత్సాహాన్నివ్వడం, మార్గాన్ని నిర్దేశించడం జరగలేదు. నాయకులకే తమ మాటలపై, ఆశయాలపై విశ్వాసం లేదనిపించే విధంగా ఆ సభలు ముగిశాయి. చతుర్థప్రణాళికలో వ్యవసాయానికి అధికప్రాధాన్యమివ్వాలని ఆశిస్తూ తీర్మానం చెయ్యడంతప్ప జరిగిందేమీలేదు.

● ● ●

తొంభైయేళ్ళు జీవించడం ఒక విశేషం. అంత దీర్ఘజీవితాన్ని ఫలప్రదంగా జీవించడం మరొక విశేషం. అది చర్చిల్ కే చెల్లింది.

1874 లో ఆయన ప్రభువుల వంశంలో జన్మించాడు. బ్రిటిష్ చరిత్రలో సుప్రసిద్ధుడైన మార్ల్‌బరో ఆయన పూర్వీకుడు. తండ్రి రాండాల్ఫ్ చర్చిల్ ప్రఖ్యాత రాజకీయవేత్త. వారి వారసత్వమే ఆయనకు సంక్రమించింది. బ్రిటిష్ రాజకీయాలలో సుమారు ఆరు దశాబ్దాల పాటు ఆయన ప్రముఖపాత్ర వహించాడు.

చిన్నతనంలో ఆయనకు చదువుపై అంతగా శ్రద్ధలేదు. హారో పబ్లిక్ స్కూలులో ఆయన మంచి విద్యార్థిగా రాణించలేదు. అతనితో చదువుకున్నవారుగాని, చదువు చెప్పిన ఉపాధ్యాయులుగాని చర్చిల్ ఒకనాడు మహారచయితగా ప్రసిద్ధుడు కాగలడని ఊహించలేకపోయారు. హెడ్మాస్టరు ఒకనాడు చర్చిల్‌ను పిలిచి "నీ సంగతి ఏం బాగాలేదు. నీమీద నాకు చాలా కోపంగా వుంది" అన్నాడట. "నాకూ అంతేనండి" అని చర్చిల్ జవాబిచ్చాడట.

ఆ చర్చిలే తరువాతి కాలంలో నోబెల్ సారస్వత బహుమతిని పొందాడు. "స్వ్రావోలా" అనే నవలను 23వ యేట రచించాడు. పత్రికా రచయితగా జీవితంప్రారంభించాడు. తన తండ్రి జీవిత చరిత్ర, తన పూర్వీకుడైన మార్ల్‌బరో జీవిత చరిత్ర, మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల చరిత్రలు, ఇంగ్లిష్‌జాతి చరిత్ర, ఆత్మకథ ఇంకా ఎన్నో అసంఖ్యాకంగావ్యాసాలు వ్రాశాడు. చరిత్ర రచయితగా ఆయనకీర్తి అజమరామరం.

ఆయన కేవలం చరిత్ర కారుడే కాదు; చరిత్రను సృష్టించాడు. తన 66వ యేట చర్చిల్ బ్రిటన్ ప్రధాన మంత్రి అయ్యాడు. అవి రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైన రోజులు. బ్రిటిష్‌జాతి సర్వనాశనాన్ని ఎదుర్కొంటున్న దుర్దినాలు. ఆ సమయంలో చర్చిల్ యుద్ధానికి నేతృత్వం వహించాడు. స్వయంగా ఎన్నో యుద్ధాలలో పాల్గొనడంచేత, యుద్ధతంత్రాన్ని చిన్ననాటి నుంచి అభ్యసించినవాడు కావడంచేత తన ప్రతిభను అమోఘంగా ప్రదర్శించాడు. బద్ధశత్రువైన రష్యాతో మైత్రి కుదుర్చుకుని చివరకు హిట్లర్ పతనాన్ని సాధించాడు. ఈ మహాత్కార్యం సాధించినవాడుగా ఆయనపేరు చరిత్రలో చిరస్థాయిగా వుండిపోతుంది.

విక్టోరియన్ యుగంలో జన్మించి పెరిగిన చర్చిల్‌కు ప్రభుభక్తి, సామ్రాజ్యభక్తి అధికం. "బ్రిటిష్ సామ్రాజ్య విచ్ఛిత్తిని చూడ్డానికి నేను ప్రధానమంత్రిని కాలేదు," అని



విన్‌స్టన్ చర్చిల్ 1915 లో నౌకాశాఖ మంత్రిగా వున్నప్పటి ఫోటో. ఎడమప్రక్క నున్నవారు అప్పటి బ్రిటిష్ ప్రధాని లాయిడ్‌జార్జ్.

ఆయనొకసారి అన్నాడు. అలా అన్న పదేళ్ళలోపునే ఆ సామ్రాజ్యం విఛ్ఛిన్నం కావడం ప్రారంభమైంది. అది దాదాపు పూర్తిగా అంతం కావడాన్ని కూడా ఆయన తన కళ్ళతోనే చూశాడు.

● ● ●


అందరిదీ ఒకదారి, ఉలిపికట్టెదొకదారి అన్నట్టు ఇండొనీసియా ధోరణి మొదటినుంచి విచిత్రంగా వుంటూ వచ్చింది. ఇప్పుడది ఐక్యరాజ్యసమితి సభ్యత్వానికి రాజీనామా ఇచ్చింది. దీనికి కారణం మలేసియాకు భద్రతాసంఘంలో సభ్యత్వం ఇవ్వడం. సారవాక్, ఉత్తర బోర్నియో, సింగపూర్, మలయాలతో కలిపి మలేసియా సమాఖ్యను స్థాపించడం డాక్టర్ సుకర్ణోకు గిట్టలేదు. దానిపై రెండేళ్ళుగా ఆయన ప్రచ్ఛన్న యుద్ధం సాగిస్తున్నాడు. వీలైతే ప్రత్యక్ష యుద్ధం సాగించటం కూడా ఆయన ఆశయం. అయితే, బ్రిటన్ సైనికంగా మలేసియాకు సహాయ పడుతున్నందున ఆయన ఆటలు సాగడంలేదు.

మలేసియా సమితిలో సభ్యత్వం గల రాజ్యం. సమితికి సంబంధించిన ఏ అనుబంధ సంఘాలలోనైనా సభ్యత్వం పొందడానికి దానికి హక్కువుంది. దాని సాధారణ సభ్యత్వానికి అభ్యంతరపెట్టని ఇండొనీసియా, సమితి ఉపాంగమైన భద్రతాసంఘంలో మలేసియా సభ్యత్వాన్ని ఎందుకు వ్యతిరేకించాలో తెలియదు. ఇది కేవలం మొండితనం తప్ప మరేమీకాదు.

ఇండొనీసియా సమితి నుంచి తప్పుకున్నంత మాత్రాన నష్టం లేకపోవచ్చు. కాని ప్రతి సభ్యదేశం సమితిలో తనకు నచ్చని పని జరిగినప్పుడల్లా తప్పుకొనడం ప్రారంభిస్తే మటుకు అది ప్రమాదకరమే. సమితి మనుగడే సందిగ్ధం కాగలదు. ఇప్పటికే ఆర్థికంగా సమితి కార్యకలాపాలు ఒడుదొడుకుల్లో పడ్డాయి. సోవియట్ కూటం బకాయిల సమస్యతో సమితి పెద్ద సంక్షోభంలో పడింది. ఈ స్థితిలో ఇండొనీసియా ఉపసంహరణ విచారకరం.

అంతేకాక, దీనివల్ల ఇండొనీసియా చైనాకు మరింత సన్నిహితం అయ్యే అవకాశంకూడా వుంది. ఆగ్నేయాసియాలో విస్తరణ కాంక్షలు పెంచుకుంటున్న చైనాను ఇండొనీసియా వెనకవేసుకుని రావడం దానికి మరింత ప్రోద్బలమివ్వడమే కాగలదు. ఇదికూడా చింతించదగ్గ విషయమే.

□□□



'నే వెళ్తున్నానోయ్!'

కారిడర్‌లోని కారుపైనే దృష్టిని వుంచి అన్నాడు మూర్తి.

లోపల్నుంచి సమాధానం రాలేదు.

'శ్యాం!'

'ఊఁ'

శ్యామసుందరి వచ్చి అతనికి దగ్గర్లో నిల్చుంది.

'నా కోసం ఎదురుచూస్తూ కూర్చోకు. ఫోంచేసి పడుకో' అన్నాడు మూర్తి భార్యముంగురుల్ని చేతితో సవరిస్తూ.

'వెళ్ళక తప్పదంటూరా' దీనంగా అడిగింది శ్యామసుందరి.

'ఏమిటోయ్ ఆ బేలతనం!... నీవెప్పుడూ యింతేగా'

"అది కాదండీ, వర్షం పడుతోంది ..." అంటూ మధ్యలో ఆపింది శ్యామసుందరి భర్త ముఖంలోకి చూస్తూ.

"తడుస్తానని భయమా?" మూర్తి నవ్వాడు.

"తడుస్తారని కాదండీ, చినుకులు పడుతూండగా బయలుదేరకూడదంటారు."

"ఏ శకునశాస్త్రంలో రాసుందో!" ఎగతాళిగా అన్నాడు మూర్తి.

శ్యామసుంధరి మాట్లాడలేదు. ఏ శకునశాస్త్రంలో రాసున్నదీ చెప్తే ప్రయాణం ఆపుకుంటారా అని అడగాలనుకుంది. తన పిచ్చిగాని, శకునాలంటే నమ్మకంలేని ఆయన తన శంకల్ని అనుమానాల్ని లెక్క చేస్తారా. అయినా తను ఉండబట్టలేక శకునం సంగతి ప్రస్తావిస్తుంది. ఫలితంగా తనకు దక్కేది వెటకారమూ, వెక్కిరింపూను. తమకిది మామూలే.

ఆలోచిస్తూ నిల్చున్న శ్యామసుందరిని చూస్తూ అన్నాడు మూర్తి: "నాకీ శకునాలమీద నమ్మకం లేదని నీకు తెలుసుగా. అయినా నే వెళ్ళటం రాచకార్యాలమీద, శుభకార్యాల మీద కాదుగా. నన్నొదిలి రేపు పుట్టబోయేనీపుత్రుడికి నేర్పుకుందువుగానిలే నీనమ్మకాల్ని." శ్యామసుందరి బుగ్గమీద చిటికవేసి గడపదాటి కారువైపు నడిచాడు మూర్తి.

భర్త మాటలకి సిగ్గును మూట కట్టుకుంది శ్యామసుందరి. ఏవేవో మధురమైన వూహాలు మదిలో మెదలగా పరవశంతో తేలిపోతూ 'నమ్మకాల్లో మాత్రం ఈ తండ్రికి కొడుకు కాడా వాడు' అనుకుంది.

● ● ●

పుడమి తల్లిపై కోపగించుకుంటున్నదా అన్నట్లు గర్జిస్తోంది ఆకాశం. కారు మేఘాలు నాలుగుదిక్కులా పరుచుకున్నాయి. సన్నని చినుకుల్తో ప్రారంభమైన వర్షం రాను రాను తీవ్రతరమైంది. నేలంతా జలమయం కావటంతో ఏదిరోడ్డో ఏదికాదో కూడ తెలియటంలేదు. కాని మూర్తికి ఆ రోడ్డు క్రొత్త కాదు. అర్ధరాత్రైనాసరే, పిడుగులు పడ్తున్నా సరే, సగంనిద్రపోతూనైనా అంగుళం కూడా ప్రక్కకు తొలగకుండా రోడ్డుమీదనే కారును నడుపగలడు. ఆ మాటకొస్తే ఆ రోడ్డు తనకంటే ఆ కారుకే బాగా తెలుసేమో!

ప్రతిరోజూ సాయంత్రం ఇరవై మైళ్ళ దూరంలోవున్న పట్నానికివెళ్ళి ప్రొద్దుపోయేవరకూ మిత్రులతో కాలక్షేపం చేసిరావటం అతనికి పరిపాటి.

వర్షం పడుతూనే వుంది. వర్షం పడుతున్న శబ్దంలో కారుచేసే శబ్దం కలిసిపోయి లయబద్ధంగా వీనులకు విందుగా వినిపిస్తోంది. ఫ్రంట్ మిర్రర్‌పై పడే చినుకుల్ని ఎప్పటికప్పుడు తుడుస్తోంది "వైపర్." అప్పుడు ఒకచిన్న నీటిబిందువు ఎలాగో లోపలికి చింది మీద పడుతోంది. మూర్తి మనసు తడిగా, మెత్తగా, మత్తుగా, హాయిగా వుంది. చల్లటి వాతావరణం. కొంచెం వెచ్చదనం కోసం సిగరెట్ వెలిగిస్తే యింకా హాయిగా వుంటుందనిపించింది. కారు నడుపుతూనే సిగరెట్ తీసి వెలిగించాడు మూర్తి.

వర్షం తగ్గేసూచన లేమీ కన్పించలేదు. ముసురుపడ్తుందేమో ననిపించింది మూర్తికి. "ముసురు" అనుకోగానే శర్మ గుర్తుకొచ్చాడు. ఉత్సాహంలేని ఊకదంపుడు కబుర్లు చెప్తుంటే "ఏమిటోయ్ ముసురు" అంటాడు శర్మ, ముసురు అనే పదానికి ఒక మెటఫారికల్ మీనింగును ఆపాదిస్తూ. కాని రాధాపతి అలా కాదు. ముసురు పట్టినప్పుడు ఫ్రిజిడేర్‌లోని గడ్డపెరుగుతో భోంచేస్తే బ్రహ్మానంద పడ్తాడు. తనకు? వెచ్చగా సిగరెట్ పీలుస్తూ, ముసురుతో పెనవేసుకున్న కొన్ని మధుర సంఘటనల్ని నెమరువేసుకుంటూ కారు నడపటం సరదా!

ఇలాంటి వాతావరణంలో ఇంటి వద్ద కూర్చోమంటుంది శ్యాం. పాపం శ్యాం ఉత్త అమాయకురాలు. మూఢనమ్మకాలు జాస్తి. అలాగని ఫక్తు సనాతనపరురాలూ కాదు. తన అల్ట్రా మోడరన్ అలవాట్లకు ఏ విధంగానూ అభ్యంతరం చెప్పదు. ఎటొచ్చీ శకునాల వద్దనే ఆమె తరహా తనకు నచ్చదు. అప్పుడప్పుడు అనిపిస్తుంది కూడా. తనని ఎక్కడికీ వెళ్ళనీకుండా యింట్లోనే వుంచడానికి శకునాలని ఒక కారణంగా మాత్రమే వాడుతున్నదేమోనని, గర్భవతులు ఎక్కువ కాలాన్ని భర్తల సాన్నిధ్యంలో గడపటానికి ఉబలాటపడతారని, అది వారికెంతో ఆనందాన్నిస్తుందని అంటారు, అందుకే కాబోలు! ఆ కోరిక ఈరోజు ఆమెలో కొట్టవచ్చినట్టు కన్పడింది. కాని పట్నం వెళ్ళకుండా ఎలా మానటం? ఈరోజు తప్పకుండా వస్తానని మాట యిచ్చాడు సూర్యానికి, సూర్యం ఇవాళ పార్టీ ఏర్పాటు చేశాడు, తనకు గెజిటెడ్ ప్రొమోషన్ వచ్చిన సందర్భంలో. గెజిటెడ్ ఆఫీసరైనా సూర్యం తండ్రి దగ్గర మామూలు సూర్యనారాయణశాస్త్రి మాత్రమే. ఇంట్లో ఉన్నంతసేపూ సంధ్యావందనం, ఆచారం, అట్టహాసమూను. బైటకొస్తే చాలు, ఆచారాల్ని, నియమాల్ని మూటగట్టి లోపల చిలుకకొయ్యకు తగిలించి వస్తాడు. సూర్యాన్ని తల్చుకుంటే నవ్వు

విహారి, శాలివాహన

వస్తుంది కూడా. 'వాడికేరా తండ్రి చాటు అఫీసరు' అని మిత్రులంతా అటుబు పట్టిస్తుంటే నవ్వుతూ ఊరు కొనేవాడు. అంతేమరి, కొంతమంది ఇతరులకోసం ఆచారాల్ని ఆచరిస్తారు. మూఢనమ్మకాలను మెళ్ళో వేసుకుంటారు.

మూఢనమ్మకాలకు మూలపురుషుడిలాంటివాడు మురహరి. మురహరి తనకు బావ అవుతాడు. తన వయస్సువాడే. హైస్కూల్లో తెలుగు పండితుడు.

ఆరోజు ...

తను నిజంగా మర్చిపోలేని రోజు—

ఆ సంవత్సరమే తనకు చదువు ముగిసింది. చెల్లెల్ని చూద్దామని వాళ్ళవూరు వెళ్ళాడు.

చెల్లెలికిపురుడొచ్చేరోజులు. అప్పటికే అస్వస్థతగా వుంది. తన రాక ఆమెకు ఎంతో సంతోషాన్ని కలుగజేసింది. ఆరోజు స్వయంగా వంట చేసి తన కిష్టమైన పిండివంటల్ని చేసిపెట్టిందికూడా. ఆ రాత్రికే నొప్పులు ప్రారంభమయాయి కమలకు. ఎవరో దాదివచ్చింది. రేపటి దాకా పురుడురాదు లెమ్మనిచెప్పి వెళ్ళింది ... అర్థరాత్రయింది. చెల్లెలికి నొప్పులెక్కువయాయి. విపరీతమైనబాధ ననుభవిస్తూ కేకలు పెడుతోంది.

'బావా చెల్లెల్ని హాస్పిటల్లో జాయిన్ చేయించరాదూ", అన్నాడు తను.

"ఇప్పుడా!"

"ఆఁ, ఇప్పుడే. అర్ధరాత్రైనా ఇలాంటి కేసుల్ని ఎడ్మిట్ చేసుకుంటారు. నే చెప్తాను, రా ..."

"అదికాదు మూర్తీ ...!"

"ఏమిటి మీ అనుమానం ?"

"ఈ పూట అమావాస్య ."

"అయితే ?"

"అయితే ఏముందీ. అమావాస్య. అంతే." ఈమాత్రం తెలియదా అన్నట్లు చూశాడు మురహరి.

అప్పటి కర్థమైంది తనకు, హాస్పిటల్‌లో చేర్పించటానికి తిథి వార నక్షత్రాలు చూస్తున్నారని. తనకు కోపం వచ్చింది. అసహ్యం వేసింది కూడా. ప్రాణాలు పోతున్నా మూఢ విశ్వాసాల ముసుగుల్లోనించి తప్పుకోటానికి యిష్టపడని మూర్ఖులు. ఇక దేశమే గతిని ప్రగతిని సాధిస్తుంది ?

'అమావాస్య అని మీన మేషాలు లెక్కిస్తూ కూర్చుంటే అవతల ప్రాణం దక్కటం కష్టమౌతుంది బావా! చదువుకున్నవాడివి. కొంచెం వివేకాన్ని ఉపయోగించు' కొంచెం కఠినంగానే అన్నాడు.

మురహరి మెత్తపడ్డాడు. కాని, అతని తల్లి ససేమిరా అంది. ఐనా తను లెక్క చేయదల్చుకోలేదు. చెల్లెల్ని హాస్పిటల్లో చేర్పించాడు.



డాక్టరు ఇంజక్షనిచ్చింది. తెల్లవారేవరకూ పురుడురాదని చెప్పింది. మురహరితల్లి కోడల్ని కనిపెట్టుకుని హాస్పిటల్లోనే కూర్చుండిపోయింది. తనూ, మురహరి యింటికొచ్చి పడుకున్నారు.

బాబును ప్రక్కలో పడుకోపెట్టుకున్న మురహరి నిద్రపోలేదు. తనలో తను కుమిలిపోతున్నాడు.

"ఏమిటి బావా నీకి పిచ్చి" అన్నాడు తను.

"బాబుకు కమల అన్యాయంచేసి పోతుందేమో" అన్నాడు మురహరి చిన్నపిల్లవాడిలాగా.

"ఊరికే భయపడకు, ఇప్పుడేమయిందని ? కమలను హాస్పిటల్లో చేర్చాంకదా! డాక్టరుకూడా ఫరవా లేదంది !"

"వాళ్ళు అలాగే అంటారుమూర్తీ!" భారంగా నిట్టూరుస్తూ అన్నాడు మురహరి.

తర్వాత ఎవరూ మాట్లాడలేదు. బాబు నిశ్చింతగా నిద్రపోతున్నాడు. దూరాన ఎక్కడో లారీ హారను మాత్రం విన్పిస్తోంది. తనకు మ్రాగన్నుగా నిద్రపట్టింది. ఏదో అరుపు విన్పించి లేచాడు. మురహరి లేచి కూర్చొని చేతుల్లో ముఖాన్ని దాచు

రోడ్డుప్రక్కనున్న చెట్టు క్రిందకు మూర్తి కారును పోనిచ్చాడు.

మిరుమిట్లుగొలిపే మెరవు. మిన్ను విరిగి మీదపడ్డట్లుగా శబ్దం. కారు వేగాన్ని తగ్గించాడు మూర్తి.

ఎదురుగా వంతెన కూలిపోయి వుంది. మూర్తికి గుండె ఆగిపోయి నట్లయింది. వంతెనమీద పిడుగు పడింది కాబోలు! తను కొంచెము ముందుగా వచ్చి వున్నట్లయితే పిడుగుపడే సమయానికి తన కారు వంతెనమీద వుండేదా!

ఆ ఆలోచన రాగానే అతను భయకంపితుడయాడు. కుక్కపిల్ల అడ్డంరాకుండా వుంటే ... వడగళ్ళు పడకుండా వుంటే ... తన కారు వేగాన్ని తగ్గించకుండా వుంటే ... పిడుగుపడే సమయానికి కారు వంతెనమీద వుండేదా?

మూర్తి కారును వెనక్కు త్రిప్పాడు. వర్షం తగ్గుముఖం పట్టింది. ఆకాశం వెలవెలాపోయింది, తన కుట్ర ఫలించలేదని కాబోలు. కారును ఆపి, ఆ పల్చని వెలుగులో కుక్కపిల్లకోసం చూశాడు. చెట్టు క్రింద చుట్టుప్రక్కల వెతికాడు. కాని అది కన్పించలేదు. తన ప్రాణాల్ని రక్షించటానికి వచ్చింది కాబోలు! లేకపోతే ఆ సమయంలో, ఆ నిర్జన ప్రదేశంలో, ఆ వాతావరణంలో కుక్కపిల్ల తన కారుకు అడ్డంగా రావటమేమిటి?

ఇదంతా తెలిస్తే శ్యాం బెంబేలు పడుతుంది కాబోలు. "మూశారా చినుకుల్లో బయలుదేరకూడదని చెప్తే నామాట విన్నారూ! పైగా నావన్నీ మూఢనమ్మకాలని ఎగతాళి చేశారు! అదృష్టం బాగుండబట్టి గండం గడిచింది. ఇకమీదటనైనా బయలుదేరే టప్పుడు శకునమూగ్రా చూసుకొని మరీబయలుదేరండి!" అంటుంది కాబోలు. "జరిగేదేదో జరుగుతుంది కాని ఈ శకునాలు జరగవలసిన దానిని తప్పిస్తాయా?" ఈ మాటంటే శ్యాం వప్పుకోదు ...

మూర్తి అసలీ సంగతులన్నీ శ్యాంకు చెప్పకూడదని నిశ్చయించుకున్నాడు ...

అలవాటును తప్పించి పూర్తిగా చీకటి పడకమునుపే యిల్లు చేరే తనను చూసి 'శ్యాం' ఏమనుకుంటుందోనని ఆలోచించుకుంటూ కారును స్టార్టు చేశాడు మూర్తి.

□□□

● ఒకడు : నేను పంపిన చెక్కు అందిందా ?

మరొకడు : రెండుసార్లు అందింది. ఒకసారి మీ నుంచి, ఇంకోసారి బ్యాంక్ నుంచి.

మనసు-మనుసు

కె. త్రిపుర

రామనాథం గేటుదాటి నాలుగడుగులువేసి ఒక్కసారి వెనక్కితిరిగి చూశాడు. గేటుకు అటూ యిటూ వున్న స్తంభాల మధ్యలో ఒక నల్లరాతిపలక మీద, మెరుస్తున్న బంగారపు రంగు అక్షరాల్లో "శ్రీనిలయం" అన్నది తెలుగులోను, ఇంగ్లీషులోను కూడా వుంది. ఆ అక్షరాలు కన్పించటానికే అమర్చిన బల్బు వెలుతురులో అవి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఇవతలివేపుకూడా యింటి యజమాని పేరు "రాజారావు, బి. కాం.," అతను వ్యాపారం చేస్తున్న సంస్థ పేరు వివరంగా రాసి వున్నాయి. గేటుకు తోరణంలాగా ఏదో మొక్క అందంగా అల్లుకుంది. గేటుకు అటూ యిటూ వున్న స్తంభాలమీది పెద్ద పెద్ద, గుండ్రటి తెల్లటి బల్బులు ఇంటి ముందు వెలుగును విరజిమ్ముతున్నాయి.

"దైవలీల ఎంత చిత్రమైనదీ!" అనుకున్నాడు రామనాథం నిట్టూరుస్తూ. "ఈ సిరీ, సంపదా, అనుభవించడానికి ఒక్కనలుసును కలిగిస్తే, భగవంతుని సొమ్మేం పోయిందో?" అనుకున్నాడు రామనాథం ధోవతీ చివర ఎత్తిపట్టుకుని ముందుకు నడుస్తూ. చీకటి పడుతోంది. కూరల మార్కెట్ కేసి వెళదామనుకున్నా చిల్లర డబ్బులేవీ లేవనే మాట గుర్తొచ్చింది. ఇవాళెందుకో తను ఆ ఇంటిని వదిలి మామూలుగా రాలేక పోతున్నాడు. "కారణం!"— తన స్వంత సమస్యేదో ఆ యింటితో ముడిపడ్డట్టు అనిపిస్తోంది. "భగవంతుడుఎంతచిత్రమైనవాడూ!" అనుకున్నాడు మరోసారి నడుస్తూ రామనాథం. అతనికి జ్ఞాపకమున్నంతలో యీ రెండేళ్ళలోను, ఆఇంటిని గురించి, దేవుని లీలగుంచి, విస్తుబోవడం యిది రెండోసారి.

రెండేళ్ళక్రితం రాజారావు జన్మదినోత్సవ సందర్భంలో డిన్నర్ వంటు చేయడానికి రామనాథం ఆ యింటితో మొదటిసారిగా పరిచయం అయ్యాడు. ప్రత్యేకంఓ వీశెడు జీడిపప్పు వేయించి ఉప్పు కారం చల్లమన్నారు. ఓ స్టీలు గిన్నెలో పోసి మూతపెట్టి వంటింట్లో గట్టు మీద పెట్టాడు తీసుకుంటారుగదా అని.

పదిరోజుల తరువాత మరేదో

పండగొస్తే మళ్ళీ వంటకి రామనాధమే వచ్చాడు. ఆశ్చర్యం! ఆ గిన్నె అదే మూల, సగం చీమలుపట్టి తినేసిన జీడిపప్పుతో వుంది. మూత ఎప్పుడు పడిపోయిందో! మొదటిసారిగా అతని మనసు చివుక్కు మన్నది. "ఈ ఐశ్వర్యం కూడా యింతేగాబోలు. తమచేత్తో ఒకళ్ళకి పెడితే ఎంతో సంతోషిస్తారుగదా! వీళ్ళ కాగీత లేదు" అనుకున్నాడు రామనాధం.

ఇవాళ మళ్ళీ ఆ విషయాలన్నీ గుర్తొస్తున్నాయి. తనా యింట ఎప్పుడూ అగౌరవంగా చూడబడలేదు. అందుక్కారణం తన నిజాయితే. తొమ్మిదిమంది పిల్లల సంరక్షణకోసం తనెప్పుడూ అధర్మ మార్గాన నడవలేదు. తను దరిద్రుడని తెలిసీ భగవంతుడు బిడ్డల్ని ప్రసాదిస్తున్నాడంటే అంతుపట్టని భగవంతుని తత్వమేదో వుంది. తనకి చేతనయిన రెండురకాల ఉద్యోగాలు, యితరత్రా వంటపనీ, అదీ చేస్తూ రెక్కలు ముక్కలయ్యేట్టు చేస్తున్నా రాబడి నెలకి నూటపాతిక మించడం లేదు.

ఇల్లు దగ్గరపడుతోంది. ఏటిమీది గాలి చల్లగా తగులుతోంది శరీరానికి. ఓ విధంగా చూస్తే తనూ అదృష్టవంతుడే. ఎండకి ఎండకుండా, వానకి తడవకుండా, ఓపూరిపాకవేర్పరచుకోగలిగాడు. బ్రతికిచెడ్డవాళ్ళకి లోకంలో గౌరవం వుండదు అనుకున్నాడు. చెట్లక్రింద ఉండేవాళ్ళని ఒంటిపూట తినేవాళ్ళనీ తలుచుకున్నప్పుడు జాలితోకూడిన తృప్తి కలుగుతూంటుంది రామనాధానికి.


లోపల అడుగు పెడుతూనే కడసారిపిల్ల జయలక్ష్మి తన విరిగిపోయిన చెక్కబొమ్మని చంకనేసుకుని పరుగెత్తుకొచ్చింది.

"నాన్నా, అక్క ఇంటికి రాలేదు. నువ్వొచ్చేశావా? బావ అలిగాట్ట నాన్నా! ఎక్కడైనా పెళ్ళికొడుకులు అలుగుతారుగానీ......" జయలక్ష్మి వాగుడు యింకా సాగిపోయేదేగానీ, మూడోపిల్ల మాణిక్యం ఒక్క కసురు కసిరింది—"పోయి ఆడుకో జయా" అంటూ.

మారు మాట్లాడకుండా వరండా మూలకి వెళ్ళి కూర్చుంది జయ.

రామనాథం దొడ్లోకి వెళ్ళి కాళ్ళూ-చేతులు కడుక్కొచ్చి నులక మంచం వాల్చుకు కూర్చున్నాడు. కొంచెం దూరంలో పెద్దల్లుడు లాంతరు స్టూలుమీద పెట్టుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. వీధి లైటు వెల్తురు మసక మసగ్గా తాటాకుల దడిమీదనుంచి లోపల పడుతోంది. దూరంగా ఎక్కడో మాధాకవళం వాడి రామనామ స్మరణ "రాముల భజనకు రమ్మని పిలిచిన రానన కే, ఓ మనసా! తలగుడ్డలే తీయండీ! తలలే వంచుతు భజనలు చేయండీ!" వినిపిస్తోంది.

మాణిక్యం మంచినీళ్ళు తెచ్చి



చ్చింది. తాగి గ్లాసు యిచ్చేసి నడుం వాలుస్తూ అల్లుడి మంచం కేసి చూశాడు. రాధ యింకా ఆఫీస్ నుంచి రాలేదా!

తను చేసిన పొరపాట్లలో యిది మొదటిదీ, ముఖ్యమైనదీనూ. పెద్దది రాధకి, ఉపకారమనే పేరుతో అపకారమే చేశాడు. పెళ్ళిచేసి బరువు

దించడంపోయి ఏదో సామెత చెప్పి నట్టు, దూలాన్ని వదిలి దుంగ నెత్తు కున్నాడు. మొగుణ్ణి పోషించడానికి ఏ ట్యూషన్లో ఒప్పుకుంది కాబోలు. ఒక్కనాడూ 'నాకు పెళ్ళిచేసి గొంతుకు ఉరిపోశావు నాన్నా' అనలేదు అను కున్నాడు రామనాథం పడుకున్న అల్లుడికేసిచూసి.

తెరిచివున్న తలుపులోనుంచి వున్న రెండు గుడ్డి దీపాలను ఎలా పంచుకోవాలో తెలీక పోట్లాడు కుంటున్న పిల్లలు కనిపిస్తున్నారు. రెండోది కాంత వెలపల వున్నట్టుంది —దానికి మాణిక్యం వరండా మూలగా చీకట్లో విస్తరివేసింది. ఆ చీకట్లో అదేం తింటోందో?

రామనాథం అటునించి ఒత్తిగిలి పడుకున్నాడు. కొద్దిగా ఒరిగిన కొబ్బరిచెట్టు సన్నని శబ్దం చేస్తూంది. ఆహ్లాద కరంగా చల్లటిగాలి వేస్తోంది.

"తనెంత దురదృష్ట వంతుడు!" అనుకున్నాడు రామనాథం. తాటాకుల దడిదాటి కొద్దిగా వెల్తురు పడుతున్న మునిసిపాలిటీ లైటు తప్ప, చుట్టూ చీకటి.

"నాన్నా, నాన్నా" రామనాథం ఆ పిలుపుకు మెల్లిగా తల తిప్పి చూశాడు. జయ!

"ఏం తల్లీ" అన్నాడు.

జయ తండ్రి మంచం మీద కొద్దిగా చోటు చేసుకుని కూర్చుంది. ఏడేళ్ల జయ మూడోతరగతి చదువుతోంది.

"శైలజ, లేదూ! ... ..." జయ సంభాషణా ప్రారంభం ఎప్పుడూ యిలాగే వుంటుంది.

"లేదూ! ఎక్కడికెళ్ళిందమ్మా?" అన్నాడు రామనాథం నవ్వుతూ.

"అదికాదు నాన్నా ... ..."

"ఏది కాదమ్మా" అన్నాడు రామనాథం రెట్టిస్తూ.

జయ బుంగమూతి పెట్టుకుని తండ్రి గుండెలమీద వేలితో రుద్దు తోంది.

"చెప్పు జయా!" అన్నాడు రామ నాథం.

"ఊహుఁ వెక్కిరిస్తున్నావుగా" ఆ పసిగొంతులోని అభిమానానికి ఎప్పుడూ వివశుడైపోతూనే వుంటాడు రామనాథం.

"నే వెక్కిరించడం లేదమ్మా, చెప్పు, చెప్పు, శైలజ వుందీ, తర్వాత ..." అన్నాడు రామనాథం,

"బూట్లు కొనుక్కుంది నాన్నా! నువ్వు చూళ్ళేదుగానీ ఎంత బాగు న్నయ్యని. చిన్న చిన్న బొమ్మ లున్నయ్యి. మాణిక్యం అక్క కు చూపిస్తే రెండు మొట్టికాయలు మొట్టింది, చూడు నాన్నా" అన్నది జయ తల ముందుకి వంచి తండ్రిని చూడమన్నట్లు.

ఎడంచేత్తో జయ తల తడిమి, కుడిచేత్తో తన గుండెలమీదున్న జయ చేతిని తన చేతిలోకి తీసు కున్నాడు. చిన్నచిన్న రబ్బరుగాజులు రెండు చేతికి తగిలాయి.

"శైలజగాను చిరిగ్గూడా పోతోంది. మన మెప్పుడు కొందాం నాన్నా" అన్నది జయ హఠాత్తుగా.

ఇంతసేపూ కుతూహలంగా వరండా స్తంభాన్నానుకుని వింటున్న మాణిక్యం ఒక్కసారి నిట్టూర్చి లోప లికి నడిచింది. లోపల పిల్లలు అన్నాలు తింటున్నారు. జయ మాటలు ఆరునెల్లుగా వింటూనే వుంది తను. పన్నెండు రూపాయలుపెట్టి ఒకత్తెకి గౌను కొనడం మాటలుగాదు. అన్నయ్య ప్రైవేటుగా బి. ఎ. కి వెళ్ళడంతో యీ యేడు అన్నయ్య నుంచి ఎటువంటి సహాయంలేదు. కాంత టైపు నేర్చుకుంటుందట. తను యింకో సంవత్సరం కష్టపడితేగదా, స్కూల్ఫైనల్ అయ్యేది. పెద్దక్క సంపాదన బావగారి కాఫీకి సరి పోయేటట్టులేదు. మాణిక్యం చిన్నగా నవ్వుకుంది. ఎవరో, ఎక్కడో ఒక జరీచీరకోసం బాధపడ్డట్టు కథ చది వింది. కానీ తనుకి ఒక్క ఇండియన్ ఇంక్ బాటిల్? తన ఊహలు, తన చిత్రకళ యిలా నశించాల్సిందే. ఒక్కరూపాయి లేకనా? అంతే అదీ గాదు. ఎప్పుడూ ఏదో అవసరం పీకెలమీది కొస్తూనే వుంటుంది' అనుకుంది మాణిక్యం. అసలా పిల్ల! తను వేసిన చిత్రాలమీది డబ్బుతో చెల్లెలికి ఒక్కగౌను కొందామన్న తీరనికోరిక.

రామనాథం కూతురికేసి చూస్తు న్నాడు చీకట్లో. చంద్రోదయం కావ డానికి చాలా వ్యవధి వుంది.

ఎనిమిదిమంది పిల్లలూ ఒక ఎత్తూ తొమ్మిదోపిల్ల జయ ఒకత్తే ఒక ఎత్తుగా రామనాథం గమనించి చాలా కాలమే అయింది. ఆ పిల్ల ఆశలు, కోర్కెలు తనస్థితికి నాలుగు మెట్లు పైనే వుండడంచూసి అతి నెప్పుడూ నిర్ఘాంత పోలేదు. కాదా అంతే ఎనిమిదిమంది తర్వాత అయిదో ఆడపిల్లగా పుట్టిన జయ ఏకోరికా తీర్చలేననే విషయం గుర్తొచ్చినప్పుడు అతనికి తప్పకుండా తన దురదృష్టం గుర్తొస్తుంది. మంచి మార్కులతో పెద్దకూతురు స్కూల్ఫైనల్ ప్యాసయినవుడు "ఇహ చదివించలేను" అని చెప్పడానికి ధైర్యం చాల్లేదు. చదువుకోస తండ్రి చదివించడాని కిష్టపడలేదని ఎక్కడ బాధపడుతూందోనని భయపడ్డాడు.

కూతురు "నా స్నేహితురాలి తండ్రి ఒకాయన టైప్ఇన్స్టిట్యూట్

● "నాకో పీడకల వచ్చిందోయ్ రాత్రి"

"ఏమిటది?"

"నాకోసం మా ఆవిడ, సయిరాబానూ దెబ్బలాడుకున్నార్ట. చివరి మా ఆవిడే గెలిచిందట."

నడుపుతున్నాడు. టైప్ నేర్చుకుంటూను నాన్నా' అన్నప్పుడు, కొడుకు బి. ఎ. చదువుతూ యింట్లో గడవని పరిస్థితులలో చెప్పా చెయ్యకుండా ఉద్యోగంలో చేరినప్పుడు 'ఈ పిల్లలు యీ యింటగాదు మరో యింట పుడితే ఎంత సుఖపడేవాళ్ళూ !' అని అనుకోకుండా వుండలేకపోయాడు.

'జయా ! రేపు నిన్నోచోటికి తీసికెడతానేం ? బోలెడన్ని బొమ్మలు బిస్కట్లు, నీ కేవి కావాలంటే అవే. అన్నట్లు నువ్వడిగిన గౌనూ ... ...'

జయ ఆసక్తిగా వినడం గమనించాడు రామనాథం.

పెద్దకూతురు, కొడుకు కబుర్లు చెప్పుకుంటూ లోపలికొచ్చారు. జయ మంచంమీద నుంచి ఒక్క గెంతు గెంతి, రాధ కేసి పరుగెత్తింది. 'అక్కా అక్కా, ఎంచక్కా నేనోచోటి కెడతాగా ? నీకు చెప్పను, ఏమ్మా యివాళ గౌను కొంటానని ... ...'

రాధ, జయమాటల్ని మధ్యలోనే తుంచేసింది.

'ఉండమ్మా నే నిప్పు డే గా వచ్చింది. భోంచేసి తీరిగ్గా మాట్లాడుకుందాం. మాతల్లి ,జయమంచిదమ్మా' అంటూ లోపలకు వెళ్ళిపోయింది.

జయవచ్చి తండ్రి మంచంమీద పడుకుంది. రామనాథం లేచికూర్చుని కూతురికి చిచ్చికొడుతూ వుండిపోయాడు. రామనాథం స్నానానికి లేచే వేళకి జయ నిద్రపోయింది.

● ● ●

భోజనాల బంతికి అల్లుడు, కూతురు యిద్దరూరాలేదు. కొడుక్కీ, తనకే వడ్డించి వుండడంచూసి,

'వీళ్ళే రే?' అన్నాడురామనాథం. పొయ్యి దగ్గర ఏదో పని చేసుకుంటున్న సుభద్రమ్మ వెనక్కి తిరిగి,

'ప్రొద్దుట్నుంచీ, ఒకటే చిటచిట్లాడిపోతున్నాడతడు. ఏం తగాదా వచ్చిందో ఏమో?' అన్నది.

పెళ్ళయిన ఏడాదిన్నరలోనూ యిటువంటివి అలవాటే గాబట్టి ఏం మాట్లాడకుండా ఔపోసన పట్టాడు.

'రేపు జయను రాజారావుగారి భార్య తీసుకురమ్మంది' అన్నాడు రామనాథం సాయంత్రం నుంచీ బాధపెడుతున్న సమస్యను తేలిక మాటల్లో పెడుతూ.

'ఎందుకుట ?' అన్నది సుభద్రమ్మ నవ్వుతూ. కొడుకు తండ్రి సమాధానంకోసం ఒక్కసారి చూచి, అన్నం కలుపుకో సాగాడు.

'ఏం తోచడంలేదుట. రెండు రోజులు వుంచుకుని పంపిస్తానన్నది' అన్నాడు రామనాథం మనసులో చికాకుపడుతూ. అప్పటికి మాణిక్యం వచ్చి గడపమీద కూర్చుంది.

ఆ చికాకు నిజానికి, వాళ్ళడిగినందుకు కాదు. రాజారావుగారి



భార్య 'ఒక ఆడపిల్లను పెంచుకోవాలని వున్నది. మీ ఎరికలో ఎవరన్నా వుంటే చెప్పం'డన్నప్పుడు, 'నా ఎరికలో ఎవరూ లేరండీ, మీరు పెంచుకోవాలనుకుంటే పిల్లలే దొరక్కపోతారా?' అన్నాడు తను. 'లేకపోలేదనుకోండి, అయినా వాళ్ళు నాకు నచ్చలేదు పోనీ, మీ పిల్లల్లో ఒక పిల్లని యివ్వరాదూ? సంతోషంగా పెంచుకొంటూం.' అన్నదావిడ. 'అవును రామనాథం! పంకజం అభిప్రాయం బాగానే వుంది. పోనీ రెండురోజులు వుంచి చూడు. మా అభ్యంతరమేమీలేదు. ఎటొచ్చీ నీదేమరి!' అన్నప్పుడు, తను నిజంగా విస్తుపోయాడు. అసలా ఆలోచన తనకి రాకపోగా పంకజమ్మ అభిప్రాయాన్ని బలపరుస్తూ, రాజారావుగారు చేసిన సూచన విన్నప్పుడు ఏదో భయంగా కూడా అనిపించింది. 'పోనిద్దూ ఒకళ్ళయినా సుఖపడతారు' అనుకున్నాడు. అయినా ఇప్పుడు సుభద్రకి చెప్పాలనిపించడంలేదు- 'పెంచుకోడానికని 'చూద్దాం తొందరేం' అనుకున్నాడు రామనాథం.

'తీసికెళ్ళండి సెలవులేగా' అన్నది సుభద్రమ్మ.

ప్రొద్దుట ఏడున్నరకల్లా తయారై పోయింది జయ. ఉన్న వాటిలోకా స్త

మంచి గౌను—అదీ ఒకచోట కుట్టు పడింది—తెల్లటి పాలబుగ్గలు, ఎర్రటి రిబ్బన్లు అందంగాకుచ్చుపెట్టిన రెండు జడలు, పెద్ద పెద్ద నల్లని కాటుక కళ్ళూ—'జుట్టు మరికొంచెం నల్లగా వుంటేనా !... ...' అనుకున్నాడు రామనాథం, తృప్తిగా కూతురికేసి చూసుకుని.

పంకజమ్మ వీళ్ళని చూస్తూనే, సాదరంగా ఆహ్వానించింది. ప్రక్కనే కూర్చోపెట్టుకుంది జయని. కాఫీ తెప్పించింది తండ్రీ-కూతు ళ్ళిద్దరికీ.

'ఏమ్మా జయా! ఇంక యిక్కడే వుండిపోతావా!' అని పంకజమ్మ అడిగినప్పుడు, రేడియో కవరుమీది అందమైన అబ్బాయి, అమ్మాయి బొమ్మల డిజైను, హాలుమూలల పూలకుండ్లలో పూలు, గోడమీద అందంగా పాకిన వాటరు ప్లాంటు, అద్దాల అలమరు లోంచి మెరుస్తున్న బొమ్మలు, బైట వరండాలో బొచ్చుకుక్క, పైన వేలాడదీసిన కుండ్లలోని రకరకాల పువ్వులు చూసి సంతోషంగా తల వూపింది జయ. నిండు మనసుతో, జయను వదలి గేటుదాటి వెళ్ళిపోయాడు రామనాథం.

● ● ●

రెండురోజులు గడిచిన తరువాత రామనాథం, ఆ యింటి గేటుదాటి లోపలి కొచ్చాడు. రాజారావుగారు యింట్లో లేనట్టుంది. అవిడ పైనవుంది కాబోలు. 'జయ యెక్కడుందో. ఉహుఁ, ఇంకెక్కడుంటుంది? ఆవిడ దగ్గరే వుండి వుంటుంది' అనుకున్నాడు రామనాథం, హాల్లో కుర్చీలో కూర్చుంటూ.

'అరె! వచ్చి ఎంతసేపైంది? రంగనాయకీ! జయమ్మను తీసుకురా!' అన్నది అయిదు నిముషాల తరువాత మేడ దిగొచ్చిన పంకజమ్మ.

'జయమ్మా?' రామనాథం మనసు కలుక్కుమంది. ఇదేం పిలుపూ!

జయ మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది. పరుగెత్తుతూ, గెంతుతూరాలేదు. అంతక్రితం యింటి దగ్గర వేసుకున్న గౌను, జయ వంటి మీదకొద్దిగా మాసివుంది. తలమటుకు నున్నగా దువ్వి, పూలు పెట్టి వున్నాయి.

'బొత్తిగా అన్నం తినడమన్నా చేతకాదు' అన్నది పంకజమ్మ నవ్వుతూ. పంకజమ్మకి నలభైపైన వయసు వుండవచ్చు. మెరుస్తున్న చీరలో, పచ్చగా పూర్తిముస్తాబులో వుంది.

'ఎవరిమాట మీరు చెప్పేది?' అన్నాడు రామనాథం.

'అదే, జయమ్మ సంగతి. ఒక్కటీ సయించదంటుంది. ప్రొద్దుట కొద్దిగా బంగాళాదుంపల వేపుడు వేసుకుంది. మొన్న నసలు అన్నమే తినలేదు. నిన్న బాగానే తింది. రెండుపూటలా జడలు మటుకు రంగనాయకి చేత కుదురుగానే వేయించుకొంది.

అన్నట్టు ఒక మైసూర్ శాండల్ సోప్ కొనిపెట్టాను. సీమ బాదం పప్పుల కన్నా, మామూలు బాదం కాయపప్పులు సయిస్తయ్యిట...'

చిన్నగా నవ్వుతూ, పంకజమ్మ వరసగా చెప్పుకుపోతున్న లిస్టును తెల్లబోయి విన్నాడు రామనాథం. 'ఏవిటిదీ? దాని భోజనానికి కొలబద్ద లేమన్నా పెట్టిందా! వాళ్ళమ్మ ఏం పెడుతుందో, వీళ్లేంతింటారో, మూడో కంటివాళ్ళకు తెలీదు. పిల్లల భోజనాల, అభిరుచుల విషయంలో తనకి శక్తివున్న మేరా తెచ్చిపడేస్తే, వాళ్ళమ్మకి ఓపికున్నవి వండితే వీళ్ళేం తింటారో!'

'దానిమొహం, ఏదో చిన్నపిల్ల' మొహమాటంగా గొణిగాడు రామనాథం.

'చిన్నపిల్లేం ఖర్మలెండి, పెద్ద మాటలే మాట్లాడుతుంది. నిన్నటికి నిన్న, పెద్దరసాలు ఒకడజను, వాళ్ళకీ వీళ్ళకీనని చిన్నరసాలు డజను తెప్పించామా? చిన్నదని చిన్నరసం యిస్తే నేను కోపంగా యివ్వబట్టి పుల్లగా ఉందిట. ఆయనతో యీ గుంటదాని వరసిదీ! ఆయనకి నా మీదసలే అనుమానమా, 'అదేంపని పంకజం' అని నన్నడిగారాయన', అన్నదిపంకజమ్మ కొంచెం సీరియస్‌గా.

షాక్ తిన్నట్లు చూశాడు రామనాథం. కావాలని తెప్పించి యీ పిల్లమీద ఫిర్యాదా! జయకేసి చూశాడు. జయ తండ్రివంకా, పంకజమ్మవంకా చూస్తోంది.

'వెళ్దామా జయా' అన్నాడు రామనాథం తెప్పరిల్లి.

'తీసికెడతారా! ఏం, వుంచండి. ఆయన యింట్లో లేరుకూడాను. రేపు ఆయన వచ్చాక, ఆయనముందే తీసికెడితే నా నేపమేం లేకుండా పోతుంది' అన్నది పంకజమ్మ.

'సరే రేపు తీసికెడతాలేమ్మా' అన్నాడు రామనాథం.

జయ తలవూపింది. జయ యిష్టంగా తలవూపిందో, అయిష్టంగా తల వూపిందో తెలీలేదు.

'చూడండీ, ఈ రోజులు మరీ గడ్డురోజులుగా మారిపోతున్నాయి. మాబోటివాళ్ళ పనే అంతంత మాత్రంగా వుంటే యిహ మీలాంటి వాళ్ళమాట చెప్పాలా? అందుకే లేనివాళ్ల పిల్లయితే నాలుగురోజులు

● 'నేను మూడురకాల కళ్ళజోళ్ళు వాడతాను.'

'మూడెందుకు?'

'ఒకటి దూరపుచూపు ఆనడానికి. ఇంకొకటి దగ్గరిచూపు కోసం. మూడోది ఈరెండూ ఎక్కడున్నాయో వెతకడానికి.'

కడుపునిండా భోజనమన్నా చేస్తుందంటాను నేను. ఆయనది అదో తరహాలెండి. దేవుడికే యిష్టంలేదు, పిల్లల్ని పెంచటం మటుకు ఎందుకంటారాయన. మనకేది యివ్వాలో ఏది యివ్వకూడదో భగవంతుడికి తెలీదా? ఎందుకో యిష్టంలేదు, నాకు పిల్లల ప్రాప్తం లేదుకాబోలు అంటారాయన. కాని పిల్లలుండీ, డబ్బులేకపోతే బాధగాదా? గవర్నమెంటు ఫేమిలీ ప్లానింగంటోంది. ఎందుకూ కుచేల సంతానం, తిన తిండీ, కట్టబట్టా లేకపోయినా. ఎప్పుడో ప్రళయం వచ్చి యీ జనాభా తుడుచుకు పోతుంది. అంతే గానీ, సృష్టికి వ్యతిరేకం చెయ్యగలమా?"

తెల్లబోయిచూస్తూ ఊరుకున్నాడు రామనాథం. అతనికివాళ అంతకన్నా ఏం చేత కావడంలేదు.

"ఇదివరకో పిల్లని తీసుకొచ్చాం. ఆపిల్లా వారంరోజులు, బుగ్గలూ గిగ్గలూపెట్టి బాగానే వుంది. చక్కగా తెల్లటి పక్కమీద స్లోగా ఫానుబెట్టి పడుకోపెట్టేదాన్ని. ఓ రెండు మంచిగౌన్లూ అవీ కొని యిచ్చాను. మర్నాడు ప్రొద్దుట అవన్నీ చంకనిపెట్టుకుని చక్కాపోయింది. నేను నమ్మలేకపోయాను. ఆ మర్నాడు వాళ్ళమ్మ వచ్చి పిల్ల ఉండనంటోందని చెప్పింది. ఏదో సామెత చెబుతారే—ఎంతచేసీ మాఅమ్మవవుతావా? అని. పోనీండి, ఏంచేస్తాం? గీతలేదు" అన్నది పంకజమ్మ.

రామనాథానికి అనుమానంవేసింది, "ఇది తనమీద దెబ్బా ఏమి"టని. అయినా నవ్వుతూ,

"రేపు ప్రొద్దున వస్తాను మరి" అంటూ వెళ్ళిపోయాడు. వెనుకనుంచి పంకజమ్మ నిర్లక్ష్యంగా చూస్తోంది.

● ● ●

ప్రొద్దుట ఎనిమిది కావొస్తోంది, రామనాథంరాజారావుగారితోటలో అడుగు పెట్టేటప్పటికి. ముందున్న తోటలో యిద్దరుపనివాళ్ళు మొక్కలు కత్తిరిస్తూ, గొప్పులు త్రవ్వుతూ పని చేస్తున్నారు. వేసవి అయినా తోట పచ్చగానిగనిగలాడుతోంది. "వాళ్ళు చెప్పినట్టుల్లా విని యీ భాగ్యం అబ్బుకునే గీత ఎవరికో?" అనుకున్నాడు. రామనాథానికి డబ్బును గురించి తమాషా అభిప్రాయం ఒకటుంది— 'డబ్బు దేంవుంది, కుక్కను కొడితేరాల్తుం'దని. ఇది ఏర్పడడానికి కారణం నిరంతరం శ్రమ పడుతూ, దరిద్రంలో జీవిస్తూ— పెరుగుతూ కూడా రూపాయికి బేడవడ్డీ చొప్పున వడ్డీకిచ్చే వాళ్ళని ఎరిగుండడమే! దాంతోసుఖపడ్డా,దాచుకున్నా,కనీసం కడుపునిండా తిన్నా బాగుండిపోను. కాని మస్తుగా ఏ నాటు సారాయో తాగేసి, ఏ పేవ్‌మెంటుమీదో ఒళ్ళెరగకుండా నిద్రపోవడం. ఏం జీవితాలో అనుకునేవాడు.

రాజారావుగారు పేపరు చదువుకుంటున్నారు. రామనాథాన్ని చూస్తూనే "రావయ్యా, రా, పిల్లను తీసికెళ్ళా నన్నావుకేమిటీ?" అంటూ ప్రశ్నించారు.

"ఏం లేదండీ. వాళ్ళమ్మా,అక్కయ్యా బెంగపెట్టుకున్నారు" అన్నాడు రామనాథం నవ్వుతూ, చేతులు నలుపుకుంటూ. ఏమనుకున్నాడో ఏమో. ఒక్క క్షణం రాజారావుగారు రామనాథాని కేసి చూసి "రంగనాయకీ జయను తీసుకురా?"అని కేకేశారు.

రంగనాయకి జయనుతెచ్చి ముద్దు పెట్టుకుని హాల్లో వదిలేసి వెళ్ళింది.

"జయ చాలా బుద్ధిమంతురాలయ్యా" అన్నాడు రాజారావుగారు.

"అమ్మా! బాబుగారికి నమస్కారం పెట్టు వెళదాం" అన్నాడు రామనాథం. జయ నమస్కారం పెట్టింది. రామనాథం రాజారావుగారితోచెప్పి జయ చెయ్యి పట్టుకుని బైటికి నడిపించుకొచ్చాడు.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు రామనాథం గేటు దాటుతూనే. కొబ్బరిమట్టల వెనకాలగా అందంగా హుందాగానిలబడ్డ రెండంతస్తులమేడ గుమ్మాలకి, కిటికీలకి సిల్కుతెరలు వ్రేలాడుతూ కనిపించాయి. దీర్ఘంగా నిట్టూర్చి "నిజం. నేనెవర్ని? దైవలీల శంకించడానికి!" అనుకున్నాడు రామనాథం.

ఒక ఏడేళ్ళ పిల్లని ఓర్చలేని పంకజమ్మ స్వభావం రామనాథానికి నవ్వు తెప్పించింది. "జయా! నిన్ను ఎలా చూశారూ?" అని అడుగుదామని కూడా విరమించుకున్నాడు. అడిగి ఆ పిల్ల మనసులో ఆ యింటిమీద ద్వేషభావాన్ని, తనమీద అలసత్వాన్ని ఏర్పరచటం తప్ప లాభం ఏంవుంటుందీ అనుకున్నాడు. నడుస్తున్న జయని ఎత్తుకుని మెల్లిగా నడవడం మొదలెట్టాడు. ఆ పిల్లమీద చెప్పలేని జాలి పొంగుతోంది. తను అనుకున్నంత దురదృష్టవంతుడు కాడు. తన పిల్లలు దరిద్రాన్ని అసహ్యంచుకుని ఐశ్వర్యంకేసి పోతారని ఎలా అనుకున్నాడూ?

"దింపు నాన్నా, నడవగలను. ఎలా అయాసపడుతున్నావో చూడు" అన్నది జయ తండ్రి గుండె రాస్తూ. జయను దింపుతుంటే ప్రొద్దున పెద్దకూతురిచ్చిన నోట్లు చేతికి తగిలాయి. "ఈ నెల పన్నెండురూపాయలు దాచాను నాన్నా. ఆయన నాలుగు రూపాయలిమ్మని కోపం తెచ్చుకున్నారు. అందుకే తెస్తానన్నరోజుకి గాను తేలేకపోయాను. అనాలుగూ కూడా

త్వరలో యిస్తాను. వెధవది ఇన్నేళ్ళ నుంచీ ఉద్యోగం చేస్తూ పసిదాని మనసు తీర్చలేకపోయాను" అన్నది రాధ ఎనిమిదీ చేతులో పెడుతూ. తన దగ్గరున్న నాలుగూ కలిపి గౌను కొందామనుకున్నాడు.

"జయా! గౌను కొనుక్కుందాం, వస్తావా?" అన్నాడు.

జయ మొహం చిట్లించి "వద్దు నాన్నా" అన్నది. రామనాధం ఆశ్చర్యంగా కూతుర్ని చూశాడు.

"వద్దు! అక్కకి సిరాబుడ్డి-బొమ్మ లేనుకోరూ—అది కొను నాన్నా" అన్నది.

ఇంతసేపు తను గమనించలేదు గాని, జయ అంత ఉత్సాహంగా లేదు. తన కోరికలతో తన్నే బలి చేస్తారని పసిమనసు విరిగిపోయిందా? లేక తనకోరికలని త్యాగం చెయ్య గలగడం నేర్చుకుంటోందా? భయంగా జయను చూస్తూ నడుస్తున్నాడు రామనాధం.

"జయా కోపం వచ్చిందామ్మా" అన్నాడు జయ చిటికెనవేలు పట్టుకుని నడిపిస్తూ.

"ఆ గౌను నాకు వద్దేవద్దు. ఆ డబ్బు వాళ్ళిచ్చారా? అక్కడ చుట్టు కంపుకొట్టే తోటమాలి ముద్దుపెట్టుకున్నాడు. బుంగమీసాలు వాడూను. ఆ గౌనుకోసమేగా నన్ను వాళ్ళింట్లో దింపావు నాన్నా" అన్నది జయ గంభీరంగా. అయినా కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి.

"ఛా పాపిష్టివాణ్ణి. నీ మనసు తెలుసుకోలేకపోయా నమ్మా. ఈ డబ్బు రాధక్క యిచ్చింది గౌను కొనిపెట్టమని. వాళ్ళది కాదిది, ఒట్టు!" అన్నాడు రామనాధం – జేబులో నోట్లుతీసి జయ అరచేతిలో పెట్టి గుప్పిటమూస్తూ, అనుమానంగా చూస్తున్న జయకు నమ్మకం కలిగేలా చెబుతూ.

"నిజం?" ఒక్క వెలుగు వెలిగింది జయ ముఖం. "నిజం తల్లీ" ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు.

జయ చేతిలోని నోట్లు జాగ్రత్తగా తండ్రి జేబులో పెట్టేసింది. "నువ్వు మంచివాడివినాన్నా! కాదు, కాదు. మనింట్లో అందరూ మంచివాళ్ళే నాన్నా" అన్నది జయ రెండరచేతుల్లోనూ తండ్రి బుగ్గలమీద రాస్తూ.

ఇల్లు దగ్గరపడుతోంది. చంకలోనుంచి దిగిపోయి ఉత్సాహంగా చేతులు తిప్పుతూ కబుర్లు చెబుతున్న జయను చూస్తుంటే ప్రపంచంలోని సుఖదుఃఖాలన్నీ త్రాసులో ఒకవేపు, జయా తనూ ఒకవేపు కనిపిస్తున్నారు రామనాధం కళ్ళకి. □□□

సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

(గతసంచిక తరువాయి)

జయంతిని మిసెస్ కరుణాకరం ఇంటిదగ్గర దించేసి శేఖరం క్లబ్‌కి వెళ్ళిపోయాడు. కారులోంచి దిగుతున్న జయంతిని చూసి కరుణాకరం బట్లర్ నివ్వెరపోయాడు. చాలా రోజులక్రితం అప్పుడప్పుడు వనితా విహార్ పనిమీద వచ్చి గంటలు గంటలు ఇక్కడ వరండాలో వెయిట్ చేయడం వాడికి తెలుసు. వాడు ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే ప్రమీల పరుగెత్తుకుంటూ వచ్చి జయంతిని చేయిపట్టుకుని ఆదరంగా లోపలికి తీసుకు వెళ్ళింది.

"అదేమిటి మీరు రారూ!" అంది కార్ బ్యాక్ చేసుకుంటున్న శేఖరాన్ని.

"నాకు పనుంది. మొత్తానికి తొమ్మిది లోపల వస్తాలే!"

"అంతేనా? ఆడవాళ్ళటైమని—"

"నీ మొహం!" నవ్వేశాడు శేఖరం.

"తప్పకుండా రావాలిసుమా!" ప్రమీల చెయ్యి వూపుతూ అంది.

లోపలికి వస్తూండగా—"మీరలా ఉన్నారేం?" అని సమాధానంకోసం చూడకుండా "ఈ చీర చాలాబాగుంది. కాదు కాదు. ఈ చీరలో మీరు చాలా బాగున్నారు" అంది.

జయంతికి కొద్దిగా ఆశ్చర్యం అన్పించింది. ప్రమీల యింత మాట్లాడుతుందని, అందులో వంటరిగావున్నప్పుడు తనతో—అస లనుకోలేదు. జయంతిని చూస్తూనే మిసెస్ కరుణాకరం లేచి వచ్చింది.

"ఎవరీ అమ్మాయి?" ఎవరో అడిగారు.

"జయంతి. మా ప్రమీల స్నేహితురాలు."

జయంతి ఓ ప్రక్కగా కూర్చుండిపోయింది.

అక్కడున్న వాళ్ళలో చాలామంది అపరిచితులే. ఒకళ్ళిద్దరు మటుకు జయంతిని చూసి ఆగి "ఈ

అమ్మాయి వనితావిహార్ సెక్రటరీ కదూ!" అని సందేహం వెలిబుచ్చబోతే వెంటనే మిసెస్ కరుణాకరం తను కల్పించుకుంటూ 'ఇప్పుడు కాదు. మానేసి చాలా రోజులైంది. మా ప్రమీల స్నేహితురాలు. మీమెళ్ళో ముత్యాలదండ చాలా బాగుందండీ! ఎక్కడ కట్టించారు?" అంటూ ప్రసంగం మరో వైపుకి మార్చేసేది.

జయంతి వచ్చిన అరగంటకి రేఖారాణి వచ్చింది. వస్తూనే దగ్గరికివచ్చి 'బాగున్నావా!' అని ఆప్యాయంగా పలకరించి ప్రక్కన కూర్చుంది. బట్టలుధరించే పద్ధతిలో రేఖారాణి యెప్పటికప్పుడు నూతనత్వం ప్రదర్శిస్తూంటుంది. అక్కడున్న అందరిదృష్టి రేఖారాణిమీదనే వుంది. ఆవిడ అదేం తెలియని అమాయకురాలిలాగా జయంతి కెదురుగా కూర్చున్న ఆవిడతో కులాసాకబుర్లు ప్రారంభించింది.

మరో అయిదు నిమిషాల్లో మహాకాయాన్ని యీడ్చుకుంటూ సుమిత్రాదేవి వచ్చింది. ఉన్నఒళ్ళు దాచుకోవాలనిగాని, దాన్ని ఎదుటవాళ్ళు వింతగా చూస్తారనిగాని ఆవిడకి బాధలేదు. లేకపోతే శరీరాన్ని గురించిన వ్యంగ్యోక్తులకి అలవాటు పడిపోయిందో! ఆవిడ వస్తూనే ప్రమీల దగ్గరకెళ్ళి బుగ్గగిల్లి వెంటతెచ్చిన అట్టపెట్టె యిచ్చి "యెంతసేపయింది వచ్చి?" అని రేఖారాణిని పలకరిస్తూ ప్రక్కన కూర్చుంది. ఇద్దరూ కొద్దిసేపట్లోనే వనితావిహార్ గొడవల్లో పడిపోయారు. మాటల మధ్యలో అటూ యిటూ ఊరికే యథాలాపంగా చూస్తున్న సుమిత్రాదేవి జయంతిని చూసి "ఎవరు జయంతే! నేను గుర్తుపట్టనేలేదు సుమా" అంటూ రేఖారాణి ముందునుంచి వంగి అడిగింది.

"మీరు చూశారనుకున్నాను. గుర్తుపట్టకపోవడమేమిటి? మారిపోయిందంటూరా?"

"బోలెడంత. మనిషి మొహంలో పెద్దరికం వచ్చింది - అందులో ఆ బట్టల్లో—"

"అమ్మాయి వుంటోంది యెవరి దగ్గిరో మరిచిపోయారా?" అంది రేఖారాణి.

"ఏం జయంతీ! శేఖరం కులాసాగా వున్నాడా? ఈమధ్య బొత్తిగా నల్లపూసయిపోయాడు" అంది సుమిత్రాదేవి.

"తీరుబడి వుండద్దూ!" జయంతి వైపు చూస్తూ అర్థయుక్తంగానవ్వింది రేఖారాణి.

జయంతి కెందుకో వాళ్ళమాటలు ముళ్ళు గుచ్చుకున్నట్టు, జెట్టులు పాకినట్టు అన్పించింది.

ఇంతలో ప్రమీల పరుగెత్తుకుంటూ వచ్చి జయంతి చెయ్యిపట్టి లేవదీస్తూ "నా ఫ్రెండ్స్‌కి నిన్ను పరిచయం చేస్తాను, రా! వాళ్ళు నువ్వెవరు అని అడుగతున్నారు." అంది.

జయంతిలేచి నిశ్శబ్దంగా ప్రమీల వెంట వచ్చేసింది.

"ఇంతకీ అదృష్టవంతురాలు"

"ఇంకా ఎన్నాళ్ళు ఆ అదృష్టం!"

వెనకనుండి ఇద్దరి మాటలూ మెల్లగా స్పష్టంగా వచ్చి జయంతి చెవుల్ని సోకినాయి.

ప్రమీల ఫ్రెండ్స్ కొద్దిసేపు అదీ యిదీ మాట్లాడి వెళ్ళిపోయారు. అయినా జయంతి యింకా అక్కడే నిలబడిపోయింది. ఇంకా వాళ్ళ మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. వాళ్ళకెందు కంతకోపం? మధ్యలో తనేం జేసింది? వెళ్ళి సూటిగా శేఖరాన్ని యెందుకు అడగలేరు? ఇక్కడిలా నిలబడి చూస్తూంటే వద్దన్నా పాతరోజులు జ్ఞప్తికి వస్తున్నాయి. వనితావిహార్ సెక్రటరీగా చేసినప్పుడు సర్క్యులర్‌మీద చిన్న సంతకంకోసం ఈయింటి వరండాలో తనెంతసేపు పడిగాపులు పడి కూచుందో. లోపలికిపిలిచిమిసెస్ కరుణాకర మెంత నిర్లక్ష్యంగా మాట్లాడేది! ప్రమీల కనీసం కన్నెత్తైనా చూసేదికాదే! ఇప్పుడెందుకీ విలువ?

"సెక్రటరీ"
సీరియల్ - జరిగినకథ

అనగనగా ఒక జయంతి. ఆమెకొక బామ్మ. జయంతికి వనితా విహార్‌లో సెక్రటరీ ఉద్యోగం దొరికింది. కాని అక్కడి సభ్యురాండ్ర ప్రవర్తన గిట్టక రాజీనామా యిస్తుంది. ఆమెకు రాజశేఖరం అనే ధనిక యువకుడు తన వద్ద ఉద్యోగమిస్తాడు. అతడు అవివాహితుడు, మంచివాడు. అతని వద్ద ఉద్యోగం మొదట బాగానే వుంటుందిగాని, కొన్ని విచిత్రసంఘటనలుజరిగి ఆమె అతన్ని ఏవగించుకోనడం ప్రారంభిస్తుంది. రాజీనామా ఇస్తుందిగాని ఆనాడే ఆమెకు పెద్దజబ్బుచేస్తుంది. ఆ జబ్బులో రాజశేఖరమే జయంతిని, ఆమె బామ్మను తన ఇంటికి తీసుకువెళ్ళి ఆదరిస్తాడు. జబ్బు తగ్గాక అతని ఇంటినుంచి వెళ్ళిపోవాలనుకుంటుంది. ఇంతలో ఆమె బామ్మ హఠాత్తుగా గుండె జబ్బు వచ్చి చనిపోతుంది. ఇక చేసేదిలేక ఆమె రాజశేఖరం ఇంట్లోనే వుండిపోతుంది.

"మీరుకాదు కావాల్సింది వాళ్ళకి. మీద్వారా శేఖరంగారు" శివరామ్ మాటలు గుర్తుకువచ్చాయి. వాళ్ళ మనసులో అభిప్రాయాలేంమార లేదు. ఊసరవెల్లుల్లా రంగులు మారుస్తున్నారంతే!

"ఇదేమిటి? ఇక్కడ నిలబడిపోయావేం?" వెనకనుంచి ప్రమీల గొంతువినీ వులిక్కిపడి చూసింది. ప్రమీల ప్రక్కన శేఖరం వున్నాడు. హాలులో అందరికీ యెడంగా ఓమూల నిలబడి వుంది జయంతి. ఇద్దరి చూపులు క్షణంసేపు కలునుకుని వెంటనే విడిపోయినాయి.

"రండి రండి!" మిసెస్ కరుణాకరం ఆదరంగా ఆహ్వానించింది. రేఖారాణి, సుమిత్రాధేవి కూడా లేచి ఎదురుగుండా వచ్చారు. శేఖరం చేతిలోవున్న పెట్టెఒకటి ప్రమీల కందిస్తూ, మిసెస్ కరుణాకరంతో "నాకు పనుంది వెళ్తాను" అన్నాడు. "అపుడే—" కళ్ళు వెడల్పుచేసి కనుబొమలెత్తి ఆశ్చర్యం వెలిబుచ్చింది.

"రేపు ఓ ముఖ్యమైన పనుంది. కాగితాలు చూసుకోవాలి. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది" వాచి చూసుకుంటూ అన్నాడు. రేఖారాణి శేఖరాన్ని తినేసేటంత తీవ్రంగా చూస్తోంది. కాని, శేఖరం వాటిని గమనించినట్టే లేదు.

వాళ్ళెంత బలవంతం చేసినా శేఖరం వినలేదు. "రా జయంతీ!" అని పిలిచి ప్రమీల చెవిపట్టుకుని మెలేస్తూ "విష్యూ ఏ హాపీ బర్త్‌డే మాడమ్" అన్నాడు.

"బాబోయ్! ఇప్పుడే పుట్టిన పాపాయిని అంతగట్టిగా చెవి మెలిపెట్టగూడదు. దేవతలు శపిస్తారు" అంది ప్రమీల.

"ఫర్వాలేదు. ఈ పాపాయి పుట్టగానే చీరకట్టుకుందిగా!"

"అసలు మీరు బహుమతులు ఇవ్వనన్నారుగా!"

"నువ్వసలు తీసుకోనన్నావుగా!"

"ఇస్తే తీసుకోకుండా ఎలా?"

"తీసుకుంటావని తెలిసి తేవడం మానేస్తే యెలా?"

ఇద్దరి సంభాషణకి మిసెస్ కరుణాకరం మొహం ప్రసన్నమైంది.


అందరికీ మరోసారి చెప్పి బైటికి వచ్చేశాడు. దోవపొడుగునా ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోయారు.

ఆ రాత్రి ఎంత ప్రయత్నించినా జయంతికి నిద్రపట్టలేదు. మనసులో ఎవరో "ఇక్కడినుంచి వెళ్ళిపో" అని అరవసాగారు. "ఎక్కడికి వెళ్ళను? అతను వెళ్ళనివ్వడు."

"తెలియకుండా పారిపో!"

"వెతికి పట్టుకోడూ!"

"అందుకని ఈ అశాంతిని భరిస్తూ బుర్ర పగలకొట్టుకుని పిచ్చిదానివవుతావా?"



"పిచ్చిదాన్నెందుకవుతాను! నేనేం అతనికోసం పాకులాడుతున్నానా? అతన్ని వల్లో వేసుకోవాలని ఆరాటపడుతున్నానా? నాకెందుకు భయం—"

మనసు మాట్లాడలేదు.

"ఇంకెప్పుడూ అలా వాళ్ళలోకి వెళ్ళకు. సాధ్యమైనంతవరకూ దూరంగా వుండు. పట్టించుకోకు—"

"జయంతీ! ఇంకా నిద్రపోలా?" హఠాత్తుగా వినిపించిన ప్రశ్నతో ఉలిక్కిపడింది. గదిలో దీపం లేకపోయినా అవతలగదిలోనుంచివస్తున్న వెలుగులో గుమ్మంలో శేఖరం నిలబడివుండడం కనిపించింది.

'నిద్రపోతున్నాను' దిండులో తల దూర్చుకుంటూ అంది.

'ఇందాకటినుంచి గమనిస్తున్నా! దిండులో తలని ఎందుకలా పొర్లిస్తున్నావు. తల నొప్పిగావుందా ?'

'లేదు లేదు. నేను నిద్రపోతున్నాను.'

'నిద్రపోయేవాళ్ళు నిద్రపోతున్నానని చెబుతారా ?'

'ఇప్పుడే మెలకువ వచ్చింది నాకు.'

"అబద్ధం ఆడాల్సిన అవసరం యేమొచ్చింది యిప్పుడు ?' గదిలోకి వచ్చి లైటువేస్తూ అన్నాడు.

'వద్దు — వద్దు. లైటు తీసెయ్యండి … …'

'ఎందుకు ?'

'వెలుగు చూడాలంటే అసహ్యం వేస్తోంది.'

'మొన్న మొన్నటిదాకా చీకటి చూస్తే భయంగా!'

జయంతి మాట్లాడలేదు.

శేఖరం లైటుతీసిదగ్గరగావచ్చాడు. జయంతి కెందుకో భయంతో గుండెలు కొట్టుకోసాగాయి. అతడొచ్చి మంచంమీదకూర్చుంటే? దగ్గరకి తీసుకుంటే? గుప్పెళ్ళు బిగించి గుద్దుతుంది, గోళ్ళతో పీకుతుంది, పళ్ళతో కరుస్తుంది. 'నాకసహ్యం నిన్నుచూస్తే. బైటకి పో!' అని అరుస్తుంది.

శరీరం బిగబట్టుకుని యెదురు చూస్తోంది. కాని అతనలాటిదేం చేయలేదు.

'కర్టెన్లుగూడా తీసివుంచావెందుకు! కిటికీలోంచి చలిగాలి వెయ్యడంలా? నీమంచం బాగా దగ్గరగావుంది. వేసెయ్యనా?' కర్టెన్లు సరిచేసి వెళ్ళిపోబోతూ క్షణంసేపు ఆగి 'క్షమించుజయంతీ! ఇంకెప్పుడు నిన్నలా ఒంటరిగా వాళ్ళలోకి పంపను. నువ్వు ప్రమీలతో కొద్దిగా కులాసాగా కాలం గడుపుతావని ఆశించాను. నేను రాగానే ఒంటరిగా ఓమూల నిలబడిపోయిన నిన్ను చూడగానే నాకర్థమైపోయింది. నువ్వు వాళ్ళలో కలవలేవని.' అని ఆగి 'అదే మంచిదేలే' అన్నాడు.

మండిపోతున్న మనసు మీద మంచు వర్షం కురిసినట్టయింది.

'మనశ్శాంతి కోసం బలవంతాన పంపితే మరింత అశాంతితో తిరిగి వచ్చావు.అదంతామర్చిపో! నిద్రపో!' అన్నాడు మృదువుగా.

జయంతికి హఠాత్తుగా యేడుపొచ్చేసింది. అతనిచేయి అందితే దాన్ని రెండుచేతులతో పెనవేసుకుని పడుకుంటే నిశ్చింతగా నిద్ర పడుతుంది అన్పించింది. పైకి నోరుతెరిచి చెప్పెయ్యాలనుకుంటుండగానే శేఖరం మెల్లగా తలుపులు జేరవేసి వెళ్ళిపోయాడు.

తర్వాత చాలాసేపటికిగాని నిద్ర

పట్టలేదు. అంతవరకు అతను మేలుకునేవున్నట్టు తలుపుల సందుల్లోంచి వస్తున్న వెలుతురు చెప్పింది.

గదిలో కిటికీచువ్వల్ని అనుకుని పరధ్యాసగా నిలబడింది జయంతి. ఇంతలో శేఖరం లోపలికి వచ్చాడు. అతన్నిచూసి మెల్లగా అక్కడినుంచి వెళ్ళిపోబోయింది.

శేఖరం వారిస్తూ 'జయంతీ! ఆగు' అంటూ జేబులు తడుముకుని 'టిక్కెట్స్ తెచ్చాను. రవీంద్ర భారతిలో చండాలిక డాన్స్ డ్రామా వుంది. నువ్వు, సునంద వెళ్ళండి. శివరామ్‌కూడా వస్తాడు. ఫోన్‌చేశాను' అన్నాడు టిక్కెట్టు తీసియిస్తూ.

శివరామ్ పేరు వినగానే జయంతి ముఖం వికసించింది. అతనీమధ్య కన్పించి చాలారోజులైంది.

టిక్కెట్లు తీసుకుని వెళ్ళబోతూ 'మరిమీరు?' అంది ఆగి.

'నేనా? నేను రావడంలేదు.'

'ఓహో!' జయంతి యింకేం మాట్లాడకుండా వెళ్ళబోయింది.

'ఆగు! నేను కూడా రావాలా? చెప్పు. నువ్వు రమ్మంటే వస్తాను,' ప్రసన్నంగా ఆత్రుతని అణుచుకుంటూ అడిగాడు.

'వద్దు. పొద్దుపోయినా ఫర్వాలేదు. శివరామ్ వస్తాడుగా!'

శేఖరం మొహంలో ప్రసన్నత పోయింది. 'నాకు తెలుసు. అందుకే అతనికి ఫోన్‌చేశాను.'

జయంతి మొహం యెర్రబడింది. మరేం మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

ప్రోగ్రాంకి సునంద రాలేదు. జయంతి, శివరామ్ ఇద్దరే వెళ్ళారు. అనుకున్నట్టే చాలా ఆలస్యం అయింది. అద్భుతంగావున్న నృత్యనాటికతోపాటు మధ్యమధ్య శివరామ్ వాత్సల్యపూరితమైన వాక్కులతో జయంతి మనసులో కలిగిన ఉత్సాహం మొహంలోను, కళ్ళలోను ప్రతిఫలిస్తోంది.

ఇంటికి తిరిగి వస్తుండగా "మీతో గడిపిన క్షణాల్లో నాకెంతో తృప్తి మనశ్శాంతి కన్పిస్తోంది శివరామ్' అంది.

'అది నా అదృష్టం' అన్నాడు. సంభాషణ ఆపైన పెరగలేదు.

● మతిమరుపు భర్త : 'ఇవ్వాళ నా జేబులోంచి ఎవడో పెన్ను కొట్టేశాడు.'

భార్య : 'వాడు మీ జేబులో చెయ్యిపెట్టడం తెలియలేదా ?'

భర్త : 'తెలిసింది గాని, నా చెయ్యే ననుకున్నా.'

ఇంటికి వచ్చేసిన తర్వాత కారు దిగి మెట్లెక్కి తనతోపాటు లోపలికి వస్తున్న శివరామ్‌ని 'లైట్లులేవు. ఆయనింకా తిరిగి రాలేదులా వుంది' అంది జయంతి.

'అయితే నే వస్తానుమరి' శివరామ్ ఆగిపోయాడు.

'మీకు నా కృతజ్ఞత నెలా తెలియపరచాలో తెలియటంలేదు.'

శివరామ్ మౌనంగా వూరుకున్నాడు.

'ఎప్పుడైనా నీనుంచి యేదయినా నాక్కావాలంటే కాదనవుగదూ!'

'ఉహు.'

'ఎప్పుడూ యెలాంటి పరిస్థితుల్లో కూడా—'

'యెప్పుడూ అనను ...' ధృడంగా అన్నాడు.

'థ్యాంక్సు! ప్రపంచంలో నీలాంటి మిత్రుడున్నాడని గుర్తుకొస్తే చాలా ధైర్యం అన్పిస్తుంది. ముఖ్యంగా యిలాంటి పరిస్థితుల్లో—'

'నాకంటే విలువైన వాళ్ళు మీకున్నారు. అది మీరు గుర్తించటం లేదు.' జయంతి నిట్టూర్పు విడిచింది.

'పొద్దు పోతోంది వస్తాను.'

'సరే మెనీమెనీ థ్యాంక్సు' జయంతి చేయిజాచింది.

'మీరు పదేపదే ఆమాట అని నన్ను సిగ్గుపడేలా చేయకండి. వస్తా గుడ్‌నైట్' జయంతి చేతిని అంటీఅంటనట్టు అందుకుని వదిలేసి వెళ్ళిపోయాడు.

అతను కారు తిప్పుకుని గేటు దాటి వెళ్లేవరకూ అక్కడే నిలబడి పోయింది. కారు వెళ్ళిపోయింది.

ఈరోజు యెంత బాగా గడిచింది! తనెంత మూర్ఖురాలు.

శివరామ్ సాన్నిధ్యంలో యింత కులాసాగా వుంటుందని తెలిసికూడా అతన్ని నిర్లక్ష్యం చేస్తోందెందుకు?'

దగ్గరగావున్న తలుపులు తోసి చీకటిగావున్న హాల్లోంచి లోపలికి వెళ్ళేందుకు లైటు వేసింది. వేస్తూనే వులిక్కిపడింది. స్విచ్‌మీద చెయ్యి తియ్యాలన్న విషయంకూడా మర్చిపోయింది. హాల్లో మధ్యగావున్న సోఫాలో శేఖరం వెనక్కి జారగిలపడి కూర్చున్నాడు. అతని రెండు చేతులు కళ్ళమీదున్నాయి.

'మీరు—మీరిక్కడ వున్నారా?' తడబడుతూ అంది.

'ఇప్పుడే—వచ్చిపదినిమిషాలైంది. ఎలాగూ నువ్వొచ్చే టైమయింది. కలిసి భోజనం చెయ్యొచ్చని కూర్చున్నాను.' అతని కంఠధ్వనినిబట్టి మేలుకొనే వున్నాడని తెలుస్తోంది.

'మీరు—మీకు మా మాటలు విన్పించలేదూ?'

'నేను వినాలని ఉద్దేశించి అన్నవి కాదుగా!' కళ్ళు తెరిచి జయంతి వైపు చూస్తూ అడిగాడు. అతని



మొహం చాలా అలసటగా ఉంది. క్రాఫ్ కొద్దిగా చెరిగింది. జయంతి మొట్టమొదట సెక్రటరీగా చేరిన రోజుల్లో ఉదయం వుల్లాసంగా వెళ్ళి ఆ మీటింగ్స్ ఆ గొడవల్లో యిలాగే మధ్యాహ్నం భోజనానికి విసుగ్గా, అలసటగా వచ్చి కుర్చీలో వాలి పోయేవాడు.

'చెప్పు. నేను వినాలని అన్న వేనా?'

జయంతి కాదన్నట్టు తలూపింది.

'ఐతే నేను వినలేదు. సరేనా? త్వరగా బట్టలు మార్చుకురా! భోజనం చేద్దాం. నాకు ఆకలి వేస్తోంది'. జయంతికి తన మొహం సరిగ్గా కన పడనీయకుండా లేచి వెళ్ళిపోయాడు.

జయంతి చాలాసేపు అక్కడే నిలబడిపోయింది.

● ● ●

పై సంఘటన జరిగిన దాదాపు వారంరోజులకి—జయంతి గదిలో పుస్తకం తిరగేస్తూ కూర్చుంది. వేళ పట్టున తినటం, యెవరైనావస్తే బాతాఖానీ కొట్టడం, లేకపోతే పుస్తకాలు చదవడం తప్ప యింకేంపని లేదు.

అక్కడికీ సునంద పిల్లలకి స్వెట్టర్లు అల్లి యిచ్చింది. కామేశ్వరమ్మగారికి ప్లాస్టిక్ వైర్‌తో ఒక బ్యాగ్ చేసి యిచ్చింది. కాని అవేం మనిషికి అలసట తెప్పించేవిగాని, మానసికంగా తృప్తి నిచ్చేవిగాని కావు. క్రిందటి రోజున సునంద వచ్చినప్పుడిలాగే "ఏం తోచటంలేదు. అంటే ఏదో పని కల్పించుకో! లేకపోతే శేఖరాన్ని అడుగు. అతనే చూపిస్తాడు" అని సలహా యిచ్చింది. అతన్ని అడిగితే బాగానే వుంటుంది. కాని ఎలా అడగాలన్నదే సమస్య! అతనువేసే ఎదురుప్రశ్నలకి తట్టుకోవాలంటే భయం. ఆరోజు చండాలిక డ్రామాకి వెళ్ళివచ్చింతర్వాత శివరామ్‌తో తన మాటలు విన్నాడని భయపడింది తను. కాని అత నది పట్టించుకున్నట్టేలేదు. మామూలుగానే ఉన్నాడు. రెండు మూడు రోజులవరకూ జయంతికి ఏదో దొంగతనం చేసినట్టు అనిపించింది. శేఖరం విశ్రాంతి తీసుకునే సమయం యిది. సునంద సలహా గుర్తు తెచ్చుకుని లేచివెళ్ళింది.

జయంతి లోపలికి వచ్చేసరికి శేఖరం గదిలో కూర్చుని మేజోళ్ళు వేసుకుంటున్నాడు.

"ఈ యింట్లో అందరూ పనిచేస్తున్నారు-" ఉపోద్ఘాతంగా అంది.

శేఖరం తలెత్తి విస్మయంగా చూశాడు. జయంతి చూపులు తిప్పేసుకుంటూ, "నాకే సిగ్గేస్తోంది. నేనొక్కదాన్నే - యే పనీపాటు లేకుండా కూర్చుని తింటున్నాను."

"బాగుంది. తినడం పనికాదని ఎవరంటారు!" గంభీరంగా అన్నాడు.

"పరిహాసం గాదు. నిజంగా అడుగుతున్నాను. మీరు నాకేదైనా పని చూపించాలి."

"ఏ పనిచేస్తావో చెప్పు."

"ఇదివరకు సెక్రటరీగా ఉన్నప్పుడు ఏం చేసేదాన్నో అది-"

"బాగానే వుంటుంది. కాని మరి సునంద భర్తని తీసెయ్యాల్సి వస్తుంది." జయంతి మౌనం వహించింది. పాపం! వాళ్ళకి శేఖరం ఈ ఉద్యోగం యిచ్చినప్పటినుంచి నిశ్చింతగా సుఖంగా వుంటున్నారు. రోజుకు కనీసం రెండుమూడు సార్లయినా సునంద శేఖరం ఉపకారం జ్ఞప్తి చేసుకోకుండా వుండదు. హఠాత్తుగా యీ ఉద్యోగంపోతే- జయంతి కిది యిష్టం అన్పించలేదు. అసలు దానికి శేఖరం ఒప్పుకుంటాడన్న నమ్మకంకూడా లేదు.

"పోనీ-యింకేదైనా-"

శేఖరం గదంతా పరిశీలిస్తూ "ఏం పనిచేస్తావునువ్వు? నాకేంకనిపించడం లేదు" అన్నాడు.

"ఏదైనాసరే-"

సాక్ పూర్తిగా తొడుక్కున్న శేఖరం "యేపనైనా సరేనా? ఆత్మగౌరవం లాంటిదేదీ అడ్డురాదా?" అన్నాడు.

మొహంలో కోపం తొంగి చూసినా నిగ్రహించుకుని "ఊహు!" అన్నట్టు తలూపింది.

"అయితే - ప్రస్తుతం నా కంటికి కన్పిస్తున్నవి ఇవి. నా బూటు రోజూ పాలిష్ చెయ్యడం-నేను రాత్రిపూట వేసుకునే పంచె, షర్ట్ రోజూ ఉతకటం-యింకా-" అంటూ తలెత్తాడు. కాని జయంతి అప్పటికే గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

మర్నాడు అర్జెంటు పనిమీద బైటకివెళ్ళడానికి బైలుదేరిన శేఖరం బట్టలేసుకుని గబగబా బూట్ల దగ్గర కొచ్చి వాటినిచూసి.

"వాసూ!" కోపంగా అరిచాడు.

వాసు పరుగెత్తుకొచ్చాడు.

"వళ్ళు దగ్గరుంచుకునేనా యీ పాలిష్ చేసింది? ఏమిటీపద్ధతంతా! నాప్యాంట్ వుండాలా తగలడాలా?" అన్నాడు చిరాగ్గా.

వాసు భయంగా మౌనం వహించి చూస్తూండి పోయాడు.

"మాట్లాడవేం? నిద్ర పోతూ చేశావా?" శేఖరం మరింత కోపంగా కసిరాడు.

"అవి—అవి—ఈరోజు నేను చేయలేదండి!"

"మరెవరు చేశారు?"

"అమ్మగారండీ! నేనుచెబుతుంటే విననేలేదు—"

"అమ్మాయిగారా!" శేఖరం వెనక్కు తగ్గాడు. అంతే. ఓహో! ఇప్పుడర్థమైంది. నిన్న తమాషాగా అన్నమాటలు నిజంగానే సీరియస్‌గా తీసుకుందన్నమాట! శేఖరం మొహంలో కోపం యెగిరిపోయింది. కాని ప్రసన్నతనిపైకి కనపర్చకుండా,

"అమ్మాయిగారు నాబూట్లుతుడిచేటట్లయితే నువ్వెందుకిక్కడ? గాడిదలు కాయడానికా? బుద్ధిలేదూ! వెళ్ళు. వెళ్ళి త్వరగా యింకో జత పాలిష్‌చేసి తీసుకురా! అర్జెంట్" అన్నాడు.

వాసు తూనీగలా పరుగెత్తాడు. మరో అయిదు నిమిషాల్లో నిగనిగలాడుతున్న మరోబూటు తీసుకొచ్చి శేఖరం కాళ్ళ దగ్గర పెట్టాడు.

"అమ్మాయిగారేం చేస్తోంది."

"బట్టలుతుకుతున్నారండి——"

అమ్మాయిగారు బూట్లు తుడవడమే గాదు యింకాచాలాపనులుచేస్తోంది, అన్నట్టుంది వాడి ధోరణి.

"బట్టలుతుకుతోందా?" వులిక్కిపడుతూ, "పనిమనిషి యేమైనాడు" అన్నాడు.

● నిన్ను ఇంత నమ్మినవాణ్ణి ఎలా మోసం చేశావయ్యా?"

"నమ్మనివాణ్ణి మోసం చెయ్యడమెలాగయ్యా?"

"ఉన్నాడండీ! దొడ్లో యేదోపని చూస్తున్నాడు."

"నేను రమ్మంటున్నానని పిల్చుకురా!" బూటు తొడుక్కుంటూ అన్నాడు. వాసు మళ్ళీ పరుగెత్తాడు.

అయ్యగారు యెందుకో అర్జెంట్‌గా పిలుస్తున్నారంటే పనిచేస్తున్న వాడల్లా వదిలిపెట్టిఆత్రంగా పరుగెత్తు కొచ్చాడు. వాడొచ్చేసరికి శేఖరం నిలువుటద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు.

"పిలిపిం...రా!" గుమ్మంబైట ఒదిగి నిలబడి వినయంగా అడిగాడు.

"ఈరోజు తారీకెంత?" వెనక్కి తిరక్కుండానే అడిగాడు శేఖరం.

"తారీఖా!" ఆశ్చర్యంతో తల మునిగినంతపనైంది వాడికి. తారీఖు అడగడానికి తనని పిలవటం ఏమిటి?

శేఖరం వెనక్కు తిరిగి "తారీకెంత? నిన్నే-" అన్నాడు రెట్టిస్తూ. పనిమనిషి నెత్తిగోక్కుంటూ నిలబడిపోయాడు. గిన్నెలు తోముకునే వాడికి, దొడ్లు వూడ్చుకునేవాళ్ళకి తారీఖులేం గుర్తుంటాయి, ఒక్క పహాలీతప్ప.

"వాసూ తారీకెంతరా?"

"పదండి!" ప్రక్కగా నిలబడిన వాసు సగర్వంగా చెప్పాడు.

"ఇదుగో! ఈ నెలజీతం. ఇది తీసుకుని నువ్వు తక్షణం దయచేయ్" జేబులోంచి డబ్బుతీసి గిరాటెట్టాడు శేఖరం.

"బాబుగారూ!" వాడు పూర్తిగా బిత్తరపోయాడు.

"అవున్రా! అమ్మాయిగారు నా బట్టలుతుకుతుంటే నువ్వెందుకు? నా నెత్తి నెక్కడానికా? వెళ్ళు-" కోపంగా అన్నాడు.

అయ్యగారి కోపంలో అంతరార్థం యిట్టే కనిపెట్టేసినవాడు వెంటనే చేతులు నలుపుకుంటూ మొత్తుకుంటున్న మొహంతో "నేనేం సెయ్యనండీ. బాత్‌రూమ్‌లోంచి వెళ్ళిపొమ్మని, బట్టలు లాక్కుంటే యేం సెయ్యాలో మీరే జెప్పండి. పొరపాటయి పోయింది. ఈసారికి సెమించండి?" అని లెంపలేసుకున్నాడు.

గదిలోకి వచ్చి క్రిందపడిన డబ్బు తీసుకుని కళ్ళ కద్దుకుని శేఖరానికి అందిస్తూ "పిల్లలుగలోణ్ణి. తమ దయమీద బతుకుతున్నాం. ఇంకెప్పుడూ చెయ్యను. సేస్తే తన్ని తగిలెయ్యండి" అన్నాడు.

శేఖరం క్షణంసేపు వాడినితీవ్రంగా చూసి "సర్లే—పో! ఒకసారియిచ్చింది తీసుకోవడం నా కలవాటులేదు. రాఖీ పండుగవస్తోందిగా! నీపిల్లలకి బట్టలు కుట్టించుకో. ఇంకోసారి ఇలాటిది నా చెవిని పడిందంటే బాగుండదు" అన్నాడు గంభీరంగా.

ఈ సారి యింకొంచెం ఆశ్చర్యపోయినవాడు ఆనందంతో వికసించిన మొహంతో వాసువంక విజయ గర్వంతో చూస్తూ డబ్బు జేబులో దోపుకుని వెళ్ళిపోయాడు.

• • •

ఆ రోజు, మర్నాడు బైటపనులతో శేఖరానికి వూపిరి సలపలేదు. భోజనానికికూడా యింటికి రాలేనంత గొందర్లో ఉండిపోయాడు.

మూడో రోజు మధ్యాహ్నం—భోజనం అయిన తర్వాత గదిలో మంచంమీద పడుకుని పుస్తకం తిరగేస్తున్నాడు. ఇంతలో జయంతి లోపలికి వచ్చింది. శేఖరంచూసి చూడనట్టు వూరుకుని పేజీలు త్రిప్పసాగాడు.

"మీరు కొంచెం వాసుని, పనిమనిషిని కేకలు వెయ్యాలి—" ఫిర్యాదు చేస్తున్న ధోరణిలో అంది.

"ఎందుకు?" పుస్తకంతీసి ఆశ్చర్యపోతున్నట్టుచూసి,

"ఏం అపరాధం చేశారువాళ్ళు?" అన్నాడు.

"మొన్న, నిన్న, ఈ రోజుకూడా నేను మీబూటు తుడవబోతే వాసు వాటిని లాక్కుని 'నేనేం చేస్తా, గాడిదలుకాస్తానా?' అంటూ వాటిని నాకసలు అందనివ్వలేదు. పనిమనిషేమో అసలు బాత్‌రూమ్‌లో అడుగు పెట్టేందుకే వీల్లేకుండా గుమ్మానికి కడ్డంగానిలబడి 'వీల్లేదండీ! మీరు బట్టలు పిండితే నేనెందుకిక్కడ? ఎవరి నెత్తినెక్కటానికి?' అన్నాడు.

శేఖరం మొహానికి పుస్తకాన్ని పూర్తిగా చాటుచేసుకున్నాడు.

"మీ రిది అపహాస్యంగా తీసుకోవద్దు."

"నన్నేం చెయ్యమంటావు?"

"వాళ్ళని పిలిచి కేక లెయ్యండి."

"ఎందుకు? తీసుకున్న జీతాలకి న్యాయంగా పని చేస్తున్నందుకా?"

"లేకపోతే ఉద్యోగంలోంచి తీసెయ్యండి."

"నా వల్లగాదు. వాళ్ళకి మీ సునంద మొగుడులా పిల్లా జెల్లా ఉన్నారు."

"ఐతే—నాకు ప్రత్యేకంగాఏదైనా పని చూపించండి" మొండిగా అంది జయంతి.

"అంత ప్రత్యేకంగా పట్టుదలెందుకు? కాలక్షేపానికా? లేక ఋణం తీర్చేసుకోడానికా?"

"మీ రెలా అనుకున్నా సరే—" నిర్లక్ష్యంగా అంది.

"నువ్వు చెయ్యాలంటే ఎవరూ అడ్డురాకుండా వుండాలంటే కొన్ని పను లున్నాయి."

"చెప్పండి—"

"నువ్వు చెయ్యనంటే-"

"చేస్తానని చెప్పడంలా?"

"అయితే విను, నా జుట్టుకి నూనె రాసి తలదువ్వాలి. నేను స్నానం చేస్తుంటే వీపుకి సోప్ రాయాలి-"

జయంతి కళ్ళు వెడల్పు చేసుకుని చూడసాగింది.

"నేను సాయంత్రం వచ్చేసరికి నేను తెచ్చిన చీరల్లో నాకు చాలా యిష్టమైన దానిని ధరించి, నీట్‌గా తయారై, కాఫీ కప్పుతో ఎదురొచ్చి-" శేఖరం వాక్యం పూర్తి కానేలేదు. ఇంతలో ఠపీమని ఏదో వచ్చి పడటంతో వులిక్కిపడి అటు చూశాడు. అప్పటికే టేబిల్ ప్రక్కగా నిలబడిన జయంతి దాని మీదున్న పుస్తకాలన్నీతీసి బలంకొద్ది వరసగా విసరసాగింది. వర్షంలా గబగబా పడుతున్న పుస్తకాలనుంచి దెబ్బలు తగలకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తూ "చాలోయ్! జయంతీ – ఆగు" అంటూ అరిచాడు శేఖరం. పుస్తకాల పరంపర రావడం తగ్గిన తర్వాత శేఖరం గట్టిగా వూపిరి పీల్చుకుని తలెత్తిచూశాడు. జయంతి అప్పటికే అక్కడి నుంచి పారిపోయింది.

గదిలోకివచ్చి భళ్ళున తలుపులు మూసుకున్న జయంతికి శేఖరం మాటల్లో పరిహాసం, కనుకొలకుల్లో కొంటెతనం, పెదవుల చివర చిరునవ్వు గుర్తొస్తేనే ఒళ్ళు భగ్గుమనిమండటం మొదలు పెట్టింది. ఏమిటి అతని వుద్దేశ్యం! కేవలంఅతనిచేతిలో కీలుబొమ్మ అనుకుంటున్నాడా? అసలు సీరియస్‌గా మాట్లాడడమే మానేశాడెందుకు! ఇంట్లోంచి వెళ్ళి పోతానంటే వెళ్ళిపోనివ్వడు! పోనీ వుంటే విలువగా చూడడు. ఇదేం మర్యాద! అసలు అతనెవరు? తనెవరు? ఇలాటి పరిస్థితుల్లో భగవంతుడెందుకు తోసివెయ్యాలి? ఏంచెయ్యలేని ఆవేశంతో మనసంతా కోపంతో నిండిపోయిన జయంతికి దుఃఖం ముంచుకొచ్చింది. కన్నీళ్ళతో కనురెప్పలు బరువెక్కాయి.

పది నిమిషాలైన తర్వాత శేఖరం వచ్చి తలుపుతట్టి,

"జయంతీ!" అని పిలిచాడు. జయంతి పలుకలేదు.

"తలుపుతీయి. నిన్నే." ఇంకోసారి పిలిచాడు. అప్పటికీ మాట్లాడలేదు. తలుపుతీయలేదు.

రెండుమూడుసార్లు పిలిచి సమాధానం రాకపోవడంతో అతను వెళ్ళిపోయాడు.

● ● ●


"జయంతీ! సాయంత్రం అంతా వస్తున్నారు. అలా ద్రాక్షతోటని చూడడానికి వెడదాం."

"సరే!"

"రావడానికి యిష్టమేనా?"

"నా ఇష్టాయిష్టాలతో పనుందా?"

శేఖరం చూస్తుండి పోయాడు.



జయంతి తలెత్తలేదు. పూసలబ్యాగ్ అల్లుతూ కూర్చుండి పోయింది.

కొంచెం ఆగి "పోనీ ఎవరెవరు వస్తున్నారో అడగవేం?" అన్నాడు.

"కుతూహలం లేదు."

"ఎందుకని?"

"వచ్చే వాళ్లెవరో తప్పకుండా మీకు ఆప్తులై వుంటారు కాబట్టి."

"అంటే నీ ఉద్దేశం?"

"ఏంలేదు."

శేఖరం ఓ అడుగు ముందుకివేసి "పదే పదే నిన్ను మాట్లాడించాలని చూస్తున్నాననికదూ నీకీ లోకువ?"

"అస లెందుకు చూడాలి—"

"అందుకని? బిచ్చగాడిని విదిలించినట్టు విదిలిస్తావా!"

జయంతి చురుగ్గా తలెత్తి అన్నింటికీ మీ మీద ఆధారపడినదాన్ని నేను. యాచకురాలినినేను" జయంతి వాక్యం పూర్తి చేయనేలేదు. గది లోకి వాసు తొంగిచూస్తూ "మీ

కోసం మినిస్టర్‌గారి పి.ఏ. వచ్చాడు' అన్నాడు శేఖరాన్ని వుద్దేశించి.

'వస్తున్నా—కూర్చోమను.'

వాసు వెళ్ళిపోయాడు. వాడి వెనకే బైటకి వెళ్ళిపోతున్న శేఖరం గుమ్మం దగ్గర ఆగి తల తిప్పి జయంతివైపు చూస్తూ 'మాటలు పెరిగినకొద్దీ మనసులు నలగడంతప్ప ప్రయోజనంలేదు. మనిద్దరిమధ్య స్పర్ధ పుట్టించాలనుకోవటం నీ ధ్యేయంగా పెట్టుకుంటే నేను కాదనను. కాని—ఒకటి మటుకు గట్టిగా హెచ్చరిస్తున్నాను. ఎప్పటికైనా నువ్వందులో ఓడిపోయి లొంగిపోక తప్పదు' అని వెళ్ళిపోయాడు.

● ● ●

నాలుగు గంటలవుతుండగా ద్రాక్షతోటదగ్గరికి వచ్చారు. మిగతా వాళ్ళెవరో జయంతికి తెలియదు. వాళ్ళమటుకు మూడు గంటలకే అక్కడికి వచ్చేస్తారని భోజనాల దగ్గర శేఖరం మాటలద్వారా తెలిసింది.

కొన్ని యెకరాలమేర రాతిస్తంభాలకి అల్లిబిల్లిగా పెనవేసుకున్న పచ్చటితోట- కారులోంచి వస్తుంటే అల్లంత దూరానికే కన్పిస్తోంది. సాయంత్రం ప్రొద్దుతిరిగి పోవడంతో యెండ చల్లబడిపోయింది. చల్లటిగాలి హాయిగావుంది. కారు తోట దగ్గరికివచ్చి ఆగింది. ఆ చివర బాగా మూలకి యింకా చాలా యెకరాలు ద్రాక్ష తోటకి సిద్ధం చేయబడుతున్నాయి. రోడ్డువారగా దగ్గరగా కొద్దిదూరంలో కన్పిస్తున్న తోటలో కొంతభాగం రాజశేఖరానిది. అందులోనే పడమటి వైపుగా చిన్న కాటేజ్ వుంది.

కారులోంచి దిగగానే శేఖరం కారు ప్రక్కనపెట్టి కాటేజ్ వైపు వేలుపెట్టి చూపిస్తూ 'అరుగో! అక్కడున్నారువాళ్ళు వెళ్ళు. నేనిప్పుడే మేనేజర్‌తో మాట్లాడి వస్తాను' అని సమాధానం కోసం చూడకుండా గబగబా గార్డెన్‌వైపు వెళ్ళిపోయాడు. రాతి స్తంభాలకి దట్టంగా అల్లుకుపోయిన పచ్చటి తీగలతో పక్వానికొచ్చి తయారైన ద్రాక్ష గుత్తులు భారంగా వేళ్ళాడుతున్నాయి. వాటి దగ్గర పనిచేస్తున్న చాలామంది కూలీలు గుత్తుల్ని జాగ్రత్తగా కత్తిరించి బుట్టల్లో నింపుతున్నారు. కొంతమంది ఆడకూలీలు ఓ ప్రక్కగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కోసిన గుత్తుల్లోంచి పాడయిపోయిన పళ్ళని వేరుచేస్తున్నారు. అంతా సందడిగా, కంటికి ఆహ్లాదంగా వుంది.

జయంతి మెల్లగా కాటేజ్‌వైపు వచ్చింది. ముందు బంగాళాపెంకున్న చిన్నవరండా వుంది. దాన్నిప్రక్క సన్నజాజితీగ దట్టంగా అల్లుకుని వుంది. తీగెనిండావున్న తెల్లటిమొగ్గలు విడడానికి తొందరపడుతున్నట్టు పిల్లగాలిలో మెల్లగా ఊగుతున్నాయి. లోపల్నించి యెవరివో మాటలు విన్పిస్తున్నాయి. ఎవరున్నారో యేమిటో! రేఖారాణి, కరుణాకరం వాళ్ళుంటే? వాళ్ళమధ్య కూర్చుంటే మాటలు రానట్టే కాదు. అసలు పూర్తిగా మతిపోయినట్టే అనిపిస్తుంది. చివరికి యెలా కూర్చోవాలో, ఏ విధంగా చూడాలో కూడా అర్థంగాదు.

జయంతి మెల్లగా సందేహిస్తూ వరండా ఎక్కి గుమ్మంలో అడుగు పెట్టింది.

లోపల వాలుకుర్చీలో డాక్టరుగారు కూర్చుని కళ్ళద్దాలని చేతిరుమాలుతో తుడుచుకుంటున్నారు. ఆయన ప్రక్కనే చిన్న స్టూలుమీద కూర్చుని వున్న కామేశ్వరమ్మగారు జయంతిని చూస్తూనే 'రా! రా! ఇదిగో సునందా! మీ స్నేహితురాలు వచ్చేసింది' అన్నారు.

అదే గదిలో కిటికీ దగ్గరగా నిలబడి బైటకి చూస్తున్న శివరామ్ వెనక్కు తిరుగుతూ 'అన్యాయం సుమండీ! మమ్మల్నింత ముందుగా రమ్మని వూదరబెట్టి మీరుఆలస్యంగా రావడం.' శివరామ్ వాక్యం పూర్తి చెయ్యనేలేదు. సునందలేచి దగ్గరగా వస్తు 'లోపలికిరా' అంది.

జయంతి లోపలికివచ్చి ఒక్కసారి గుండెలనిండా గాలిపీల్చుకుంది. అంతా తనకి కావలసినవాళ్ళే! తన ఆప్తులే! శేఖరం యెందుకు చెప్పలేదు? అసలు చెప్పేందుకు తను అవకాశం యిస్తేనా! బాత్‌రూమ్ తలుపులు తెరుచుకుని బైటకి వచ్చిన ప్రమీల జయంతినిచూస్తూ 'హల్లో' అంది. కారణం యేమిటో తెలియదుగాని ప్రమీలగూడా చాలా దగ్గరగా, ఆదరంగా మాట్లాడుతోంది. బహుశా కాబోయే భార్యకి శేఖరం యేదయినా చూపించాడేమో!

'రాజా యేడమ్మా?' అన్నారు డాక్టరుగారు.

'వస్తున్నారు. అలా తోటవైపు వెళ్ళారు' అంది.

'బైట బోలెడన్ని పూలున్నాయి కోసుకురానా?' అంది ప్రమీల.

'దానికి ప్రత్యేకం పర్మిషన్

● 'ఇది సత్తురూపాయి సార్, పడదు' అని అంగడివాడు రూపాయి తిరిగి యిచ్చేశాడు.

ఆసామి దాన్ని పరీక్షగా చూసి 'ఎందుకు పడదయ్యా. ఇది 1948లో వేసిన రూపాయి. సత్తుదైతే యిన్నాళ్ళూ ఎలా చెల్లుతోందంటావ్?' అన్నాడు.

కావాలిటమ్మా?' అంది కామేశ్వరమ్మగారు.

'పూలు కొంచెం పైకిగూడా వున్నట్టున్నాయి. మీరు సాయం చేస్తారా?' శివరామ్‌ని అడిగింది.

'ఓ.కె. కాని, పూలు కోయటం పురుషలక్షణమే నంటారా డాక్టరు గారూ.'

'లక్షణంగా! ఆడపిల్లకి సాయం చేయడం యేదయినా పురుష లక్షణమేబాబూ!' అన్నారు డాక్టరుగారు.

ప్రమీల, శివరామ్ బైటికి వెళ్ళారు. జయంతి వెళ్ళి సునంద ప్రక్కన కూర్చుని కాటేజ్ పరిశీలనగా చూసింది. ఓ మాదిరి పెద్దగది. అందులో ఓ మంచం. దాన్ని అనుకునే చిన్న డ్రెస్సింగ్ టేబిల్. గదిలో వాలుకుర్చీగాక మరో మూడు పేమ్ కుర్చీలున్నాయి. మధ్యలో టీపాయివుంది. గదిని అనుకునే బాత్‌రూమ్ వుంది.

"నీకోసం కామేశ్వరమ్మగారు ప్రత్యేకంగా ఒకటి తెచ్చారు. ఏమిటో చెప్పుకో—!' అంది సునంద.

'ఏమిటది?' అంది జయంతి. మనసంతా వాకిట్లో శివరామ్‌దగ్గరే వుంది. శివరామ్ ప్రమీలతో కాస్త చనువుగా వుంటాడు. కాని ఇలాటి సమయాల్లో— అందులో ముఖ్యంగా శేఖరం సమక్షంలో ఘోరం బాగుంటుంది! ఈ సారెప్పుడైనా అతన్ని హెచ్చరించాలి. సహృదయుడైన శివరామ్‌కి యిలాటివి అంతగా తెలియవు. తనలాగే అందరూ అనుకుంటాడు. ఐనా ప్రమీలకి కొంచెం బుద్ధుండాలి. అతనేంచేస్తాడు? అందరితో చనువుగా వుండడం అనేది అతని స్వభావం.

'చెప్పు. ఏమిటో తెలుసా?' అంది సునంద.

'అదేదో తినేదే అమ్మాయీ! వీళ్లో పెద్దక్యారియర్ వేసుకొచ్చారు' డాక్టర్‌గారు క్లూ అందిచ్చారు.

'పులిహోర!' వెంటనే అంది జయంతి.

'చూశావా! చూశావా! వాళ్ళమ్మాయి కష్టపడుతుందేమోనని ఎలా చెప్పేరో—' కామేశ్వరమ్మగారు నిష్ఠూరంగా పలికింది.

ఇంతలో వాకిట్లో మాటలు వినించాయి.

'ఏయ్! నిన్నా పూలన్నీ ఎవరు కోయమన్నారు?' శేఖరం కంఠం.

'దేవుడు.' ప్రమీల పెంకె సమాధానం.

'అలాగా! అయితే నెత్తిమీద రెండు మొట్టమని నా తర్ఫున్గా చెప్పాడు.'

'ఇంటికి వచ్చిన అతిథిని అమర్యాద చేయడం అత్యాచారం!'

'ఓహో! అలాగా! వచ్చిన అతిథులు హద్దుమీరి ప్రవర్తిస్తే? శివరామ్! నా పేరుచెప్పి నాలుగు తగిలించు.'

శేఖరం లోపలికి వచ్చాడు. గదిలో సాయంకాలపు నీరెండ ప్రతి ఫలిస్తోంది. శేఖరం వెంకే బక్కగా, పొట్టిగావున్న ఒకతను ఒక పెద్ద పేపరుపొట్లాం తెచ్చి టీపాయి మీద పెట్టాడు. అందులో ద్రాక్ష పళ్ళున్నాయి. లేతాకు పచ్చరంగులో పరిపక్వమై లోపల రసం పల్చటి పొరలోంచి చిదిపితే చిందేటట్టు కన్పిస్తోంది.

'మూడు గంటలకే మమ్మల్ని రమ్మన్నావు. మేం టిఫిన్ కూడా తీసుకోకుండా వచ్చేశాం. నువ్వు త్వరగా వెళ్ళు. చేతులు కడుక్కురా' అంది కామేశ్వరమ్మగారు.

'మేంకూడా తీసుకోలేదు. మూడు గంటలకి బైలుదేరాలనుకుంటుండగా ఇంతలో యెవరో రావడంతో అలస్యం అయిపోయింది.' శేఖరం బాత్‌రూమ్ వైపు వెళ్ళిపోయాడు.

'జయంతీ! ఇదుగో యీ టవల్ తీసుకెళ్ళి అబ్బాయి కివ్వు—' వెంట తెచ్చిన ప్లాస్టిక్ బాగ్‌లోంచి తీసి యిస్తూ అంది కామేశ్వరమ్మగారు.

జయంతి యిష్టంలేకపోయినా టవల్ తీసుకుని బాత్‌రూమ్‌లోకి వచ్చింది. శేఖరం మొహం సోప్‌తో కడుక్కుంటున్నాడు. తడుస్తుందేమోనని మోచేతివరకూ పైకి లాక్కున్న తెల్లటి ఫుల్‌హేండ్స్ షర్టులోంచికన్పిస్తున్న చేతులు అందంగా, బలంగా ఉన్నాయి. కుడిచేతిమీద పెద్ద పుట్టుమచ్చ ఉంది. అతని చేతు లెప్పుడూ అంత దగ్గరగా, అంత పరీక్షగా ఇంతవరకూ చూడలేదు. మొహం కడుక్కోవటం పూర్తయిపోయి వెనక్కు తిరిగిన శేఖరం, తువాలుపట్టుకు నిలబడిపోయిన జయంతివైపు క్షణంసేపు చూస్తుండిపోయాడు. అప్పుడప్పుడూ అలా పరీక్షగా చూడటం అతనికి అలవాటే! జయంతి తువాలు అందిచ్చి నిశ్శబ్దంగా వెళ్ళిపోబోయింది. శేఖరం వెంటనే చేతిలోకి నీళ్ళుపట్టి జయంతిమీద చల్లాడు. అనుకోకుండా మీద నీళ్ళుపడటంతో

● భర్త: నాకీమధ్య మరీ మతిమరుపు ఎక్కువవుతోంది. ఇవ్వాళగొడుగు తీసుకెళ్ళడం మరిచిపోయాను.'

భార్య: 'ఎప్పుడు జ్ఞాపకమొచ్చింది?'

భర్త: 'వాన వెలిశాక గొడుగు మూసేద్దామని చూస్తే చేతిలో గొడుగులేదు.'

ఉలిక్కిపడింది. వెంటనే వెనక్కు తిరిగి చూసింది. చేతికి మిగిలిన నీళ్ళని జయంతి మొహంమీదకి చల్లుతూ 'వచ్చినవాళ్ళంతా నీ ఆప్తులేనా ?' అన్నాడు నవ్వుతూ. జయంతి వెంటనే ఏదో సమాధానం చెప్పబోయి ఆగి ముఖంమీదపడిన నీళ్ళని కొంగుతో తుడుచుకుంది. శేఖరం దగ్గరగావచ్చి టవల్‌తో జయంతిమీదపడిన నీళ్ళని అద్దసాగాడు.

'వాళ్ళు చూస్తే—' అస్పష్టంగా అంది.

'చూడకపోతే ఫర్వాలేదా ?' కళ్ళలో కొంటెతనం మెరుస్తుండగా అడిగాడు.

జయంతి చప్పున అతని చేతుల్ని తప్పించుకుని వెళ్ళిపోయింది.

'అదేమిటి అలా వున్నావేం ?' అంది సునంద ఎర్రబడిన మొహంతో బైటికివచ్చిన జయంతినిచూస్తూ.

'ఎలా వున్నాను!' వెనక్కు తగ్గుతూ అడిగింది.

'సునంద, కామేశ్వరమ్మగారు మొహాలు చూసుకున్నారు.

ప్రమీల పూలన్నీ కోసుకుని పమిట చెంగుసిండా నింపుకుని లోపలికి వచ్చింది. శేఖరం బాత్ రూమ్‌లోంచి వచ్చాడు.

'త్వరగా రండి. ఇప్పటికే ఆలస్యంఅయింది.' కామేశ్వరమ్మగారు ఆకులు పరుస్తూ అంది. ఇంతలో సునందభర్త ఒకతనితో కాఫీకప్పులు పట్టించుకొచ్చాడు.

● ● ●

టిఫిన్‌తిని కాఫీలు తాగడం అయిం తర్వాత అంతా కలిసి ద్రాక్షతోటలో కొద్దిసేపు తిరిగారు. ఎక్కడి వరకూ తన తోటో శేఖరం గుర్తులు చూపించాడు. సాయంత్రం అయిపోవటంతో కూలీలు పని ముగించుకుని గుంపులు గుంపులుగా సందడిగా మాట్లాడుకుంటూ వెళ్ళిపోతున్నారు. పళ్ళునింపిన బుట్టలన్నీ దూరంగావున్న ఒక షెడ్‌లో పెట్టించారు. రెండు రోజుల్లో అవన్నీ మార్కెట్‌కి వెళ్ళిపోతాయి.

పొద్దు బాగా తిరిగిపోయింది. సూర్యుడు అస్తమించాడు. ఎర్రటి సంధ్యాకాంతిలో అందరూ వచ్చి కాటేజ్ ముందున్న పచ్చగడ్డిలో కూర్చున్నారు. శివరామ్ మిగిలిన ద్రాక్షపళ్ళని జేబురుమాల్లోనింపి వెంట వుంచుకున్న వాటిని విప్పి అందరిమధ్యా పెట్టాడు. అందరూ తలా ఒకటి తీసుకుంటున్నారు.

'పాపం హైద్రాబాద్‌లో ఏమున్నా లేకపోయినా యీ అనాబ్ షాహీకి మటుకు ప్రసిద్ధి చెందింది.' అన్నాడు శివరామ్.

'అందమైన ఆడపిల్లలకి కూడా!' అన్నారు డాక్టరుగారు.

'అల్లరి చేసే అబ్బాయిలు మటుకు తక్కువంటారా ?' సునందభర్త అన్నాడు.

'జయంతీ! ఇందాకటి నుంచి చూస్తున్నాను. నువ్వేంమాట్లాడవేం?' అంది కామేశ్వరమ్మగారు.

'ఏం మాట్లాడను !' చేతితో పచ్చగడ్డి లాగుతూ అంది.

జయంతి మనోనేత్రం ఆరోజు శివరామ్‌తో పిక్నిక్ వచ్చినప్పుడు జరిగిన సంఘటనని చూస్తోంది.

చూస్తుండగా ఆకాశంలో పడమటివైపు అలుముకున్న యెరుపుదనం చిక్కపడి మెల్లగా అంతరించిపోయింది.

మెల్లమెల్లగా ఆవరించుకున్న చీకట్లోంచి పౌర్ణమినాటి చంద్రుడు గుండ్రంగా తూర్పువైపునుంచి ఆకాశంలో పైపైకి వస్తున్నాడు.

'చంద్రుడెంత బాగున్నాడో. అందమైన ఆడపిల్ల మొహంలా !' అన్నాడు శివరామ్.

ఆ ఉపమానం నేను చాలాసార్లు విన్నాను. కాని అందులో అందమేమిటో నాకర్థంగాదు. ముఖం అలా అంత గుండ్రంగా సున్నాచుట్టినట్టువుంటే ఏం బాగుంటుంది!' అంది ప్రమీల.

'బహుశా చంద్రుడిలో గుండ్రటితనంకంటే వెలుగుని, మనోహరంగా వున్న ఆ కాంతిని కవులు దృష్టిలో పెట్టుకుని అనివుంటారు' అన్నాడు శేఖరం.

'గుండ్రంగా యిష్టం లేకపోతే యింకెలా వుండాలని మీఉద్దేశం?' అన్నాడు శివరామ్.

'కొద్దిగా కోలగావుండాలి.'


'బాగుంది దోసకాయలా కాబోలు!' శివరామ్ మాటలకి అందరూనవ్వారు. జయంతి చేతిలో వున్న చిన్న మట్టిగడ్డని కోపంగా శివరామ్‌మీదికి విసిరింది.

"చాతనైతే మాటలతో పోట్లాడాలి. మట్టిబెడ్డలతోగాదు' చొక్కామీద పడినమట్టిని దులిపేసుకున్నాడు శివరామ్.

అప్పుడప్పుడే ఆవరించుకుంటున్న చంద్రకాంతిలో శివరాం యింకొంచెం బక్కపలచగా, బొత్తిగా కుఱ్ఱాడిలా వున్నాడు. అతని పక్కనే మోచేతిమీద వెనక్కువాలి పరధ్యాసగా దూరంగా చూస్తూ యేదో ఆలోచిస్తున్నట్టున్న శేఖరం పరిపూర్ణంగా, వికసించిన వ్యక్తిత్వంతో గంభీరంగా నిండుగా, హుందాగా వున్నాడు. ఒకచేతిమీద అలా వెనక్కి జారగిలబడి కూర్చోవడంలోకూడా రాజసం వుట్టిపడుతోంది. ఇలా మాటిమాటికి తనదృష్టి అతని శరీరాకృతిని గురించి ఆలోచించటం, ఆకర్షింపబడడంచూసి జయంతికి తనంటే తనకే అసహ్యం వేసింది. తనెంత అల్పురాలు ! ఎంత మామూలుగా ఆలోచిస్తోంది !

(సశేషం)

రాధమ్మ పెళ్లి ఆగిపోయింది



శ్రీనాదేవి

"**మం**చి ఎంకరేజిమెంటిస్తారు" అంటారు కుర్ర కారు లాయర్లు.

"తెలివైన బుర్ర" అంటారు తల నెరిసిన వకీళ్ళు.

"కష్టం, సుఖం తెలిసిన మనిషి" అంటారు ప్లీడరు గుమాస్తాలు.

"ధర్మ ప్రభువు" అంటారు అతని స్టాఫు.

"న్యాయం కనిపెట్టేస్తారు" అంటారు పార్టీలు.

"నా పూర్వజన్మ సుకృతం" అంటుంది సుగుణమ్మ.

ఇంతపేరు తెచ్చుకున్న సబ్‌జడ్జీ సౌజన్యరావుగారికి, అప్పుడే సెంటును వాసన చూసినట్టుండే ముక్కుగల సుగుణమ్మ అనే పతివ్రత అయిన భార్యా, బియస్సీ మూడో యేడు చదువుతున్న పెద్దకూతురు రెండుజడల రాధ, తర్వాత మరో ముగ్గురు పిల్లా పిచికా వున్నారు. నలభైఎనిమిదేళ్ళ వయస్సైనా తరగని దబ్బపండులాటి శరీరచ్ఛాయ, పెద్దపిల్లపెళ్ళి వాయిదాపడుతోందనే బెంగకూడా వున్నాయి.

అతను ఉత్త పాతకాలమ్మనిషి. బ్రిటీషుకాలంనాటి జడ్జీల్లా ఎవరితోనూ ఎక్కువ కలియకుండా తామరాకుమీద నీరులా తప్పించుకు తిరుగుతారు. యానివర్సరీనాడు మాత్రం క్లబ్బుకెళతారు. కోర్టు యిల్లూతప్ప యింకెక్కడికీ వెళ్ళని ఖచ్చితం మనిషి. పరాయిచోట పచ్చి మంచినీళ్లైనా పుచ్చుకోరు. దురలవాట్లు కూడా ఏవీలేవు. పొడుం పీల్చరు. కాఫీ రెండుసార్లు పుచ్చుకుంటారు రోజుకి. సిగరెట్టు కాల్చరు. సినిమాకి వెడతారు. కాని అవేవీ అతని వ్యసనాలని చెప్పుకోడానికి వీల్లేదు. కాఫీ లేపోతే ఓల్టీను తాగి గడిపేసుకుంటారు. ఎంతమంచి సినీమాలైనా నెలాఖరులోవస్తే పనిరద్దీవల్ల వెళ్ళరు.

అతనికున్న ఒక్క వ్యసనవూ చదరంగం. ఉన్న ఒక్క స్నేహితుడనిపించుకోదగ్గవాడూ వారి వీధిచివర కాపురవున్న ఏభైఅయిదేళ్ళ లింగన్న పంతులు. వారికి ఆ వ్యసనవూ ఆ స్నేహవూ కూడా విచిత్రంగానే సంప్రాప్తమయ్యాయి.

ఆయన చిన్నప్పుడారేళ్ళు వచ్చే

దాకా. గోళీలు, తొమ్మిదేళ్ళొచ్చే దాకా గోటీబిళ్ళా ఆడేవారు. తర్వాత పన్నెండేళ్ళొచ్చేదాకా ఏమీ ఆడే వారుకారు. తర్వాత ఓ మూడేళ్ళు పుట్‌బాలూ, తర్వాతో నాలుగేళ్ళు హాకీ ఆడేవారు. తనే పంథొమ్మిదో ఏట ప్రారంభించిన టెన్నిస్, క్రితం వూళ్ళో కొన్నాళ్ళు పనిచేసేవరకూ ఆడేవారు. ఆ వూళ్ళో అయన తోటి మునసబుగారు కూడా టెన్నిస్ ఆడేవారు. వీరిద్దరితో కొంతమంది వకీళ్ళు కూడా ఆడేవారు. అప్పుడో సారి జిల్లా జడ్జిగారు అయన్ని, మునసబుగార్ని పిలిచి 'మీరు టెన్నిస్ ఆడే వకీళ్ళకే ఏవో ఫాయిదాలవీ యిస్తున్నారని పిటీషనులు రాస్తున్నారు ఎవరో పుండాకోర్లు. మీ గురించి నా కెటువంటి అనుమానమూ లేదు. కానెందుకైనా మంచిది. కొంచెం జాగ్రత్తగా ఉండండి' అన్నారు. దాంతో వారిద్దరి మనసులూ ఒక్కసారి చివుక్కుమని "కొంచెమేంఖర్మ, బాగానే జాగ్రత్త పడతాం" మని ఒక్కసారిగా టెన్నిస్ మానేసేరు.

టెన్నిస్ మానేసిన యిద్దరూ కాలక్షేపంకోసం చదరంగం నేర్చుకున్నారు. అలా అంటించుగున్న చదరంగం మరి వొదుల్చుకోలేక పోయేరు జడ్జిగారు. క్రితం ఊళ్లో వున్నన్నాళ్ళూ ఆటకేం ఆటంకం లేక పోయింది మున్సబుగారుండబట్టి. కాని, ఈ వూరొచ్చేకమాత్రం బహు చిక్కొచ్చిపడింది ఆయనకి. లాయకో లూకాయిగాళ్ళతో ఆడకూడదాయన. లాకాయి లూకాయి గానివాళ్ళకి ఎత్తురాదు. ఏంచేసేదీ లేక యీ ఊరొచ్చేక భార్యకే నేర్పేరు చదరంగం. పాపం! ఆవిడకూడా తెలివైన ఘటమే. కష్టపడి నేర్చుకుంది ఆట. ఈ ఆట యింత బావుంటుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. మహా బావుందనుకుంది.

బావులేంది జడ్జిగారికే. పాపం! ఆయనకి భార్యంటే అమితప్రేమా, గౌరవమూనూ. పెళ్ళాంగా ప్రేమించేరు. మనిషిగా గౌరవించేరు కాని—కాని రైవల్ ప్లేయర్‌గా మాత్రం గౌరవించలేకపోయేరు. కారణం ఆవిడది తనంత తెలివైన బుర్రకాకపోవడమేనా కావచ్చు; లేకపోతే అంకి ఆవిడ కొత్తపడమన్నా కావచ్చు. ఏదైతేనేం, పర్యవసానం జడ్జిగారికి తన భార్యతో ఆడితే చదరంగం రక్తి కట్టేదికాదు. మంచివాడు కాబట్టి, నొచ్చుగుంటుందని ఆమెతో ఆ మాటెన్నడూ చెప్పలేదు అతను.

ఇంక లింగన్నపంతులు స్నేహం ఎలా అయిందీ అంటే—ఈ ఊరొచ్చిన మూణ్ణెళ్ళకే జడ్జిగారి తండ్రిగారి ఆబ్దికం వచ్చింది. తద్దినానికి వస్తానన్న భోక్తలెవరో దగాచేస్తే పురోహితుడు వీధి చివరనున్న లింగన్నపంతులు కాళ్ళట్టుకుని భోక్తగా తీసుకొచ్చేడు. వస్తూనే తనకిటువంటి భోక్తపన్లూ, తద్దినాలూ అలవాట్లేదనీ, ఏదో భగవంతుడిచ్చినదాన్తో గుట్టుగా కాలక్షేపం చేస్తున్నాననీ మర్యాదగా జడ్జిగారికి తెలియజెప్పేడు లింగన్న పంతులు. దానితో జడ్జిగారికి లింగన్న పంతులికి తానుపడ్డ ఋణం పెరిగి నట్లనిపించింది. ఏదెట్లున్నా సమయానికొచ్చి కాపాడాడదే చాలను కున్నారు జడ్జిగారు.

భోజనాలయ్యేక వీధరుగుమీద ఆమాటా యీమాటా చెప్పుకుంటూ కూర్చున్నారు జడ్జిగారూ, లింగన్నా. టేబిలుమీదున్న చదరంగం అట్టా, పావులడబ్బా చూసి 'జడ్జిగారు చదరంగం ఆడతారా?' అని జడ్జిగారిని అడిగాడు లింగన్న.

'జౌనన్నట్టు నవ్వుతూ 'తమకేమన్నా ప్రవేశమా?' అని బదులడిగారు జడ్జిగారు.

'ఏదో చిన్నప్పుడో ఎత్తువేసే వాణ్ణి' అన్నాడు సిగ్గుపడుతూ పంతులు.

అలా సెటిలయిపోయింది వాళ్ళిద్దరిమధ్యా రోజూ సాయంత్రం ఓ ఎత్తు వేసుకునే అలవాటు. కోర్టు నుంచి ఎంత ఆలస్యంగా వచ్చినా, తానొచ్చేసరికే లింగన్న రాకపోతే కబురెట్టి మరీ ఓ ఎత్తువేయందే జడ్జిగారికి నిద్రొచ్చేదికాదు. కరెంటు పోతే కొవ్వొత్తి పెట్టిఅయినాసరే వేస్తారో ఆట వాళ్ళిద్దరూ. తొలిరోజులోనే ఆ మాటా యీమాటా చెప్పుకుంటున్నప్పుడు లింగన్నపంతులు, తన తండ్రిగారి కాలంలోనే వాళ్ళ కుటుంబానికున్న లిటిగేషను చెల్లిపోయిందనీ, తను ఎదిగి పంచెకట్టేక కోర్టుఘాయలకే పోలేదనీ చెప్పేశాడు. దానితో జడ్జిగారు యితనితో ఎంత స్నేహంగావున్నా ఫర్వాలేదను కొని అతనితో నేస్తంపట్టేరు. వారిద్దరి శాఖలూ ఒకటే అవడంవల్ల మరీ జడ్జిగారింట్లో మనిషైపోయేడు పంతులు.

2

లింగన్నపంతులు కూడా తనకు రెండు తరాలనుండీ వస్తున్న అయి

- బీదవారిపై కాంపోజిషన్ రాయమని నాలుగోక్లాసు కుర్రాళ్ళని మేష్టారడిగారు.

లక్షాధికారికొడుకు కోటీశ్వర్రావు రాసిన కాంపోజిషను : 'అనగనగా ఒక బీద కుటుంబము గలదు. ఆ కుటుంబములో అందరూ బీదవారే. తండ్రి బీదవాడు; తల్లి బీదది; కొడుకులు, కూతుళ్ళు బీదవారు. వారి కారు డ్రయివరు యింకను బీదవాడు; వారి తోటమాలికూడా బీదవాడే; వారి నౌకరులందరు బీదవారే... ......' ఈ పద్ధతిలో నడిచింది.


దెకరాల మాగాణీ, డైబెటీసూ ఎక్క
డికి పోకుండా కాపాడుకుంటూ
గుట్టుగా కాలక్షేపంచేసే మనిషి.
ఇతరలతో అంతగా జోక్యం పెట్టు
కునే మనిషికాడు. తన సొంతపొలం
చేసుకుంటూ, ఊళ్ళో లేని మరో
దూరబ్బంధువుల పొలాలు మేనేజి
మెంటుచేస్తూ, రెంటిమీద వచ్చిం
దాన్తో ఎలాగో కాలం వెళ్ళబుచ్చు
కుంటున్నాడు. పెళ్ళాంపోయిన లత
నికి మూడుసార్లు పి. యు. సి. తప్పి
ఉద్యోగంలేని రాజేశ్వర్రావు పురపు
రాజనే పెద్దకొడుకూ, పెళ్ళికానీ,
పురపులు కానీ లేని రాజేశ్వరనే పెద్ద
కూతురూ, తర్వాత ఓ యిద్దరు నత్తా,
నావావున్నారు. నత్తనాలుగో ఫారం
చదువుతున్నాడు, నాంవ నాలుగో
క్లాసు చదువుతోంది.

లింగన్న పంతులు మంచివాడని
కాని, చెడ్డవాడనిగాని ఎవరూ అనరు.
తన జీతం పిచ్చకుంచంతో కొలుస్తా
డని పొలేరనడు. చచ్చిన అతని
పెళ్ళాంమాత్రం, తను పుట్టింటికి
పోయినప్పుడు పంతులు దాసి రాజమ్మ
చెయ్యట్టుగుంటున్నాడనే అనుమాన
పడి, ఒకటి రెండుసార్లు తన అను
మానం వ్యక్తం చేసినప్పటికీ యిం
కెవరూ ఆ మాటనలేదు. ఎవరికిఇవ్వా
ల్సింది వాళ్ళకి ముందుగానే
ఇచ్చేస్తూ, తనకు రావలసింది పైసా
పోకుండా రాబట్టుకుంటూ, లౌక్యం
గానే కాలక్షేపంచేసేమనిషి పంతులు.
ఎలక్షన్రోజుల్లో ఉభయపార్టీలకీ మీకే
ఓటిస్తానని నమ్మించి, తనకి తోచిన
వాడికి గుట్టుగా ఓటేసి, యిద్దరు
పార్టీలవైపూ నవ్వుతూ చూస్తూ
వచ్చేసే గడసరి.

చిన్నప్పట్నించీ చదువు చెప్పించి
తర్వాత తాసిల్దారు కాళ్ళట్టుకుని
ఎల్. డి. సి. ఉద్యోగం వేయించిన
తన మేనల్లుడే తన్ను కట్నం అడిగే
సరికి వొళ్ళు మండింది పంతులుకి.
కట్నం వేంనా, కాసూ - మొహరూ
కాకుండా మూడువేలదాకా తన
బావమరిదికి(అంటే మేనల్లుడితండ్రికి)
మనస్సుందనగానే మరీ వొళ్ళు
మండిపోయింది. కాని, కోపం తెచ్చు
కొని, నోరుపారేసుకొని, సంబంధం
తెంచుకొనే మనిషికాడు ఆయన.
ఏం చెయ్యాలో తోచక, కర్ర విర
క్కుండా-పాము చావకుండా, కట్నం
విషయం ఏవీఁ తేల్చలేదతను. రాజే
శ్వరికి మూడుముళ్ళూ పడీ, రాజు ఏ
చిన్న ఉద్యోగంలోనైనా జొరబడితే
బావుణ్ణు. వెనకపిల్లల పైముకు
దేశం బాగుపడకపోతుందా అను
కుంటా డెప్పుడూ పంతులు.

3

ఆ ఊరిపేరెత్తేసరికి రాజన్రాజు
గారూ, సుందర్రావు నాయుడూ
తడతారందరికీ. ఊరంత పెద్దది కాక
పోయినా, ఎప్పుడూ ఇంగ్లీషు
సినిమాలెయ్యని నాలుగు హాళ్ళు,
సంవత్సరానికైనా జీతాలందని మేష్టర్ల



చేత ఓ స్కూ రీ, యింకేదో కారణం
వల్ల పిల్లల్చేత ఓసారీ ముచ్చటగా
సమ్మె చేయించుగునే ఓ కాలేజీ,
సబుకోర్టుతో సహా నాలుగు సివిల్,
క్రిమినల్ కోర్టులూ, డభైవేల జనా
భాతో కోలాహలంగా వుంటుంది.

రాజన్రాజుగారిది జమీందారీ
కుటుంబం కాకపోయినా, జమీం
దార్లతో తూగగల తాహతూ, దర్జా
వున్నాయా కుటుంబానికి. మూడు
తరాల్నుంచీ తరానికొక రేకావడంవల్ల
ఆ కుటుంబంతాలూకు మూడొంద
లెకరా కరిగిపోకుండా అచ్చోసిన
బంగారు ముక్కలా నిలబడే వుంది.
తాత రాజన్రాజుగారు - అంటే
ప్రస్తుతం వున్నవారి తాతగారు - జరీ
కోటు తొడుక్కొని, గుర్రమెక్కి
పొలాలమీది కెడుతూ వుంటే
అచ్చంగా సత్యహరిశ్చంద్రుడు వేట
కెడుతున్నట్టుందనుకొనేవారట. వారి
కుమారుడు సుబ్బరాజులుంగారు

కూడా గుఱ్ఱమెక్కక పోయినా, మైసూరెడ్లబండీ మొత్తాలమీద కూర్చుని, పాలేర్ని ముందు పరిగెట్టిస్తూ దర్జాగా వెళ్తూ వుంటే రివిన్యూ ఇనస్పెక్టర్లు వంగి దణ్ణాలెట్టేవాళ్ళట. వారు కాలం చేసేలోగానే కొమారుడు రాజన్రాజు కాంగ్రెసు టిక్కెట్టు కోయించుకుని అసెంబ్లీలో కాలుపెట్టిన భాగ్యం చూసుకోగలిగేరు. రాజన్రాజుగార్ని పేరెట్టి ఎవరూ పిలవరు. ఆత్మీయులు తాతం రాజుగారనీ, పైవాళ్ళు ఎం. ఎల్. ఎ. రాజుగారని పిలుస్తారు. వారు రెండుసార్లు ఎసెంబ్లీ పోటీల్లో నెగ్గి మూడో సారి ఓడిపోయేరు కాంగ్రెసు టిక్కెట్టున్నప్పటికీ.

మొన్న మొన్నటిదాకా రాజన్రాజుగారి ఆరోప్రాణమైన రామచంద్రావునాయుడుకూడా వరస మూడుటరన్లు ఛైర్మనై, ఛైర్మన్నాయుడని సార్థకనామం సంపాయించుకున్నాడు. క్షత్రియుడు కాకపోయినా రాచవారికున్న పౌరుషం, స్నేహభావం వీరికీ వున్నాయి. వీరికీవుందో వందన్నర ఎకరా. బ్రిటీషువాళ్ళ కాలంలో జిల్లా కలెక్టరుగా రీవూరు కేంపొచ్చినప్పుడు వీరి కుటుంబనుంచే గొఱ్ఱెపోతులూ, కోడిపెట్టలూ సప్లయి అయ్యేవి. తన పొలం సాగుచేసుకుంటూ, ఓ సినిమాహాలు కట్టించుకుని, తన మూడో టరను ఛైర్మనుగిరీ అనుభవిస్తున్న నాయుడుకి, తనకంటె నాలుగేళ్ళు పెద్దయిన రాజన్రాజుగారంటే భక్తి, భయంకూడా. ఇద్దరూ కాంగ్రెసు వాళ్ళే అయినా, ఒకరికొకరు ఎలక్షన్లలో సాయంచేసుకుంటూ స్నేహం వృద్ధిపర్చుకుంటూ వుండేవారు. తానెప్పటికైనా ఎమ్. పి. అయితే తన ఎం. ఎల్. ఏ. పదవి నాయుడు కొదిలేద్దామని రాజుగారి ఆశ, ఆశయమూను. రాజుగారు ఎసెంబ్లీ ఎలక్షనొచ్చినప్పుడు, తన ఊర్ని నాయుడి కొదిలేస్తాడు. తాను యితర గ్రామాలు చూసుకుంటాడు. నాయుడు కూడా తనశక్తికి మించి పనిచేస్తాడు రాజుగారికోసం. ఇంక మునిసిపల్ ఎలక్షన్లొస్తే నాయుడు బరువు సహంపైగా రాజుగారే తనమీద వేసుకుంటారు. సోడాకొట్టు సాయిబు దగ్గర్నించీ, షేర్వాణీ తొడుక్కునే సుల్తాన్ సిల్కుపేలస్ ప్రొప్రయిటరు వరకూ, అందర్నీ తన తాహతు మరచి, గడ్డం పట్టుకొని నాయుణ్ణి, అతని పార్టీని గెలిపించమని ప్రాధేయపడతారు రాజుగారు.

వీ రిద్దరి స్నేహం తెగ్గొట్టాలని కమ్యూనిస్టులూ, ఇతర చిల్లరపార్టీలూ ఎంత ప్రయత్నించినా లాభంలేక పోయింది. కాని ఆ దుర్దినం అనుకోకుండా దానంత టదే వచ్చింది.

4

రాజుగారిది మూడో సారి ఎలక్షన్లో పోయింది. అంటే, రెండుసార్లు గెలిచి మూడోసారోడిపోయే రన్నమాట. ఓట్లు కౌంటింగైపోయేక ఓటమి మొహంలో కన్పించనీకుండా అందరితోటీ చనువుగా, సరదాగా మాట్లాడి, తన జీపులో వెళ్ళిపోతున్నా, లోపల్లోపల బాధపడక పోలేదు రాజుగారు. తాను నమ్మిన వాళ్ళిలా ఎందుకు దగాచేసేరా అని తర్కించుకున్నారు. ఎంతమంది దగా చేసేరని లెక్కించుకున్నారు. కలతపడ్డ మనస్సుతో కలతనిద్ర పోయేరా రాత్రి.

మర్నాడు ప్రొద్దున్నే ఎలక్షను గొడవలవతలబెట్టి మంగలి నర్సికి కబురుపెట్టేరు. తాను రెణ్ణాలై లక్ష్యపెట్టని జుట్టు క్షౌరం చేయించుకుందామని.

నరిసి వచ్చేడు. క్షౌరం అరంభించేడు. రాజుగారి గంభీరత చూసి మాట కలపలేక పోయేడు. ఓ పది నిముషాలు కత్తెర చప్పుడుతప్ప యింకేశబ్దం వినిపించలేదు.

"ఏదెకైనా న్నాయుడుగోరి దగా బైటపడిపోనాది," అన్నాడు నరిసిగాడు వెనకాముందూ లేకుండా. రాజుగారి గుండె కొట్టుకోనే క్రమం ఓసారి తప్పింది. కాని బైటకు ఏవీం తేల్లేదు. నీరసంగా ఓసారి నవ్వారుకున్నారు రాజుగారు.

రాజుగారు తన్ననందుకు ధైర్యం వచ్చింది మంత్రి నరిసికి. ఇహ తను విన్నదీ, విననిదీ చెప్పేవచ్చని మొదలెట్టాడు. "బాబుగోరికి తెలవదుగాని మన్నాయుడుగోరే మన్ని దగా చేసేట్ట. ఓట్సు లెక్కేతప్పుడు తవఁరుగోరు బైటుండిపోనారుగాని మనూళ్ళోనే మనకి తక్కువొచ్చేయట ఓట్సులు. నాయుడుగోరి వోర్డులో పావలాభాగం కూడా పడనేదట మనకి" అన్నాడు.

ఇంక రాజుగారూరుకోలేక పోయేరు. "నీకెవరు చెప్పార్రా గాడిదా?" అనడిగేరు. ఆ గాడిదా అన్నమాటలో కోపంలేదని గ్రహించిన మంత్రికి రాజుగారింట్లో పలావు విందుకి పిలిచినట్లనిపించింది. "తవఁరట్టాగే అనుకుంటూ వుండండి బాబయ్యా! ఊరంతా కోడై కూస్తుంటేనూ! రేతిరి మా యీంచ్చివర బడ్డీకొట్టుకాడ కమ్మూనిష్టుకుర్రాళ్ళు పబ్లిగ్గా అంటూంటే! తవఁరిగోరిదో మాలోకం. నా మాటబద్దవైతే ఓట్సులెక్కలు తెప్పించుకుని సూడగూడదా" అన్నాడు.

క్షౌరం తర్వాత నరిసి రాజుగారికి తలంటుతూ "మనమీద నిలబడ్డది కిష్టారావు నాయుడేగందా. అలా తప్పుడు మఁ మనం న్నాయుణ్ణెందుకు నమ్మేవూఁ అంట?" అని పాడేసేడు, తనుగూడా రాజుగారితో పాటు నాయుణ్ణి నమ్మి మోసపోయినట్టు.

తలంటయ్యేక రాజుగారి బుఱ్ఱ చురుగ్గా పని చెయ్య నారంభించింది. తర్వాత నర్సి చెప్పిన "ఓట్సు లెక్కలు" చూస్తే వాడు చెప్పిన

కూడా గుర్రమెక్కక పోయినా, మైసూరెడ్లబండీ మొత్తాలమీద కూర్చుని, పాలేర్ని ముందు పరిగెట్టిస్తూ దర్జాగా వెళ్తూ వుంటే రివిన్యూ ఇనస్పెక్టర్లు వంగి దణ్ణాలెట్టేవారట. వారు కాలం చేసేలోగానే కొమారుడు రాజన్నరాజు కాంగ్రెసు టిక్కెట్టు కోయించుకుని అసెంబ్లీలో కాలుపెట్టిన భాగ్యం చూసుకోగలిగేరు. రాజన్నరాజుగార్ని పేరెట్టి ఎవరూ పిలవరు. ఆత్మీయులు తాతం రాజుగారనీ, పైవాళ్ళు ఎం. ఎల్. ఎ. రాజుగారని పిలుస్తారు. వారు రెండు సార్లు ఎసెంబ్లీ పోటీల్లో నెగ్గి మూడో సారి ఓడిపోయేరు కాంగ్రెసు టిక్కెట్టున్నప్పటికీ.

మొన్న మొన్నటిదాకా రాజన్నరాజుగారి ఆరోప్రాణమైన రామచంద్రావునాయుడుకూడా వరస మూడు టరన్లు ఛైర్మనై, ఛైర్మన్నాయుడని సార్థకనామంసంపాయించుకున్నాడు. క్షత్రియుడు కాకపోయినారాచవారికున్న పౌరుషం, స్నేహభావం వీరికి వున్నాయి. వీరికివుందో వందన్నర ఎకరా. బ్రిటీషువాళ్ళ కాలంలో జిల్లా కలెక్టరుగా రీవూరు కేంపొచ్చినప్పుడు వీరి కుటుంబంనుంచే గొర్రెపోతులూ, కోడిపెట్టలూ సప్లయి అయ్యేవి. తన పొలం సాగుచేసుకుంటూ, ఓ సినిమా హాలు కట్టించుకుని, తన మూడో టరను ఛైర్మనుగిరీ అనుభవిస్తున్న నాయుడుకి, తనకంటె నాలుగేళ్ళు పెద్దయిన రాజన్నరాజుగారంటే భక్తి, భయంకూడా. ఇద్దరూ కాంగ్రెసు వాళ్ళే అయినా, ఒకరికొకరు ఎలక్షన్లలో సాయంచేసుకుంటూ స్నేహం వృద్ధిపర్చుకుంటూ వుండేవారు. తానెప్పటికైనా ఎమ్. పి. అయితే తన ఎం. ఎల్. ఏ. పదవి నాయుడు కొదిలేద్దామని రాజుగారి ఆశ, ఆశయవూను. రాజుగారు ఎసెంబ్లీ ఎలక్షనొచ్చినప్పుడు, తన ఊర్ని నాయుడి కొదిలేస్తాడు. తాను యితర గ్రామాలు చూసుకుంటాడు. నాయుడు కూడా తనశక్తికి మించి పనిచేస్తాడు రాజుగారికోసం. ఇంక మునిసిపల్ ఎలక్షన్లొస్తే నాయుడు బరువు సహంపైగా రాజుగారే తన మీద వేసుకుంటారు. సోడాకొట్టు సాయిబు దగ్గర్నించీ, షేర్వాణీ తొడుక్కునే సుల్తాన్ సిల్కు పేలస్ ప్రొప్రయిటరు వరకూ, అందర్నీ తన తాహతు మరచి, గడ్డం పట్టుకొని నాయుణ్ణి, అతని పార్టీనీ గెలిపించమని ప్రాధేయపడతారు రాజుగారు.

వీ రిద్దరి స్నేహం తెగ్గొట్టాలని కమ్యూనిస్టులూ, ఇతర చిల్లరపార్టీలూ ఎంత ప్రయత్నించినా లాభంలేక పోయింది. కాని ఆ దుర్దినం అనుకోకుండా దానంతట అదే వచ్చింది.

4

రాజుగారిది మూడో సారి ఎలక్షన్లో పోయింది. అంటే, రెండుసార్లు గెలిచి మూడోసారి ఓడిపోయేరన్న

మాట. ఓట్లు కౌంటింగైపోయేక ఓటమి మొహంలో కన్పించనీకుండా అందరితోటీ చనువుగా, సరదాగా మాట్లాడి, తన జీపులో వెళ్ళిపోతున్నా, లోపల్లోపల బాధపడక పోలేదు రాజుగారు. తాను నమ్మిన వాళ్ళిలా ఎందుకు దగాచేసేరా అని తర్కించుకున్నారు. ఎంతమంది దగా చేసేరని లెక్కించుకున్నారు. కలతపడ్డ మనస్సుతో కలతనిద్ర పోయేరారాత్రి.

మర్నాడు ప్రొద్దున్నే ఎలక్షను గొడవలవతలబెట్టి మంగలి నర్సికి కబురుపెట్టేరు. తాను రెణ్ణాలై లక్ష్య పెట్టని జుట్టు క్షౌరం చేయించుకుందామని.

నరిసి వచ్చేడు. క్షౌరం ఆరంభించేడు. రాజుగారి గంభీరత చూసి మాట కలపలేక పోయేడు. ఓ పది నిముషాలు కత్తెర చప్పుడుతప్ప యింకేశబ్దం వినిపించలేదు.

"ఏదేతైనా న్నాయుడుగోరి దగా బైటుపడిపోనాది," అన్నాడు నరిసిగాడు వెనకాముందూ లేకుండా. రాజుగారి గుండె కొట్టుకోన్నేక్రమం ఓసారి తప్పింది. కాని బైటకు ఏవీం తేలేదు. నీరసంగా ఓసారి సవ్వారు కున్నారు రాజుగారు.

రాజుగారు తన్ననందుకు ధైర్యం వచ్చింది మంత్రి నరిసికి. ఇహ తను విన్నదీ, విననిదీ చెప్పేవచ్చని మొదలెట్టాడు. "బాబుగోరికి తెలవదుగాని మన్నాయుడుగోరే మన్ని దగా చేసేట్ట. ఓట్లు లెక్కేతప్పుడు తవరుగోరు బైటుండిపోనారుగాని మనూళ్ళోనే మనకి తక్కువొచ్చేయట ఓట్లు. నాయుడుగోరి వోర్డులో పావలాభాగం కూడా పడనేదట మనకి" అన్నాడు.

ఇంక రాజుగా రూరుకోలేక పోయేరు. "నీ కెవరు చెప్పేర్రా గాడిదా?" అనడిగేరు. ఆ గాడిదా అన్నమాటలో కోపంలేదని గ్రహించిన మంత్రికి రాజుగా రింట్లో పలావు విందుకి పిలిచిన ట్లనిపించింది. "తవరట్టాగే అనుకుంటూ వుండండి బాబయ్యా! ఊరంతా కోడై కూస్తుంటేనూ! రేతిరి మా యీ చ్చివర బడ్డీకొట్టుకాడ కమ్యూనిస్టుకుర్రాళ్ళు పబ్లీగ్గా అంటూంటే! తవరిగోరిదో మాలోకం. నా మాటబద్ధవైతే ఓట్సు నెక్కలు తెప్పించుకుని సూడగూడదా" అన్నాడు.

క్షౌరం తర్వాత నరిసి రాజుగారికి తలంటుతూ "మనమీద నిలబడ్డది కిష్టారావు నాయుడేగందా. అలా తప్పుడు మరి మనం న్నాయుణ్ణెందుకు నమ్మేవూ అంట?" అని పాడేసేడు, తనుగూడా రాజుగారితో పాటు నాయుణ్ణి నమ్మి మోసపోయినట్టు.

తలంటయ్యేక రాజుగారి బుర్ర చురుగ్గా పని చెయ్య నారంభించింది. తర్వాత నర్సి చెప్పిన "ఓట్సు లెక్కలు" చూస్తే వాడు చెప్పిన

దాన్లో నిజం లేకపోలే దనిపించింది. తర్వాత భోంచేసి పందిరిమంచం మీద వెల్లకిలా పడుకొని దోమతెర గళ్ళు నూటపదమూడుదాకా లెక్కెట్టే సరికి నర్సి చెప్పింది నిజమే ననిపించింది. అగ్గికి ఆజ్యం పోస్తూనే వున్నారు ఊళ్ళోవాళ్ళు. రాజుగారి అనుమానం కొన్నాళ్ళకి నమ్మకంకింద మారిపోయింది. కాని, ఆయన పైకి తేల్లేదు. నాయుణ్ణి మామూలుగానే కలుసుకుంటున్నాడు. నాయుడి క్కూడా తను రాజుగార్ని దగా చేసేనని ఊళ్ళో అనుకుంటున్నారని తెలుసు. కాని, ఆ ప్రసక్తి రాజుగారెత్తందే నేనెందు కెత్తాలని వూరుకున్నాడు.

ఎలక్షనైన ఓ నెలాళ్ళకు రాజుగారు నాయుణ్ణి పిలువనంపేరు. కబురందగానే హాజరయ్యేడు నాయుడు. ఆమాటా యీమాటా ఆడుకున్నాక రాజుగారు తన పేమునేసిన క్రయీజీఛైర్ చేతులమీద తన కాళ్ళు రెండూ "వార్‌గన్స్" లా పెట్టి "ఎలక్షనెలాగాపోయింది. ఏదేనా బిజినెస్ చెయ్యా లనుందోయ్ నాయుడూ" అన్నారు. అలా అంటున్నప్పుడు నాయుడు సినిమాహాలు తాను ప్రారంభోత్సవం చేసే ముందు, నాయుడు తనని తనకు తోచిన వాటా హాల్లో తీసుకోమనడం, "ఏదో బిజినెస్సులోకి కొత్తగా దిగేవు. నువ్వేకానీ" అని తను నాయుడుతో అనడం పూర్తిగా జ్ఞాపకం వున్నాయి రాజుగారికి. కాని ఆ విషయం మరచిన నాయుడు "చిత్తం. ఏలైను మీదుంది తమమనసు?" అనడిగాడు. రాజుగారు కాస్సేపాగి "అదేనోయ్ తోచడంలేదు—పోనీ సినిహాల్లో ఏదేనా వాటా తీసుగుంటే..." అని అసంపూర్తిగా వాక్యం వదిలేసి నాయుడు తనవేపు చూడ్డంలేదని తెలుసుకుని అతని కళ్ళవేపు పరీక్షగా చూసేరు.

నాయుడుకి నవ్వాలో ఏడవాలో తెలీలేదు. మూడుహాల్సుతో కాంపిటీషను నిలబళ్ళేక తనే సతమతమై పోతూవుంటే తన హాల్లో రాజుగారికి వాటా యివ్వడం, ఆయనకి అపకారం చెయ్యడవేఁ అనిపించింది. ఓ క్షణం ఆలోచించి "తమమాట నేనెప్పుడూ కాదన్ను! కాని ఓమాట చెప్పకుండా వుండలేను. సినిమాలైనేం బావులేదు. క్రిందటేడు రాబడికీ, ఖర్చులుకీ సరిపోయింది. ఈ ఏడాదలా సరిపోతుందనే ఆశకూడా లేదు. తమరు ఎప్పుడు ఎంతవాటా కావాలన్నా నేను సిద్ధవేఁ. అటుపైని..."

చేతిలో సిగరెట్టు కిటికీలోంచి బయటికి గట్టిగా గిరవాటేస్తూ రాజుగారు నాయుడు మాట కడ్డంవచ్చి. "అబ్బే అదేం కాదోయ్! నువ్వేం బాధపడకు. నేనిలా అడిగేనన్న విషయమే మర్చిపో. పోయిరా. పాపం ఏదో పనుందనుకుంటాను" అన్నారు.

నాయుడు నమస్కారంచేసి వెళ్ళిపోయేడు.

నాయుడింత దొంగ అనుకోలేదు. వాటా యివ్వటం ఇష్టం లేకపోతే సూటిగా చెప్పరాదా! దొంగవేషాలువేసి లేనినష్టం సృష్టించడ వెందుకు? అనుకున్నారు రాజుగారు తన్లో.

రాజుగారికీ, నాయుడుకీ బెడిసిపోయిందని ఊళ్ళో అందరూ పబ్లిగ్గావే అనుకోవడం ప్రారంభించేరు. వారిద్దరూ పైకిమాత్రం పూర్వంలాగే మాట్లాడుకుంటూ తిరుగుతున్నారు.

ఓనాడు రాజన్రాజుగారి దూరబ్బంధువూ, మంత్రీ అయిన సీతారామరాజుగారు వాళ్ళూరొచ్చే సందర్భాన వారికి నాయుడు మునిసిపాలిటీ తరఫున ఆహ్వాన సభ ఏర్పాటు చేసేడు. అసలు రాజన్రాజుగారు ఎలక్షన్లలో గెలిస్తే ఆ మంత్రి పదవి సీతారామరాజుక్కాకుండా, వారికే దక్కేదని అభిజ్ఞుల అంచనా. వీరు నెగ్గకపోవటం వల్ల వీరిముఠాకే చెందిన సీతామరాజుగార్ని ఆ అదృష్టం వరించిందంటారంతా. బండెడు పూలమాలలు వేసికొని మంత్రిగారు తన వూళ్ళో ఊరేగుతూంటే రాజుగారి వంటి కాముదం రాసుకున్నట్టున్నా, చడీ చప్పుడూ లేకుండా మంత్రిగారి కారు వెనకే తన టాపు తీసేసిన జీపులో ఆ మంత్రిగారికి జరుగుతున్న గౌరవమంతా తనదేనని కనిపించేలా చిరునవ్వుతో మండు టెండలో ఊరేగారు, వారుకూడా.

మధ్యాహ్నం మూడు గంటలకి బస్‌స్టాండులో ఆరంభ మయింది ఆహ్వాన సభ. అసలే ఒంటికాముదం రాసుకున్నట్టున్న రాజుగారికి, దాని మీద కారం చల్లినట్లయింది, వారు వేదికమీద కాకుండా దిగువ కుర్చీల్లో కూర్చోవలసివచ్చినప్పుడు. "ఈ సున్నప్పిడతగాళ్ళపాటి చేయక పోయేనా, నాయుడికి నేను" అనుకున్నారు, వేదికమీద నాయుడికీ, మంత్రిగారికీ రెండు వైపులా స్వయంవరాని కొచ్చిన రాకుమారుల్లా కూర్చున్న కౌన్సిలర్లని చూసినప్పుడు.

నాయుడు స్వచ్ఛంగా తెలుగులో ఆహ్వానపత్రం చదువుతూవుంటే అందరూ శ్రద్ధగా విన్నారు. ఆహ్వాన

- "ఈ నెక్‌టై ఎంతక్కొన్నావురా?" అని తండ్రి కొడుకు నడిగాడు.
"పదిరూపాయలు నాన్నా!"
"ఓరివెధవా! డబ్బు ఊరికే తగలేస్తున్నావ్, దాని బదులు మంచి చెప్పులజోడు వచ్చేదిగా."
"బలేవాడివి నాన్నా! చెప్పులు మెడకి కట్టుకుని తిరగమంటావా?"

పత్రం అతిశయోక్తులూ, అతిపొగ డ్తలూ లేకుండా, రెండు మూడు పసందైన విట్లతో విన సొంపుగా వుంది. అందులో మంత్రిగారిని భట్రాజులా కాకుండా పొగడాల్సి నంత పొగిడాడు నాయుడు. 'ఇంత తెలివెక్కడిది నాయుడికి? తన మునిసిపల్ హైస్కూలు ఇంగ్లీషు, తెలుగు మేష్టర్ల చేత రాయించేసుగునుంటా' డని సర్దిచెప్పుకున్నారు రాజుగారు.

మంత్రిగారు సమాధానం చెప్ప డానికి లేచారు. పాతకథల్లో కోయ జాతులవారిచే పట్టుకోబడి, వారిచే బలి యివ్వబడేముందు ముస్తాబు చేయబడ్డ రాకుమారుళ్ళా ఉన్నారు, మెళ్ళో మోయలేనన్ని పూలదండ లతో. వారు ఏం శెలవిస్తారా' అని ఆదుర్దాగా ఎదురుచూస్తున్న సభికులని ఓ నిమిషం నవ్వుతూ కలయజూసి, ఏం మాట్లాడకుండా తన మెళ్ళోవున్నూ, టేబిలుమీదా వున్న సగం దండలు నాయుడుమెళ్ళో వేసేరు నవ్వుతూ. ఈ సైలెంటు స్పీచికి సభలో విపరీ తంగా చప్పట్లు కొట్టేరు. ఇదంతా చూడ్డం ఇష్టంలేని రాజుగారు పక్క నున్న ఎ. ఎస్. పి. తో ఏదో మాట్లాడ్డం ప్రారంభించారు.

మంత్రిగారు తమ సమాధానంలో 'మన్నాయుడు' యింతవా డనుకో లేదని, ముందు ముందు యితను అసెంబ్లీకి వచ్చి దేశాన్ని నడిపించ గలడని పొగుడుతూవుంటే, అదివరకే ఆముదం రాసుకొని కారంజల్లుకున్న ట్లున్న తమవంటికి దూలగుండాకు రాసినట్లు ఫీలయ్యేరు రాజుగారు. ఆ రాత్రి నాయుడు దేశమనే ఓ ఆడ

కూతుర్ని రెక్కట్టుకొని గొర గొరా యీడ్చుకుపోతున్నట్టు కలకూడా వచ్చిం దాయనకి. సభ ముగిసేక, తమకు కలిగిన నిశ్చితాభిప్రాయం తమ కళ్ళలోగాని, దేహం తాలూకు మరే ఇతర భాగంలోగాని కనిపించ నీయకుండా నాయుడికి షేక్‌హేం డిచ్చి వెళ్ళిపోయేరు రాజుగారు.

ఇంతలో మునిసిపల్ ఎలక్షన్లొ చ్చేయి. రాజుగారీ మారు నిలబడ తారేమోనన్నట్టు నాయుడు ముందు రాజుగారి మనుషులు ఒకరిద్దరన్నారు. 'అంతా రూమర్లు. వారికీచిన్న పన్లెందుకు' అన్నాడు నాయుడు. రాజుగారూ, నాయుడూ యుద్ధం చేస్తే చూద్దామని వారి శత్రువులకీ, వారిరువురికీ యిదివరకు మిత్రులైన వారికీకూడా కోర్కె కలిగింది.

ఇలా ఉండగా ఓ ఉదయం నాయు డింటిముందు రాజుగారి జీపు ఆగడం చూసిన వాళ్ళందరికీ ముచ్చటగా వుంది. మళ్ళీ జీపు బయలుదేరే లోపున ఓ ఏటంబాంబు పేలక పోతుందా అని వారి ఆశ.

నాయుడుతో రాజుగారు సూటిగా తన మనసులో వున్నదాన్ని వ్యక్తం చేసేసేరు—తనకీమారు చైర్మ నవ్వాలని వుందనీ, నాయుడీమారు తప్పుగుంటే మంచిదనీ, కావాలంటే వచ్చేసారి నాయుడు ఎసెంబ్లీకి నిల బడ్డానికి తానడ్డురాననీ, యింకా కావాలంటే నాయుడొక వార్డునుండి కౌన్సిలరవడానికి తనకు అభ్యంతరం లేదని. రాజుగారు చెప్పిన ముఖ్యాంశాలు. నాయుడు ప్రాధేయపడ్డాడు. మునిసిపాలిటీ జోలికీ, తనజోలికీ రావద్దనీ, ఎసెంబ్లీకి నిలబడేతాహతు తనకు లేదని విన్నవించేడు. మన్లో మనకి దెబ్బలాట లొద్దని సలహా ఇచ్చేడు. కానీ తాను చైర్మనుగిరి నుండి తప్పుకోడానికి మాత్రం వప్పు కోలేదు. 'ఐతే నామాట కాదంటా వన్నమాట' అన్నారు రాజుగార్లేస్తూ.

ఔననీ, కాదనీ బదులు చెప్పలేదు నాయుడు. రాజుగార్ని మాత్రం జీపు దాకా దిగబెట్టి, వారిజీపు తమ వీధిచి వరసందు మళ్ళేదాకా అలే చూస్తూ వుండిపోయేడు.

ఆ సాయంత్రంనుండీ ఊళ్ళో హడావిడి పెరిగిపోయింది. ఇదివర కున్న పాతపార్టీలు మాయమైపోయేయి. మునుపు మునిసిపాలిటీలో అపొజిషన్ లీడరైన వరాల్సెట్టి, తాను చైర్మన్ కాకపోయినా ఫరవాలేదు కాని నాయుడవడానికి వీల్లేదనుకొని 'రాజుగారికీజై' అంటూ రాజుగారి పార్టీలో చేరిపోయేడు. ఇదివరకు వరాల్సెట్టి పార్టీలో వున్న క్షత్రియులు కొంతమంది, తమకి రాజుగారిమీదున్న కక్షకొద్దీ వరాల్సెట్టి నొదిలేసి నాయుడి పార్టీలో చేరిపోయేరు. రాజుగారంటే మోజున్న నాయుడుపార్టీ మనుషులు రాజుగార్నే కొలుస్తూ వుండిపోయేరు.

నాయుడు, రాజుగారు మాత్రం ముఖాముఖీ ఢీకోలేదు. ఇద్దరూ చెరో వార్డునుంచీ నిలబడ్డారు. నాయుడు మీద తన వేలువిడచిన మేనల్లుణ్ణి నిలబెట్టారు రాజుగారు. రాజుగారిమీద తనసొంత బామ్మరిదినే నిలబెట్టాడు నాయుడు.

ఎలక్షన్లు దగ్గరకొస్తున్న కొద్దీ రోషాలూ, పౌరుషాలూ పెరిగిపోయేయి. రెండుపార్టీలూ చెరో నూటయాభై రిక్షాలు గుత్తకి పుచ్చుకున్నారు. మొదట్లో గోడలమీద 'రాజుగారికే మీ ఓటు' అన్న మాటల పక్కగావుండేవి 'నాయుడుకే మీ ఓటు' అన్నపదాలు. ఎలక్షన్లు దగ్గర కొచ్చేకొద్దీ 'నాయుడుకే మీ ఓటు' మీద 'రాజుగారికే మీఓటు' అనీ, 'రాజుగారికే మీ ఓటు' మీద 'నాయుడికే మీ ఓటు' అనీ కనిపించసాగేయి. గోడలమీద రాసిందే చదువుకుని ఓటేద్దామనుకున్న వారికి మాత్రం రాజన్నాయుడుగార్కి ఓటెయ్యడమో, నాయుడురాజుగార్ని బలపర్చడమో తెలీలేదు.

ఎలక్షన్లో పదిరోజు లుందనగా రాజుగారి రిక్షావాణ్ణి, నాయుడు రిక్షావాడు కొట్టేడని ఓ క్రిమినల్ కేసు దాఖలైంది. ఆ మర్నాడు రాజుగారి జీపు నాయుడుపార్టీ రిక్షాని కావాలనే గుద్దిందని, జీపు డ్రైవరు మీద కేసు దాఖలైంది.

'వీడిబాబు సంతలా సీలుచేసుకునేవాడే కదా! వీడేం నాయుడు? చత్కా కీ. నాయుడు' అని రాజుగారన్నారని ఓ పుకారు.

'ఇతనేంరాజు. దుంపల్రాజు. యితని పంక్తిని పూసపాటివారూ, చింతలపాటివారూ భోజనంకూడా చెయ్యరట. పెంకుట్రాజు' అని నాయుడన్నాడని మరోవదంతి.

'రాజుగారికి నాయుడు సినిమాహాల్లో మూజువాణీగా పావలా వాటా వుండేదనీ, దానికి కాగితం కలం లేకపోవడం చూసి నాయుడెగ్గొట్టేశేడని' ఓ అభియోగం. గత ఎలక్షన్లో రాజుగారికి నాయుడు మదుపెట్టిన పదివేలూ ప్రోనోట్లుని అవకాశం చూసుకొని రాజుగారెగ్గొట్టేరని యింకో అభియోగం.

రెండుమూడు కొట్లాటలు మినహాయిస్తే చల్లగానే జరిగిపోయేయి. రాజుగారి వేలువిడిచిన మేనల్లుడిదీ, నాయుడిబామ్మరిదీ పోయింది. రాజుగార్కి 55 ఓట్లు మెజారిటీ. నాయుడికి 54 ఓట్లు మెజారిటీ.

తర్వాత ఛైర్మను ఎన్నిక లోపల్లోపల గూడుపుఠాణీల్తో నిండిపోయింది. ముసుగులో గుద్దులాటమాని సూటిగా పోటీచేశారు రాజుగారూ, నాయుడూను. రాజుగారిపార్టీలో ఎన్నికైన ఓ హరిజనుణ్ణి, తన సినిమాహాల్లో బీడీకొట్టు అతనికొడుక్కి అద్దెకిచ్చి లాగేశాడు నాయుడు. నాయుడుపార్టీలో చేరిన ఓ క్షత్రియుణ్ణి, అతని మాతామహుడిచే చెప్పించి, పిలకట్టు కీడ్చుకొచ్చేరు రాజుగారు తమ పార్టీలోకి. ఏ పార్టీ లేకుండా ఎన్నికైన ఓ కౌన్సిలర్ని ట్రేక్టరు కొనుక్కోడానికి అప్పిచ్చి తమ పార్టీలో కలుపుకున్నారు రాజుగారు. అలాగే ఎన్నికైన మరోడ్ని 'నువ్వు వేరే ట్రేక్టరు కొండం దేనికి? దానికి అప్పు చెయ్యడం దేనికి? నా ట్రేక్టరే వాడుకో' అన్జెప్పి నాయుడు లొంగదీసుకున్నాడు.

నాయుడు రాశీ, రాజుగారి రాశీ కూడా తిరిగిపోయేయన్నారు జ్యోతిష్కులు. ఇదివరకు ఎసెంబ్లీ ఎలక్షను పోయింది కాబట్టి యిప్పుడు రాజుగారు ఛైర్మన్నవాల్సిందే అని కూడా అన్నారు.

ఎలక్షను దగ్గరపడుతున్నకొద్దీ మొగ్గు రాజుగారివైపే ఎక్కువయింది. నాయుడు యిల్లు కదల్డం మానేశేడు. చెరో పాతికవేలకి చెయ్యి కడుక్కున్నారని ఊళ్ళో అనుకున్నారు.

ఓ నాడు మధ్యాన్నం 3 గంటలకి ఛైర్మను ఎన్నిక పెట్టేరు. రెండు ఓట్ల మెజార్టీతో నాయుడు గెల్చేడన్న వార్త టౌట్లతో ఊళ్ళోకి పేల్చబడింది.

ఈ లోగా ఎప్పుడు సిద్ధం చెయించాడో కాని, యాభై మంది మంగళ్ళ బేండుతోటీ, మరో సన్నాయి మేళంతోటీ, అయిదువేల మంది పార్టీ అనుచరుల్తోటీ ఊరేగేడు నాయుడు అద్దెకార్లో. బేండు వాళ్ళు కసికొద్దీ వాయించారు రాజుగారింటిముందు. అక్కడే యాభై అవుట్లుకూడా పేల్చేరు నాయుడు అనుచరులు. ఆ రాత్రి సినిమాహాల్లో అందరికీ ఫ్రీగా మూడాటలూ చూపించేడు నాయుడు.

ఆ తర్వాత చాల్నాళ్ళు రాజుగారు యిల్లు కదలడం మానేసేరు. అసలతను ఊళ్ళో ఉన్నదీ లేనిదీకూడా ఎవరికీ తెలీనివ్వలేదు.

నాయుడుకూడా చాలారోజులు విందు వినోదాల్లో మునిగిపోయేడు.

5

సాయంత్రం అయిదు కావస్తూంది. జడ్జీగారు బెంచి దిగుదామనుకుంటూన్నంతలో, కోర్టులోకి కొత్త వకీలుగా రావడం ఆశ్చర్యం కలిగించింది. ఆరడుగుల ఎత్తు, పక్కకెన్నరుస్తున్న జుట్టూ, తెలివితో మెరిసేకళ్ళూ,

---

● జోళ్ళషాపులో ఒకడు : 'ఈ జోళ్ళు ఎన్నేళ్ళయినా మన్నుతాయని యెలా తెలుసు మీకు?'

యజమాని : 'ఇవి ఒకసారి కొన్నవాళ్ళు మళ్ళీ కొనడం నేను చూడలేదండి. అందుకని.'

శుభ్రమైన బట్టలూ, మెరుస్తున్నకొత్తగాను, ఖరీదైన జోళ్ళూవున్న ఆయన్నుచూసే సరికి, యిదేదో హైదరాబాదు సరుకు, యిప్పుడు కాంపౌండులో కొచ్చిన కొత్తకారుకూడా వీరిదే అయ్యుంటుందనుకున్నారు జడ్జీగారు. ఇతనెందుకొచ్చుంటాడా అని జడ్జీగారాలోచిస్తూంటే, ఆ వకీలు 'మునిసిపల్ ఎలక్షను గురించి మాపార్టీ ఓ పిటీషనుదాఖలు చేసుకుంటాడు, యీవేళదాటితే పిటీషను లిమిటేషను పట్టిపోతుం'దని వినయంగా మనవిచేసి, వారిపార్టీ చేత అంటే రాజుగారి వేలువిడిచిన మేనల్లుడు రామరాజు చేత జడ్జీగారితో పిటీషనిప్పించేడు.

వెంటనే ఛైర్మన్నాయుడుమీద ఎలక్షను పిటీషనొచ్చిందన్నవార్త ఊరంతా గుప్పుమంది. నాయుడు తాను కౌన్సిలరవడంలో వందఓట్లు డబ్బిచ్చి కొన్నాడనీ, 34 చచ్చిపోయినవాళ్ళ ఓట్లు వేయించుకున్నాడనీ, మరో ముప్పైదాకా ఎలక్షన్నాడు ఊళ్లో లేనివాళ్ళఓట్లు తనపార్టీ మనుషులచేత వేయించుకున్నాడనీ, కొంతమంది ఓటర్లను ఫ్రీగా తన సినిమా హాల్లోకి వదలి వాళ్ళఓట్లు సంపాయించేడని ఆ పిటీషన్లోని ముఖ్యాంశాలు.

ఆ సాయంత్రం క్లబ్బులో రాజుగారు 'మా వకీలు సూర్యనారాయణ రాజు పెద్దపేరున్నవాడు. ఆయన హైకోర్టు జడ్జీఅయ్యేలోగానే యీ కేసు చేయించేసుకోగోవాలి' అన్నారు.

అదివిన్న నాయుడు 'కాబోయే హైకోర్టుజడ్జీ ఏంఖర్మ? వీలైతే హైకోర్టుజడ్జి చేసినవాణ్ణే లాక్కొస్తా నా తరపున' అని హైద్రాబాదు రైలెక్కాడు. కాని హైకోర్టుజడ్జి చేసినవాళ్ళని తన వకీలుగా పెట్టుగోడానికి వీల్లేదని విన్నాక, హైకోర్టు వకీలు ఉమాపతిని కుదుర్చుకు తిరిగొచ్చి, తన వకీలుకి యిదివరలో హైకోర్టుజడ్జి యిస్తావంటే వద్దనేశేట్టు అని అన్నాడు.

'ఇంక నాయుడ్ని ఛైర్మను కుర్చీలోంచి పీకేయడం రోజులుమీదపని' అని రాజుగారన్నార్ట.

అదివిన్న నాయుడు 'అంతగా అయితే యీ కుర్చీలోనే పిస్తోలుతో కాల్చుకు ఛస్తాగానీ ఖాళీచేస్తానా?' అన్నాట్ట.

6

ఆ నాడు జడ్జీగారికేం బావులేదు. నిజం చెప్పాలంటే అవదం తాగినట్టుంది. కడుపులో వికారంగానూ, మనసులో చికాగ్గానూ ఉంది. దానికారణం తాను విచారణ చేస్తున్న ఛైర్మను ఎలక్షను కేసుమాత్రం కాదు. ఆ వేళ సాయంత్రం టపాలో తన పినతండ్రికొడుకు దగ్గర్నించొచ్చిన ఉత్తరం ఆయన్నంత బాధపెడ్తోంది.

రాధని, సుగుణమ్మ పిన్తల్లికొడుకు

విశ్వనాధం కొడుకు శర్మకి ఇద్దామని చిన్నప్పట్నించీ అనుకుంటున్న మాటే. రాధ, శర్మలతో సహా అందరికీ యిష్టమే. ఈ రోజుల్లో ఏమీ కట్నం లేకుండా చేసుకుంటారని కూడా జడ్జీగారనుకోలే దెప్పుడూ. రాధ పెళ్ళికి కట్నానికైతేనేం, ఖర్చులకైతేనేం ఆరువేలు కేటాయించారాయన. వీలైతే వచ్చే జ్యేష్ఠంలో పెళ్ళి చేసేద్దామని, కట్నంగురించి కాస్త మాట్లాడిపెట్టమని తన పిన్తల్లి కొడుక్కి రాసే రాయన. విశ్వనాధానికి 10 వేలదాకా ఆశున్నట్టు జవాబిచ్చేడు పిన్తల్లి కొడుకు.

కొడుకెంత ఎమ్. బి. బి. యస్సయితే మాత్రంఇదివరకున్నబంధుత్వం, రాధ చిన్నప్పట్నించీ అనుకున్న మాటా మరిచిపోయి, యిప్పుడు పది వేలు పిండుదామని చూస్తాడా విశ్వనాధం, అని ఆలోచిస్తూ కోర్టునుండి యింటికి తిరిగొచ్చినాయన్ని వీధి వరండా దాటి లోపలికి తీసుగెళ్ళలేకపోయే యతని కాళ్ళు.

నిట్టూరుస్తూ వీధి వరండాలో యీజీఛైర్లో కూలబడ్డారు బట్టలు మార్చుగోకుండానే. వీధి వరండాలో లైటు వెయ్యలేదెవరూ చీకటి పడుతున్నా. ఇంట్లో అలికిడి కూడా ఏమీలేదు. సుగుణమ్మ పక్కింటి కెళ్ళిందేమో అనుకున్నారు జడ్జీగారు.

పిల్లల్ని సినిమాకి పంపించి పక్కింటి కెళ్ళకుండా నట్టింటో వంటచేసుకుంటున్న సుగుణమ్మ, భర్త వీధి వరండాలోనే కూలబడ్డం చూసి ఆత్రంగా వెళ్ళిందాయన దగ్గరికి. ఆయనేం మాట్లాడక పోవడంచూసి అవిడే పలకరించింది. ఆయనో పది నిమిషాలు బాధపడ్డాక చెప్పేశారు అసలు విషయం. అతనంత బాధా ఆమెకూడా పడి కాఫీకి నీళ్ళు స్టౌమీద పడేసి వచ్చి కూర్చుందాయన ప్రక్క మరో కుర్చీలో. సరిగ్గా ఆ టైములో వచ్చేడు లింగన్న, 'యీ వేళఎత్తుకు ఆలీసం ఐపోయినట్టుంది' అంటూ.

'రండి, కూర్చోండి పంతులుగారూ, యీవేళ మనసేంబావులేదు.' అంటూ ఆహ్వానించేరు జడ్జిగారు. ఆయనకి ఆ బాధలో లింగన్న ఆప్తబంధువులా కనిపించేడు. బాధలో వున్నప్పు డెవరికైనా, తన్ని బాధపెడుతున్నవాడు మినహా మరో ప్రాణి తోడుంటే చాలనిపిస్తుంది. ఆప్రాణే పరిచయస్తురాలైతే మరి చెప్పనక్కర్లేదు.

జడ్జిగారు విచారణచేస్తున్న పెద్ద ఎలక్షనుకేసే వారిని బాధపెడుతున్నాదనుకున్న లింగన్న పంతులు 'ఆ హైకోర్టు వకీళ్ళు కాల్చుకు తింటున్నార్లేవుంది తమర్ని' అన్నాడు సానుభూతిగా.

'ఏం హైకోర్టు వకీళ్లో! ఏం పాడో! వేచుకుతింటున్నారనుకోండి. తన పార్టీ ఎలక్షన్లో గెలుచుకున్నాడు కాబట్టి కేసు వాయిదాలు వేయిం

చడంకోసం చూస్తాడా ఉమాపతి. వేటకుక్కలా కరిచేస్తాడు సాక్షుల్ని సూర్నాయణరాజు" అన్నారు జడ్జీగారు, తన్ని బాధపెడుతున్న హాంశం తాత్కాలికంగానైనా తన మనసులోంచి తప్పించినందుకు పంతులిని తన మనసులోనే అభినందించేడు కూడా.

ఈలోగా సుగుణమ్మ చెరోగ్లాసు కాఫీ వారిద్దరికి అందించి తానో కుర్చీలో కూలబడింది. జడ్జిగార్నేది బాధపెడుతోందో తెలీని లింగన్న "తమగొప్ప తమదగ్గర చెప్పడంకాదు కానీండి! తమరు ఎంత పెద్దకేసైనా అవలీలగా కీలకం పట్టేస్తారని, ఏ సిఫార్సుకూ లొంగరనీ, తమ తీర్పులంటే హైకోర్టులో కూడా కళ్ళ కద్దుకుంటారని అందరికీ తెలిసిపోయింది" అన్నాడు.

"ఎన్నంటే ఏంలాభవండీ! అసల్లేకపోయేక" అన్నారు అర్థోక్తిగా.

పంతులుకి ఏవీఁ పట్టుబడ్లేదు.

"తమరేదో చికాకులో వున్నట్టున్నారు. మళ్ళీ దర్శనంచేస్తా" అంటూ లేవబోయేడు. నడిసముద్రంలో చిన్న ద్వీపంలో తనవద్ద వున్నఒక్కడూ

తనని వదిలి వెళ్ళిపోతూన్నట్టనిపించింది జడ్జిగారికి.

"అయ్యయ్యో! కూర్చోండి. తమకంటె కావలసిన వాళ్ళెవరున్నారు మాకు? కూర్చోండి. కూర్చోండి" అంటూ కూర్చోపెట్టేసేరు లింగన్నని. కూర్చోపెట్టేక తన మనసులోవున్న బాధ వెళ్ళగక్కేశారు. బాధ వెళ్ళగక్కేక "ఇప్పుడు నన్నేం చెయ్యమంటూరు చెప్పండి? పదివేలు కట్నం కావాలన్న ముండావాడు నా దగ్గరున్న ఆరు వేలూ ఖర్చులకింద తగలెట్టించకుండా వదుల్తాడంటూరా? ఎక్కణ్ణించి తెమ్మంటూరిప్పుడు పదివేలు? ఇహ యింత బతుకూ బతికీ మీలాంటివా రెవరిద్వారానో లంచం కుదుర్చుకోవాలి" అన్నారు.

లింగన్న అనుభవశాలి. గడసరి. మాటకారి. ఎప్పుడే మాటలంటే ఎవరికి నచ్చుతుందో తెలుసు. తన మాటల్తో జడ్జిగారికి కొంత గాకపోతే కొంతైనా మనశ్శాంతి కుదిర్చిపెట్టేడు. ఆ తర్వాత వర్షం వస్తుందన్న తొందరవల్ల జడ్జిగారి శలవు తీసుకొని యింటికి బయలుదేరేడు. కాని, దార్లోనే వచ్చేసింది వానజల్లు.

7

వాన్లో తడిసి "రాజేశ్వరీ"అంటూ తన బొమ్మరిల్లులాంటి నాలుగిళ్ళ వాకిలి మెట్లెక్కుతున్న లింగన్న పంతులు లోపలి వరండాలో పరాయి వాళ్ళున్నట్టు గ్రహించి, ఆశ్చర్య పడుతూ లోపలి కెళ్ళి ఇంకా ఆశ్చర్యపడిపోయేడు, కుర్చీలో కూర్చున్న నాయుణ్ణి చూసి. మూర్చొచ్చినంత పనైంది తన్ను చూసి నాయుడు లేవగానే.

"అయ్యో! అయ్యో!! తమరా!!! నాయుడుగారా? ఇంకే వుందింకేం వుంది? నేనేం అపరాధం చేశేను తమరిలా నన్ను శిక్షించడానికి?" అని నిలవదీ శడిగాడు. "తమరే రావాలా? కాకిచేత కబురంపితే తమ పాదాలవద్ద వాల్నా?" అని నచ్చజెప్పబోయేడు. ఏదేమైనా కుచేలుడింటికి శ్రీకృష్ణుడొచ్చినట్టుంది" అని ప్రశంసించాడు. లోపల్లోపల నాయుడి రాకక్కారణమేవై వుంటుందా అని ఆలోచిస్తూనే.

నాలుగుసార్లు ఛైర్మనైన నాయుడికి లింగన్న పంతుల్లాంటి వాళ్ళు కొత్తకాదు. అసలు విషయానికి రాకుండా లింగన్నపంతుల్ని, అతని క్షేమం, అతని పిల్లలక్షేమం అడిగాడు. వ్యవసాయమెలా సాగుతోందని ప్రశ్నించాడు. న్యారేమైనా కావాలా అని అడిగాడు, పి. యు. సి. పోయి యింట్లో కుర్రాడు రికామిగా కూర్చుంటే' తనతో చెప్పితే మున్సిపాలిటీలో ఓ రివిన్యూ యిన

స్పెక్టరు పనైనా వేయించక పోయేనా అని, ఎందుకు చెప్పలేదని, నిందించేడు.

ఓ పది నిముషాలు దసరాఉత్సవాల్లో గరిడీ వాళ్ళలాగా అసలు విషయం దగ్గరకు రాకుండా, యిద్దరూ దూరదూరంగా సాము చేశారు. కొంతసేపయ్యేక అసలు విషయానికి దగ్గరగా రానారంభించాడు నాయుడు. "జడ్జిగారెలాటి వాడు" అనడిగాడు.

"కేసుల్సంగతి తెలీదు గానండి, చదరంగంలో పెద్దచెయ్యే" అన్నాడు గడుస్తనంగా పంతులు.

"అది కాదయ్యా, మనిషెలాంటి వాడు" అన్నాడు నాయుడు విసుగ్గా.

"ఆ విషయం నాకంత బాగా తెలీదు. ఏదో సాయంత్రంపూటో ఆటవేస్తాం గాని అంతకుమించి నాకంతబాగా తెలీదు"

"పిల్ల పెళ్ళీడు కొచ్చిందికదా! ఎలా చెయ్యదల్చుకున్నాడు పెళ్ళి?"

"ఆ విషయం కూడా సమంగా తెలీదు."

"ఏవేఁనా వెనకేశాడా!"

"నాకేం నిజంగా తెలీదు."

"వెనకేం ఆస్తి అంతగా లేదుల్లే."

"అహాఁ!"

"నీవంటే గురేనా?"

"బతిమాలుకొని ఓ బంట్రోతుద్యోగం ఎవరికేనా వేయించగల్నేమోగాని అంతకుమించి స్లోకేం పలుకుబడిలేదు."

"చల్లకొచ్చి ముంత దాచడవెందుకు పంతులూ! నా కేస్సంగతి తెలుసుగదా! ఎలాగైనా నన్నీకేసు గెలిపించిపెట్టాలి. నీకష్టం నేనుంచుగోను, పనయ్యేక వెయ్యిన్నూట పదహార్లు నీకు ముట్టచెప్తా. నీ కొడుకుని రివిన్యూ యినస్పెక్టరుచేస్తా. పిల్లల వాడివి ఆలోచించుగో" తేల్చేశాడు నాయుడు.

"బాబ్బాబు, నన్నందులో కిడ్చకండి బాబోయ్. లేగపెయ్యని, తవఁ దెబ్బలాటల్లో నలిగి చస్తాను. బాబోయ్! రాజుగారికీమాట తెలిస్తే నా కొంపంటింపించేస్తాడు. నాయిల్లు పీకింపించేస్తాడు. తవఁమాట వింటేనే పెరట్లోకి చెంబట్టుకు పరిగెత్తాల్సి వస్తూంది. తవఁరిక్కడే కూర్చోండి. చిటికెలో వచ్చేస్తా!" అంటూ పెరట్లోకి పరిగెత్తేడు. కాని చెంబట్టుకొని మాత్రం కాదు. పెరట్లో చీకట్లో గున్నమామిడిచెట్టుకింద నిల్చొని లంకాకు చుట్టంటించి ఓ ఐదునిమిషాలు లెక్కలు కట్టేడు. అంచనాలు వేశాడు. తన ఆలోచన అతనికి సంతుష్టికరంగానే కనిపించింది. తను కట్టిన లెక్క రెండెళ్ళు నాలుగన్నట్టు సరిపోయింది. నాయుడికి నమ్మకం పుట్టించేందుకు కాళ్ళు కడుక్కుని, తనలోపల కలిగినసంతుష్టి దిగమింగి, ఆవఁదం తాగినట్టు మొహంపెట్టి నాయుడు దగ్గరకెళ్ళి స్తంభానికానుకొని నేల్నచతికిలపడ్డాడు.

"ఏవాఁలోచించేవు పంతులూ?" అనడిగేశాడు నాయుడు. కాని పంతులేం మాట్లాడలేదు.

"నువ్వనవసరంగా కంగారుపడకయ్యా! మీ జడ్జిగారైనా ఏవంత పతివ్రతకాడట రాజమండ్రిలో పని చేస్తున్నప్పుడు ఎవరో కిరస్తానీ అమ్మాయిని పట్టుగేడ్చిన రకవేఁనట. అక్కడిలాటి కేసులు ఒకట్రెండిట్లో కతికిన రకవేఁనట. నువ్వనవసరంగా బెంగెట్టుకోకు" అని నాయుడు ధైర్యం చెప్పేడు.

పంతులింకేం మాట్లాడకపోతే బాగుండదని "కాని నాకేదో భయం వేస్తోంది. బెడిసికొట్టితే జైలుకెళ్ళిపోవాలి" అన్నాడు చలిలేకపోయినా వణకుతున్న గొంతుకతో.

"నువ్వు జైలుకెళ్తే, నీ కుటుంబం భారం అంతా నేను మోస్తాను. కాని నువ్వు కాదనకు" అన్నాడు నాయుడు.

కొంత తర్జనభర్జనయ్యేక, సాయం చెయ్యడానికొప్పుకున్నాడు పంతులు. "కాని నే చెప్పినంతమాత్రాన పన్జరగదు. ఇంకేవైఁనా ఉపాయవాఁలోచించండి" అన్నాడు.

"ఉపాయానికేవిఁటయ్యా? ఒహటే ఉపాయం. డబ్బిచ్చికొంటమే మనం చేయగలిగింది" అన్నాడు నాయుడు.

ఆఖరికి నాయుడు తనకు వీలైనంత పైకంతెచ్చి మర్నాటి రాత్రి పంతులు, కివ్వడానికి, పంతులు ఆపైకం జడిగారి కివ్వడానికి ఒప్పందం అయిపోయింది వాళ్ళిద్దరి మధ్య.

"కాని ఒక్కమాట," అన్నాడు పంతులు. నాయుడు లేవబోతూ వుంటే, "తవఁ కానీ నా కొద్దు. మనమనుకున్న ప్రకారం పనికాకపోతే, డబ్బుకక్కుర్తిపడి నేనే తవఁరు డబ్బివ్వలేదనొచ్చు. "మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః" అని వూరికే అన్లేదు మనవాళ్ళు. అంచేత నావల్ల ఓ ప్రోనోటుచ్చుగోడాని కంగీకరించాలి

- మేజస్ట్రేటు పోలీసుతో : వాడు తాగివున్నట్టు ఎలా కనిపెట్టావు ?

పోలీసు : పెళ్ళాన్ని అదే పనిగా చావగొడుతుండగా పట్టుకున్నానండి.

మేజిస్ట్రేటు : వాడు తాగినట్టు ఎలా తెలిసిందీ అంటున్నాను.

పోలీసు : అప్పుడక్కడ వాడి పెళ్ళాం లేదండి.

తవఁరు" అని షరతు పెట్టేడు. నాయుడు సరేనని లేవబోతూవుంటే "మరో షరతు" అని ఆపేశాడు పంతులు. "తవఁరూ, నేనూ కలుసుకున్నట్టెవరికైనా తెల్సిందంటే కొంప మునిగిపోతుంది. రాజుగారికి తెలిస్తే యిహ చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏదేవైనా, నేను కబురెడితే తప్ప, జడ్జిమెంటు చెప్పిన పది రోజుల వరకూ తవఁరు నావేపు కూడా చూడకూడదు. అంతా ఆలోచించే చెప్తున్నా నీమాట" అన్నాడు. యీ షరతుక్కూడా వప్పుకున్నాడు నాయుడు.

"సూన్నారాయణ్రాజు కాటుకుక్కలా కరుస్తున్నాడటగా" అంటూ సాగనంపాడు పంతులు నాయుణ్ణి.

మర్నాడు రాత్రి ఊరంతా నిద్రపోయేక నాయుడు పంతులికి అయిదువేలిచ్చేడు. వద్దంటున్నా ఆయన జేబులో పెట్టేడు పంతులు తాను స్వదస్తూరీని వ్రాసిన ప్రోనోటు.

8

రెండోనాడు సాయంత్రం జడ్జిగారు పెందరాళే వచ్చేరింటికి. పంతులెంతకీ రాకపోవడం చూసి కబురెట్టేరు జవాన్ని. జవాను తిరిగొచ్చి పంతులింట్లో లేడన్నాడు ...

మసక చీకటి పడుతూండగా పంతులే హాజరయ్యేడు జడ్జిగారింటి దగ్గర. "ఏదో బజారెళ్ళాల్సొచ్చింది. అంచేత ఆలీసవఁయిపోయిం"దన్నాడు కుర్చీలో కూర్చుని చదరంగం బలం పేరుస్తూ.

"ఆటకేంగానండీ పంతులుగారూ! మీకో పసందైన మాట చెప్పాలి" అన్నారు జడ్జిగారు.

"చిత్తం! సెలవీండి" అన్నాడు పంతులు బలం పేరుస్తూనే.

"ఈవేళో ఉత్తరం వచ్చింది. ఎవ్రాశారో దాన్లో లేదుగాని, యీ ఎలక్షను కేసులో వో పార్టీట. వాడు నాకివ్వడానికి అయిదువేలు తవఁదగ్గరుంచేట్ట. నాకు డబ్బాశ వుంటే మిమ్మల్నడిగి తీసుకో మన్నాడు" అన్నారు జడ్జిగారు.

పంతులు చిరునవ్వు చెరిగిపోనీకుండా చదరంగం బలం పేరుస్తూనే ఉన్నాడు.

"ఏ వెధవ రాసేడో తెలిస్తే జైలుక్కట్టేద్దును" అన్నారు జడ్జిగారు.

"ఉంటారు బాబూ!" అన్నాడు పంతులు బలం పేర్చడం మాని. "ఉంటారు. ఎంతగానో వుంటారీరోజుల్లో. తవఁరు నన్ను కాస్త దయతో చూస్తే గిట్టనివాళ్ళెందరో వుంటారు. కేవలం ఘోరకలి" అన్నాడు.

"అంతేనండీ! ఈ వెధవ ఎలక్షన్లంటేనే అంత. ఎంత మంచివాణ్ణయినా చెరిపేస్తాయి" అన్నాడు జడ్జిగారు చదరంగాని కుపక్రమిస్తూ.

ఆట మధ్యలో యీ ఎలక్షను కేసు తట్టో, మట్టో తేలేవరకు జడ్జిగారి దగ్గరకు రావడం మానేస్తే ఉభయత్రా మంచిదని తన అభిప్రాయం వెలిబుచ్చేడు పంతులు.

"ఇలాంటి వెధవ ఆకాశరామన్న ఉత్తరాలికి జడిస్తే యింక పన్చేసినట్టే నేను. అసలీ విషయం మీతో అనడం మానేద్దామనుకున్నాను. మీరేమీ భయపడకండి. మామూలుగానే వస్తూండండి" అని జడ్జిగారు ధైర్యం చెప్పేరు.

మరో మూడ్రోజులికి చీకటి పడ్డాక రాజుగారుకూడా పంతులింటికెళ్ళేరు. వారితోకూడా "నేనేం అపరాధం చేశాను నన్ను శిక్షించడానికి? కాకితో కబురంపితే తవఁ పాదాలవద్ద వాల్నా? ఏదేవైఁనా కుచేలుడింటికి కృష్ణుడొచ్చినట్టుంది" అన్నాడు పంతులు. వారితోమాట్లాడుతున్నప్పుడు మాత్రం పెరట్లో కెళ్ళాల్సిన అవసరం లేకపోయింది పంతులుకి పూర్వానుభవం వుండబట్టి. ఈమారు మాత్రం కరెంటు పోయిన అవకాశం చూసుగొని రాజుగారు "యివి చేతులుకావు. కాళ్ళనుకోండి పంతులుగ్గారూ" అంటూ తనచేతులు పట్టుకునే వరకూ, వారికి సహాయం చేయడాని కొప్పుకోలేదు పంతులు. వారు మర్నాటి రాత్రి పంతులుకి పదివేలిచ్చారు. వారు వద్దంటున్నా, పంతులు ఆ మొత్తాని కో ప్రోనోటు రాసిచ్చేడు. వారుకూడా జడ్జిమెంటు చెప్పిన పదిరోజులవరకూ తనవేపు చూడనైనా కూడదని షరతు పెట్టేడు. "వాయిదా వేయించేద్దామని చూస్తున్నాడటగా ఉమాపతి" అంటూ వార్ని సాగనంపేడు.

దసరా దగ్గర కొస్తున్నకొద్దీ ఎలక్షను కేసు జోరుగా సాగుతూ వచ్చింది. ఉమాపతి ఎంత ప్రయత్నం చేసినా కేసు వాయిదాలు పడటం లేదు. సూన్నారాయణ్రాజు కోర్టులో సాక్షుల్ని కరిచేస్తూనే వున్నాడు. కేసు కోలాహలంగా జరుగుతోంది. ఎడల్ట్ స్కూలు విద్యార్థుల ఊరేగింపులా ఉభయపక్షాల అనుచరులు కోర్టుకి వెళ్తూ వచ్చారు.

ఆఖరి కెలాగైతేనేం ఆర్గుమెంట్లు దగ్గరకొచ్చింది కేసు. రాజుగారి జీపునిండా "లా" పుస్తకాలు పట్టుకొచ్చేడు సూన్నారాయణరాజుగారు. తన ట్రాక్టరుకు ట్రెయిలరు కట్టి దాంట్లో పట్టించుకొచ్చేడు నాయుడు తన వకీలు ఉమాపతికి కావలసిన పుస్తకాలు. ఆర్గుమెంటు ప్రారంభించిన రోజుదయాన్నే నాయుడు ఈశ్వరాలయంలో రుద్రాభిషేకం చేయించేడు. ఆ మర్నాడు రాజుగారు తమ ధర్మపత్నితోసహా సత్యన్నారాయణ వ్రతంచేసి, కేసు గెలిస్తే తన ఏకైక పుత్రుణ్ణి తిరుపతితీసుకెళ్ళి అతనిజుట్టు—రాజుగారిది కాదు, కొడుకుది—యిచ్చేస్తానని మొక్కుకున్నాడు.

సూర్యనారాయణ్రాజుగారు రెండురోజులు చెప్పేరు ఆర్గుమెంటు. ఉమాపతిగారు లేస్తూ "మొదట్లో

నేనుకూడా రెండ్రోజులు ఆర్గుమెంటు చెప్పాల్సుంటుందని అనుకున్నాను కాని, నా స్నేహితుడి ఆర్గుమెంటు విన్నాక, రెండుగంటలకన్నా చెప్పడానికి నా కీ కేసులో ఏం కనిపించడంలేదు" అంటూ ఆరంభించి గంటా ఏభై నిమిషాల్లో ముగించేసేరు ఆర్గ్యుమెంటు.

కేసు ముగిసిపోయింది. మర్నాటి నుండి కోర్టుకి దసరా సెలవులు. దసరా దాటి పడింది జడ్జిమెంటు వాయిదా.

9

పట్టుపరికిణీల్తో, బొమ్మల కొలువుల్తో వచ్చింది దసరా. దసరా సెలవల ముందురోజుల్లో ఎలక్షను కేసు జడ్జిమెంటు డిక్టేటుచేసేసి, పెళ్ళాం పిల్లల్తో తన పిల్లలు లేని తమ్ముడింటికి వెళ్ళి శలవు లైపోయేవరకూ వుందామని జడ్జిగారు ప్లానువేశారు. రాజమండ్రిలో పిల్లల్లేని ఆయన తమ్ముడు డాక్టరు.

జడ్జిగారు తాను ప్లాను వేసుగోడంలో తనకు రాబోయే రొంప మరచిపోయేరు. దసరా శలవల్తూ, రొంపా ఒక్కసారే వచ్చేయాయనకి. రొంప మిరియాల కషాయంతో వదలక, రెండోనాటికల్లా చిన్నజ్వరంగా మారి పెన్సిలిన్ ఇంజక్షను కోరుకుంది జడ్జిగారు తుమ్ముతూ, దగ్గుతూ పక్కమీదే గడిపేశారు పదిరోజుల శలవుల్లో మొదటి నాలుగు రోజులు. నాన్నజ్వరం ఎంతట తగ్గుతుందా, ఎప్పుడు రాజమండ్రి వెళ్దామా అని కాసుక్కూర్చున్నవారి పిల్లలకి అయిదోనాడు "యీ దసరాకి రాజమండ్రి ప్రయాణం కేన్సిల్" అన్న జడ్జిగారి మాటలు పిడుగుల్లా వినిపించేయి. క్రితంరోజు వాళ్ళుచూసిన సినీమాలో నాయిక చెవుల్లో విలన్ అన్న మాటలు, అవి అన్న తర్వాత రింగు రింగు మన్నట్టు, జడ్జిగారి మాటలు వాళ్ళ చెవుల్లో రింగు మన సాగేయి. వాళ్ళ నిరుత్సాహంచూసి "ఎలాగైనా వీలుచూసుకోండి. పాపం పిల్లలు సరదాపడుతున్నారు" అని సుగుణమ్మ అంటున్న టైముకి దిగేడు పంతులు "ఏవిటి పిల్లల సరదా అంటున్నారు" అంటూ.

తల్లికీ, తండ్రికీ అవకాశం యివ్వకుండా పిల్లలే చెప్పేశారు పంతులుతో అంతా. "దానికేం భాగ్యం రేపు నేనే రాజమండ్రం వెళ్దామనుకుంటున్నాను, మా మేనత్తకూతుర్ని చూడ్డానికి. ఎవర్తొస్తారోరండి తీసిగెళ్తా" అన్నాడు పంతులు. పెళ్ళీడుకొచ్చిన రాధ మినహా మిగతా పిల్లల్ని పంతులు రాజమండ్రి తీసుగెళ్ళడానికి, సెలవులాఖర్ని పదో తారీఖు పూరీపాసింజరులో తిరిగి తీసుకొచ్చిడానికీ ఏర్పాటయింది.

పంతులు ప్రయాణం అయ్యేలోగా తాను రాజమండ్రి వెళ్తున్నానని,

తొమ్మిదోతారీఖు పూరీ పాసింజర్లో తిరిగి వస్తానని, రాజుగారికి, నాయుడికి విడి విడిగా తెలియచేశాడు. అంతేగాకుండా కారణాలు అడక్కుండా తమ జీపు డ్రైవరుని తొమ్మిదో తారీఖుని రైలుకి స్టేషనుకి పంపమని రాజుగారికీ, ఆ రైల్లో తమవూరికి నాలుగు స్టేషన్లు ముందు కలుసుకొనేటట్టు ఏర్పాటుచేసి తన బావమరిదిని పంపమని నాయుడికి కబురు పెట్టేడు.

పువ్వుల్లో పెట్టి తీసుకెళ్ళేడు పంతులు పిల్లల్ని. తనకి అనుకోకుండా పని తగిలిందని, అనుకొన్న తొమ్మిదో తారీఖు రైల్లో ప్రయాణం కట్టించేడు వాళ్ళని. నాల్గు స్టేషన్లు ముందుకలుసుకున్నాడు అతన్ని నాయుడు బావమరది. మాట్లాడ వద్దన్నట్టు సైగచేసి అతన్ని ఊరుకోపెట్టేశాడు పంతులు.

తమ ఊరికి ముందు స్టేషన్లో పంతులు జడ్జిగారి పిల్లల్తో "ఇంక మనం ఊరువచ్చేసినట్టే. నాకిక్కడో చిన్నపనుంది. ఇదిగో యితను మిమ్మల్ని భద్రంగా దిగబెట్టేస్తాడు. మరేం ఫర్వాలేదు" అంటూ తాను ముందుగా కొన్న పెద్ద చాకలెట్లు డబ్బా వాళ్ళకి యిచ్చేడు. జడ్జిగారింటి సందుచివరదాకా మాత్రంవాళ్ళని దిగబెట్టమని నాయుడు బావమరిదిని ప్లాటుఫారంమీద హెచ్చరించి తాను దిగిపోయేడు ముందు స్టేషన్లో. మర్నాడువెళ్ళి జడ్జిగారితో తనదూరబ్బంధువు తమపక్క ఊళ్లో అకస్మాత్తుగా చచ్చిపోయిందనీ అంచేత ఒకరోజుముందుగానే వచ్చేసి ముందు స్టేషన్లో దిగిపోయేనని చెప్పేడు పంతులు.

10

పెద్దవానలో తెరిచేరు కోర్టు శలవులాఖర్ని. తీర్పుకోసం జనం కోర్టులో కిటకిటలాడుతున్నారు. పైపందెంరేటు బ్రహ్మాండంగా పెరిగిపోయింది. కోర్టుకిరానిది రాజుగారూ, నాయుడే. సినిమాహాల్లో టెలిఫోను దగ్గరకూర్చున్నాడు నాయుడు. సొంతహాల్లోఫోన్ దగ్గిరకూర్చున్నారు రాజుగారు. ఇద్దరి బ్లడ్‌ప్రెషరూ రెండొందలయాభై దగ్గరుంది. ఫ్రేము కట్టించిన వెంకటేశ్వర మహాత్యం పోస్టరువైపే చూస్తున్నాడునాయుడు. తమ వేలికున్న సాయిబాబా ఉంగరం అస్తమానూ కళ్ళకద్దుకుంటున్నారు రాజుగారు. శక్తిపూజ చేసేవాళ్ళలా యిద్దరి నుదుర్లమీదా పెద్దసైజు కుంకుంబొట్లున్నాయి. సస్పెన్సు పిక్చర్లో బేక్‌గ్రౌండు మ్యూజిక్‌లా మోగుతున్నాయి వారి హృదయాల్లో శబ్దాలు.

జడ్జిగారికి యీ వాతావరణం కొత్తగానూ, సంతోషంగానూ వుంది. తానుచేసే ప్రతిపనీ అతి ఆత్రంగా చూస్తున్నారు ప్రజలు. అంచేత లంచికి దిగేముందు చెబుదామనుకున్న జడ్జిమెంటు లంచినుండి వచ్చేక చెప్పేరు. కేసు ఖర్చులతో

కొట్టేశారన్నతీర్పు కోర్టులో పిడుగు పడ్డట్టనిపించింది రాజుగారి అనుచరులికి. కోర్టవతల మైదానంలో నిజంగానే పిడుగుపడి ఓ కుళ్ళుకుక్క చచ్చిపోయింది.

"జడ్జిగారింత దగుల్బాజీ అనుకోలేదు" అన్నారు రాజుగారి ఆసిస్టెంట్లు.

"దేవుఁడిలాంటి మనిషి" అన్నారు నాయుడి పార్టీ.

"మా మినిష్టరుతో చెప్పి జడ్జీని ఈ వేసంగిలో ట్రాన్స్ఫరు చేయించేస్తా"మన్నారు రాజుగారిపార్టీ.

"అదీ మంచిదే! మంచివాణ్ణి ఎప్పుడూ మనమే అట్టేపెట్టేసుకుంటే ఎలా?" అన్నారు నాయుడిపార్టీ.

తీర్పుచెప్పిన తర్వాత వారం రోజులు రాజుగారిల్లు కదలేదు. ఆ వారం రోజులూ నాయుడిల్లు చేరలేదు. ఆ వారంరోజులూ గాలివాన కూడా వదల్లేదు.

తీర్పుచెప్పిన మూడోరాత్రి పదిగంటలకే నిద్రొస్తోంది రాజుగారికి, ముందు రెండురాత్రులూ నిద్ర రాకపోవడంవల్ల. నిద్ర పోదామని సర్దుకుంటూ వుండగా వీధితలుపు చప్పుడైంది. ఈ అర్ధరాత్రి ఎవరొచ్చి వుంటారా అని తలుపు తీసినరాజుగారికి, తడిసిపోయి, నెత్తిమీద తువ్వాలుతో మొహం సహం కప్పుకొని పంతులు కన్పించేడు. రాజుగారు మాట్లాడకుండా హాల్లోకి వచ్చి

కూర్చున్నారు. వారి వెనకాలే వచ్చి పంతులు వారిచేతులు పట్టుకున్నాడు.

ముక్కు ఎగపీల్చేడు.


చేతులు వదిలేశాడు.

వారిచ్చిన పదివేలూ వున్న ప్లాస్టిక్ కవరు తీసి చేతిలో పట్టుకున్నాడు.

"నన్నేం అడక్కండి" అన్నాడు.

గొంతు బొంగురు పోయింది. పడిశంవల్ల కాబోలు.

"నేనేం చెప్పలేకుండా వున్నాను. ఏం చెప్పడానికీ నోట్రాకుండా వుంది" అన్నాడు. రాజుగారేమీ అడగందే మళ్ళీ ప్రారంభించేడు. "మనిషన్నాక సిగ్గుండాలి బాబూ! సిగ్గు. ఆ జడ్జికి లేపోతే నాకుంది. ఈ మూర్రోజులు తవఁకి మొహం చూపించలేకపోయేను. కాని ఎన్నాళ్ళు మొయ్యనీ భారం?" అని చేతిలోని డబ్బుకవరు ఊపేడు ఒక్కొక్కక్షణం ఆగి "ఇంత దగా చేస్తాడనుకోలేదు బాబూ! నేనెక్కడ దగాచేశేనని తవఁరనుకుంటారన్న చింతతో నేను చస్తున్నా. ఏంచేశాడో చెప్తే నమ్మతారా! తవఁరొచ్చిన మొన్నాడే చెప్పేసేను ఆయనతో మనసంగతి. "అలాగే పంతులూ దానికేం?" అన్నాడు. "బాబూ నాకీభారం వద్దు, తవఁపైకం తవఁరు తీసుగోండి" అంటే, "దానికేం



తొందరయ్యా? నీ దగ్గరుంటే ఒహటీ నా వద్దుంటే ఒహటీనా! నీదగ్గరే వుండనీ" అన్నాడు. "శలవులు సహం అయ్యేవరకూ వుండి, "నా వల్ల కాదు పంతులూ! నాయుడికి సాక్ష్యం బాగా వచ్చిందన్నాడు. నాయుడికి సాక్ష్యం ఏమిటి! నా మొహం. నాయుడి దగ్గర్నుంచి బాగా ముట్టిందని చెప్పగూడదూ? యిలా నట్టేట్లో ముంచేశాక రాజమండ్రం పరిగెత్తేను ఆయనగారి తమ్ముడి దగ్గరికి. ఈయనకున్నపాటి సిగ్గూ లేదు ఆ తమ్ముడికి. నాయుడు అదివరకే 20 వేలకి కుదుర్చుకున్నాడని, 10 వేలు ఎడ్వాన్సు యిచ్చేడని, మిగతా పదివేలు తొమ్మిదోతారీఖుకి వస్తాయని అన్నాడు. బాబ్బాబు! నేను 25 వేలిచ్చుగుంటానని

కాళ్ళట్టుగున్నాను. లాభం లేదు. అడ్వాన్సు బుకింగయిపోయిందన్నాడు. నేవుండగానే వచ్చేడా నాయుడు బావమర్ది. ఇద్దరూ లోపలికెళ్ళి గుసగుసలాడేరు. మీదుమిక్కిలి నేను తీసుకెళ్ళినపిల్లల్ని ఆనాయుడు బావమర్ది తీసుకొచ్చేశేడు. మోసపోయేను బాబూ! మోసపోయేను. ఇంకా సిగ్గులేక రోజూ చదరంగం ఆడ్డానికి రమ్మని కబుర్లుపెడుతున్నాడు" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

మరో రెండుకబుర్లుచెప్పి "పైకం లెక్కపెట్టించండి" అంటూ శలవు తీసుకున్నాడు. శలవు పుచ్చుగునే లోగా తాను రాసిచ్చిన ప్రోనోటు తిరిగి పుచ్చుకోవడం మర్చిపోలేదు.

జ్యేష్ఠం వచ్చింది. రెండువేలకి కానీ పెచ్చుకట్నం అడిగితే వీపుచీరేస్తానని తన మేనల్లుడ్నీ, అతని తండ్రినీ బెదిరించి రాజేశ్వరిపెళ్ళి అయిందనిపించేడు పంతులు. కేసుఅయిపోయిన తర్వాత నాయుడిదగ్గర వసూలుచేసిన వెయ్యిన్నూటపదహార్లుతోనూ, పట్టుపంచల చాపుతోనూ, పెళ్ళిఖర్చులూ, లాంఛనాలూ సరిపెట్టేశేడు. నాయుడిచ్చినదాన్లో మిగిలిన మూడువేలూ "ఏమో! చిన్నపిల్లలకైముకి దేశం బాగుపడదేమో" అనుకుంటూ ఫిక్సెడ్ డిపాజిట్టులో వేశేడు. పెళ్ళికి సగం సరుకు నాయుడు సప్లైచేశేడు.

జడ్జిగారు వచ్చి వధూవరుల నాశీర్వదించేరు. కథలో కొంతమందికి పంతులు చేసిన యీ క్రిందిపన్లు అర్థంకాలేదు.

రాజుగారికి : తన జీపు డ్రైవరుని తాను రాని రైలుకి పంతులు ఎందుకు పంప మన్నాడో?

నాయుడికి : కేసైపోయిన ఆర్నెల్లు వరకు రాజేశ్వర్రావుని రెవిన్యూ ఇనస్పెక్టరు చెయ్యడానికి పంతులెందుకొప్పుగోలేదో?

జడ్జిగారికి : తనకి ఆకాశరామన్న ఉత్తరం ఎవర్రాసేరో?

రాజేశ్వరికి : తనకి కొడుకుపుడితే, ఆ కొడుక్కి సౌజన్యరావని పేరు పెడతానని తనతండ్రి ఎందుకు మొక్కుకున్నాడో?

నాయుడు బావమరిదికి: ఒక్కమాటా మాట్లాడనిపుణ్యానికి తననినాలుగు స్టేషన్ల ముందు పంతులు ఎందుకు కలుసుకోమన్నాడో?

జ్యేష్ఠం వెళ్ళింది. రాజేశ్వరి అత్తారింటికి వెళ్ళిపోయింది. పాపం రాధ పెళ్ళి మాత్రం వాయిదా పడిపోయింది.

□□□

శిఖరాలా సరిహద్దులా

(గతసంచిక తరువాయి)

20

రాజీకి ఆరోగ్యం బాగా లేదని డాక్టర్ ఆమెను బలవంతంగా యింటికి పంపివేశాడు. రెండుమూడు రోజులవరకూ రావద్దనీ, పూర్తిగా విశ్రాంతి తీసుకోమనీ చెప్పాడు. డాక్టర్ సలహాప్రకారం ఆమె మూడు రోజులు ఇంట్లోనే వుండిపోయింది. పగలూ రాత్రీ పడకమీదనే ఉండి ఏవో ఆలోచనలతో గడుపుతోంది. కేవలం మానసికమైన అశాంతి తప్ప ఆమెకు వేరే జబ్బు ఏమీలేదు. అంతకంతకు మనస్సులో కల్లోలం పెరుగుతోంది, భయాలు భూతాల్లా చుట్టుముట్టుతున్నాయి. పశ్చాత్తాపం మనస్సును కాలుస్తున్నది.

లెఫ్టినెంట్ మాత్రం ఏ కాస్త వీలు దొరికినా మందుసీసా పుచ్చుకుని రాజీ గుడిసెకు వస్తున్నాడు. ఎంతో ప్రేమతో ఆమెకు పరిచర్య చేస్తున్నాడు. అతనిచేత పరిచర్య చేయించుకోవటం ఆమెకు యిష్టం లేదు. వాళ్ళకి ద్రోహంచేస్తూ, వాళ్ళ చేతనే సేవచేయించుకోవటం మహా పాపం. కానీ తను ఎంత వారించినా అతను వినటంలేదు. "నువ్వు రోజూ మా సైనికులు ఎంతోమందికి సేవ చేస్తున్నావు. వారి సేవతోనే నువ్వు యీ స్థితికి వచ్చావు. ఈరోజు యీ ఒక్క సైనికుడి సేవను స్వీకరించలేవా రాజీ" అని బ్రతిమాలుతున్నాడు.

"అదికాదు లెఫ్టినెంట్. నాకు అసలు ఏ జబ్బూలేదు. జబ్బులేకుండా మందు తీసుకోవటం దేనికి చెప్పు" అన్నది రాజీ.

"జబ్బు ఏమీ లేకుండా యిలా ఎందుకుంటావ్ రాజీ. జబ్బు లేదని నువ్వు అనుకున్నా, చూస్తూ చూస్తూ మేము ఊరుకోగలమా? నీపట్ల నీకు శ్రద్ధలేకపోయినా నాకైనా ఉండాలి. రోజు రోజుకీ నీవు యిలా అయిపోతుంటే నేను చూడలేను."

"అయినా లెఫ్టినెంట్! నువ్వు ఒక

సీరియల్

ఆఫీసర్‌వి. హూదాకలవాడివి. నేను ఏమీ లేనిదాన్ని. కనీసం హృదయమైనా లేనిదాన్ని. నువ్వు ఇలా నా కాళ్ళదగ్గర కూర్చుని సేవచేయటం ఏం బావుంటుంది చెప్పు?"

"రాజీ! నేను ఒక ఆఫీసర్ ననుకుని ఇక్కడికి రాలేదు. ప్రియుడిగా నీ పాదాలదగ్గర కూర్చుని సేవ చేయటం తప్పని అనుకోను. అయినా నేను వ్యక్తిగతమైన ఈ ప్రేమకోసం నా ఉద్యోగధర్మాన్ని మరిచిపోలేదు. క్రమశిక్షణకు భిన్నంగా ప్రవర్తించలేదు. ప్రేమకంటే ఉద్యోగధర్మాన్నే నేను ఎక్కువగా గౌరవిస్తున్నాను ఇప్పటికీ. మా సైన్యానికి నువ్వు ఎంతో సేవ చేస్తున్నావు. ఈస్థితిలో నీకు సేవచేయటం సైనిక ధర్మంకూడా అవుతుంది."

"శివరామ్! నీ ఉద్యోగధర్మానికీ, ప్రేమకూ పొత్తుకుదరదు. ఉద్యోగధర్మాన్నే నువ్వు ఎక్కువగా గౌరవిస్తావని నాకు తెలుసు. నేను కోరేదీ అదే. అందుకే ఈ ప్రేమబంధాన్ని తెంచుకోడానికి ప్రయత్నించు. నువ్వు ఈ ప్రేమకు కట్టుబడకు శివరామ్. ఉద్యోగధర్మంకోసం నువ్వే నీ చేతులతో నన్ను చంపవలసిన అవసరం రావచ్చు. అందుకే ఈ మమకారాన్ని ఇంకా పెంచుకోవద్దని చెబుతున్నాను. వెళ్ళు శివరామ్."

"రాజీ! నువ్వు ఏమి చెబుతున్నావో నాకేమీ అర్థం కావటం లేదు. నీ మనస్సులో ఏవో భయాలు, సందేహాలు ఉన్నాయి. నా దగ్గర సంకోచం దేనికి? చెప్పవూ."

"ఏమీలేదు శివరామ్ నేనేమీ చెప్పలేను. వద్దు. నా మనస్సేమీ బాగాలేదు. రాత్రి ఏవో పీడకలలు వచ్చాయి. అందుకే ఇలా పిచ్చిగా మాట్లాడాను. నామాటలకు అర్థాలు వెతకటానికి ప్రయత్నించకు. నీకూ మనస్సు పాడవుతుంది. నాకు కాస్త నీరసంగా వుంది. అంతే. తగ్గిపోగానే స్థావరానికి వస్తాను. మందు లేమీ అక్కరలేదు."

శివరామ్ ఆమె కళ్ళల్లోకి చూస్తూ మౌనంగా వుండిపోయాడు. లేనిపోనివన్నీ ఊహించుకుని, ఏవేవో భయాలతో ఆమె మనస్సు పాడు చేసుకుందనీ, నెమ్మదిమీద సర్దుకుంటుందనీ, ఆమెకు జబ్బేమీ లేదనీ అనుకున్నాడు. "రాజీ నువ్వు అనవసరంగా దేన్నిగురించీ ఆలోచించకు. హాయిగా కళ్ళుమూసుకుని పడుకో. శరీరానికి ఎంత అవసరమో మనస్సుకు కూడా అంత విశ్రాంతి అవసరం. భయాలు పెంచుకోకు" అని చెప్పి లేచి వెళ్ళిపోయాడు.

రాజీకి మాత్రం అంతకంతకు భయం పెరుగుతూనే వుంది. ఏదో అపద తనవైపు వరదలాగా ముంచుకు వస్తున్నట్లు అనిపిస్తోంది. ప్రేమనుంచి, ధర్మంనుంచి తనను ఎవరో బలాత్కారంగా లాక్కుపోతున్నట్లు. పట్టపగలే కళ్ళుతెరుచుకునే కలలుగనేది. భయంతో కెవ్వున కేక పెట్టేది. తనను రక్షించమని చేతులుచాపి దీనంగా "శివరామ్" అని అరచేది. ఏడిచేది. కల కరిగిపోగానే గుడిసెలో తన ఒంటరితనం, తన నిస్సహాయస్థితి తెలిసివచ్చేవి. ఉస్సురని నిట్టూర్చేది. తన గుడిసె గూడానికి ఒక చివరగా మిగతా యిళ్ళకి కాస్త దూరంగా ఉంటుంది. ఆ దూరాన్ని యిప్పుడు భరించలేకపోతున్నది. తన గుడిసె చుట్టూ తనకు కాపలాగా వంద గుడిసెలు ఉంటే బావుండు ననిపించింది. తనను ఎవ్వరూ ఎత్తుకుపోకుండా ఎప్పుడూ తన చుట్టూ వందమంది ఆప్తులు ఉంటే బావుండు ననిపించింది. ఈ గుడిసె విడిచి సీమా వాళ్ళింటికి వెళ్ళిపోదామనిపించింది. కానీ వెళ్ళలేకపోయింది. తనకోసం మళ్ళీ శివరామ్ వస్తాడేమో అని వూరుకునేది. మళ్ళీ మళ్ళీ అతన్ని చూడాలనిపించేది. అతని కౌగిట్లో వుంటే భయాలన్నిటికీ దూరంగా ఎంత ధైర్యంగా ఉంటుంది తను!

శివరామ్‌గురించి ఆలోచిస్తుంటే దిగులుగా ఉంటుంది. ముందు స్థావరాల్లో యుద్ధంపరిస్థితి ఎల్లావుందో, శివరామ్‌ను ముందు స్థావరానికి పంపించేస్తారేమో అని భయంగా ఉండేది. ఒక్కొక్కప్పుడు తనే శివరామ్‌వద్దకు పరుగెత్తుకుపోవాలనిపించేది. కానీ తన కాళ్ళకు, చేతులకూ సంకెళ్ళు ఉన్నట్లు అనిపించేది. భయంలో— ఎవరో బంధించినట్లు కదల్లేక బిగుసుకుపోయేది. శివరామ్ పరామర్శించడానికి వచ్చినప్పుడల్లా యుద్ధం విశేషాలు చెబుతూనే ఉన్నాడు. గడిచిన రెండు మూడు రోజుల్లో పరిస్థితి తీవ్రంగాలేదు. విజయం భారతపక్షానే ఉంది. కల్నల్ మహేశ్ వ్యూహాలు జయప్రద మవుతున్నాయి. చైనా సేనలకు విశేషంగా నష్టం కలిగింది. భారత సైనికులు చాలా కొద్దిమందే మరణించారు. తాను స్థావరం రహస్యాలను చైనా వారికి చేరవేయకపోవటంవల్లనే పరిస్థితి మెరుగైందని తెలుసుకుంది రాజీ. అది ఆమెకు కొంత సంతృప్తి నిచ్చింది. ఇక చైనా సోదరులతో యెలాంటి సంబంధం పెట్టుకోకుండా తటస్థంగా ఉండిపోదామనుకుంది. ఇంతవరకు చేసిన పాపానికి నిష్కృతిగా క్షతగాత్రులైన భారత సైనికులకు రాత్రింబవళ్లు సేవచేస్తూ, వారి సేవలోనే ప్రాణాలు విడవాలనుకుంది. ఈ నిర్ణయానికి వచ్చిన తర్వాత కాస్త మనసుకు శాంతి చేకూరింది. రాజీకి వంట్లో బావుండటం లేదని తెలిసి సీమా అప్పుడప్పుడూ వచ్చి పరామర్శించి

నండూరి పార్థసారథి

వెళ్తోంది. ఆమెకోసం భోజనం కూడా తెచ్చి పెడుతోంది.

రాజీ అస్వస్థతగా ఉండిన మూడు రోజులలోనూ చైనా సేనలకు విశేష నష్టం వాటిల్లింది. అయినప్పటికి సంఖ్యాధిక్యతవల్ల వాళ్ళు మొరటుగా ముందుకు చొచ్చుకువచ్చారు. భారత సేనలు మరొక స్థావరాన్ని కోల్పోయి, వెనుకకు ఉపసంహరించుకున్నాయి. ఇక్కడి కీలక స్థావరానికి ముందు ఇంకొక్క స్థావరం – మూడవది–మాత్రం మిగిలి వుంది. ఈమూడు రోజులలో భారత సేనకు జననష్టం అట్టే జరగనందుకు సంతోషంగానే ఉన్నా, మరొక స్థావరంకూడా పడిపోయినందుకు చింతిస్తున్నాడు కల్నల్ మహేశ్. శత్రువులు ఇంకా దగ్గరకు వచ్చేశారు. అంటే ప్రమాదం అధికమయిందన్నమాట. ఇంకా పెద్దపెట్టున సన్నాహాలు చేసుకోవలసిన అవసరం ఉంది. ఈ కీలక స్థావరం శత్రువుల వశమైతే వాళ్ళు కళ్ళు మూసుకుని సునాయాసంగా కొన్ని పదుల మైళ్ళు భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చేయగలరు. కానీ తన బొందిలో ప్రాణం ఉండగా అలా జరగదు. ఈస్థావరం శత్రువులకు చిక్కడానికి వీల్లేదు.

కల్నల్ సన్నాహాలు ప్రారంభించాడు. శత్రువులు రెండవ స్థావరం వద్ద పొంచి ఉన్నారు. ఈ సారి దాడిలో వారు మూడవ స్థావరం మీదికి విరుచుకుపడతారు. అందుకని మూడవ స్థావరాన్ని పటిష్ఠం చేయటం ప్రస్తుత కర్తవ్యం. ఇక్కడ నుంచి ముందుస్థావరానికి సైనికులను, మందుగుండు సామగ్రిని, ఇతర అవసర పదార్థాలనూ విరివిగా పంపించాలి. అప్పుడు ఇక్కడి స్థావరం బలహీనపడుతుంది. అయినా అంతకంటె గత్యంతరంలేదు. ముందు స్థావరంకూడా పడిపోయి, శత్రువులు ఈ స్థావరంమీద పడేలోగా కేంద్ర కార్యాలయం నుంచి కొత్తసైన్యాలు, ఆయుధాలు రావాలి. అవి వచ్చేవరకూ ఎలాగైనా ముందు స్థావరాన్ని నిలపాలి. కల్నల్ వెంటనే కేంద్ర కార్యాలయానికి వైర్లెస్ మెసేజ్ పంపాడు. ఇక్కడి పరిస్థితి తీవ్రంగా వుందనీ, తక్షణం వేల సంఖ్యలో సైన్యాన్ని పంపించవలసిందనీ, మందుగుండు, ఆయుధాలు, ఇతర సామగ్రి పెద్దపెట్టున సరఫరా చేయాలనీ సందేశం పంపాడు.

మూడురోజులు విశేషంగా నష్టం వాటిల్లింది కనుక చైనా వారు ఈరోజు ఇంకా కసిగా వేలకొలది సైనికులను మిడతలదండు మాదిరిగా పంపిస్తారనీ, ఈరోజు యుద్ధం ఇంకా భయంకరంగా ఉంటుందనీ ఊహించాడు కల్నల్. ఇంతకుముందు మాదిరిగా తను వేసిన పథకాలు భగ్నం కావటం లేదుకానీ, చైనావారి మూక బలం ముందు వ్యూహాలు వ్యర్థమైపోతున్నాయి. సైనికులు ఎంతమంది చచ్చినా చైనా లక్ష్యపెట్టదు. ముందుకు చొచ్చుకురావటమే దాని లక్ష్యం. చైనాసేన సంఖ్యాధిక్యత చూస్తే యుద్ధరంగంలో చైనీయులు నేలఈనిపుట్టుకొస్తున్నారా అనిపిస్తుంది. అందుకే ముందు స్థావరం నిలుస్తుందన్న నమ్మకంలేదుకల్నల్‌కు. అది పడిపోయేలోగా కొత్తసైన్యాలు చేరకపోతే, ఈ స్థావరం బలహీనంగా ఉందని శత్రువులు పసికట్టేస్తే సర్వనాశనం సంభవించినట్లే. కొత్త సైన్యాల రాకడమీదనే తమ అందరి భవిష్యత్తు ఆధారపడి ఉంది.

ముందు స్థావరంవద్ద సైన్యానికి ప్రస్తుతం లెఫ్టినెంట్ కల్నల్ సుబీర్ సేన్ నాయకత్వం వహిస్తున్నాడు. అతను చాలా సమర్థుడని కల్నల్‌కు తెలుసు. కల్నల్ ఆజ్ఞలను అక్షరాలా పాటించేవ్యక్తి అతను. తమ స్థావరం పరిస్థితి చాలా ప్రమాదకరంగాఉందనీ, ఏ క్షణంలోనైనా శత్రువులు మీద పడే అవకాశం ఉందనీ, కనుక వెంటనే సమర్థులైన ఆఫీసర్లనూ, సైనికులనూ కొందరిని పంపించవలసిందనీ అతను వర్తమానం పంపాడు. ఇక్కడి నుంచి మేజర్‌రాయ్‌నీ, కెప్టెన్ ప్రసాద్‌నీ, లెఫ్టినెంట్ శివరామ్‌నీ,నాయక్ సింగ్‌నీ పంపించాలని నిశ్చయించుకున్నాడు కల్నల్. వెంటనే మేజర్‌ని పిలిపించాడు. కొంతసైన్యాన్నీ, ఆయుధాలనూతీసుకుని ముందు స్థావరానికి వెళ్ళమని ఉత్తర్వు చేశాడు. కెప్టెన్, లెఫ్టినెంట్ మధ్యాహ్నం మరి కొంత సైన్యంతో బయలుదేరి సాయంత్రంలోగా అక్కడికి చేరుతారని చెప్పి పంపించాడు. నాయక్‌సింగ్ కూడా మేజర్ రాయ్ వెంట ముందు స్థావరానికి బయలుదేరి వెళ్ళాడు. తర్వాత కల్నల్ మహేశ్ కెప్టెన్‌నీ, లెఫ్టినెంట్‌నీ పిలిచి, వెంటనే గూడానికి వెళ్ళి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లుచేయమని చెప్పి పంపాడు. ప్రజలనూ, వారి సామానులనూ తరలించటానికి కొన్ని వ్యానులు గూడానికి బయలుదేరి వెళ్ళాయి.

21

కెప్టెన్, లెఫ్టినెంట్ గూడానికి వెళ్ళారు. అక్కడి పెద్దలందరినీ సమావేశపరచి పరిస్థితి అంతా వివరంగా చెప్పారు.

"ముందువున్న మూడు స్థావరాలలో రెండు స్థావరాలను శత్రువులు చేజిక్కించుకున్నారు. వారు ఇప్పుడు ఇక్కడికి తొమ్మిదిమైళ్ళ దూరంలో ఉన్నారు. ఏ క్షణంలోనైనా మూడో స్థావరంపై దాడిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. మిడతలదండుల్లాగా వచ్చి మీదపడుతున్నారు. మన సైనికులు ఎంత శౌర్యంతో పోరాడుతున్నా ప్రయోజనం లేకపోతోంది. మనపరిస్థితి

చాలా ఆందోళనకరంగా ఉంది. ఈ స్థితిలో మీరు యిక్కడ వుండటం ఏంతమాత్రం క్షేమంకాదు. వెంటనే సురక్షితప్రాంతాలకు తరలిపోవటం మంచిది. ఇక్కడినుంచిఇరవై ముప్పై మైళ్ళు దిగువకు వెళ్ళి అక్కడ ఏదైనా గ్రామంలో తలదాచుకోండి. మీరు ఈ ప్రదేశాన్ని శాశ్వతంగా విడిచి పెట్టనక్కరలేదు. ఇక్కడి పరిస్థితి ఎప్పటికైనా బాగుపడితే మీరు మళ్ళీ తిరిగి రావచ్చు. మేము ఈ స్థావరం వద్ద ప్రాణాలతో ఉన్నంతవరకూ ఇక్కడి మీ నివాసాలకు ఎటువంటి ప్రమాదమూరాదు. మీ ప్రాణాలను రక్షించటం మా మొదటి కర్తవ్యం. అందుకే మిమ్మల్ని ఇక్కడి నుండి తరలించడానికి వచ్చాము. మిమ్మల్నీ, మీ సామానులనూ తీసుకువెళ్ళడానికి మా వ్యానులు సిద్ధంగా ఉన్నాయి. మీరు త్వరపడాలి. ఇంకొక రెండు మూడు గంటల లోగా మీరు అన్నీ సర్దుకుని బయలుదేరాలి' అని హెచ్చరించాడు కెప్టెన్ ప్రసాద్.

గూడెం నాయకుడు ముందుకు వచ్చి దీనంగా విన్నవించుకున్నాడు:

'బాబూ! ఎన్నోతరాలుగా మేము ఈ భూమిని అంటిపెట్టుకుని ఉన్నాము. ఈ భూమిని నమ్ముకుని బతుకుతున్నాము. ఈనాడు ఆపద వచ్చిందికదా అని ఇన్నాళ్ళూ మాకు ఆశ్రయమిచ్చిన భూమిని వదిలి పొమ్మంటూరా బాబూ. మా పూర్వులు అంతా ఈ భూమిమీదపుట్టి ఈ భూమి లోనే కలిసిపోయారు. మా జీవితాలుకూడా అలాగే వెళ్ళిపోనివ్వండి. ఈ చోటును రక్షించటంకోసం పుట్టిన చోటు వదిలి ఇంతదూరం మీరు వచ్చారు. ఈ చోటును రక్షించడానికి మీరు ప్రాణాలు ఒడ్డుతున్నారు. మా చోటును మేము రక్షించుకోలేక వేరే చోటుకు పారిపోవటం మాకు సిగ్గుచేటుకాదా బాబూ. మాకోసం మీరు ప్రాణాలిస్తూంటే, మాకోసం మేము ప్రాణాలకు లెక్కచేస్తామా? మాకు అంత ప్రాణభీతిలేదు. మమ్మల్ని ఇక్కడే వుండనివ్వండి. మీతోకలిసి మేమూ శత్రువును ఎదుర్కొంటాము."

గూడెం ప్రజలకు నచ్చచెప్పి ఒప్పించడానికి కెప్టెన్ చాలా శ్రమపడవలసి వచ్చింది. 'ఇటువంటి యుద్ధాలలో ప్రజలు కల్పించుకోవలసిన అవసరం లేదు. అది అనర్థంకూడా అవుతుంది. ఆయుధం పట్టటం చేతకానివారంతా యుద్ధంలో జొరబడి మరణిస్తే అది మూర్ఖత్వమే అవుతుందిగానీ దేశభక్తికాదు. యుద్ధరంగంలో నిష్ప్రయోజనకరంగా మరణించటం ఆత్మహత్య అవుతుందికానీ దేశసేవకాదు. పుట్టిన భూమిమీద ప్రేమను వెల్లడించుకోడానికి అదికాదు పద్ధతి. ఆయుధం పట్టటం చేతకానివారు దేశంలో కోట్లమంది వున్నారు. వారంతా యుద్ధానికి వచ్చి మరణిస్తే



దేశమే ఉండదు. దేశమంటే కేవలం భూభాగం కాదు— ఆ భూభాగంలోని ప్రజానీకమే. దేశసేవ చేయడానికీ, మాతృభూమి ఋణం తీర్చుకోడానికి ఇంకా అనేక మార్గాలున్నాయి. దేశరక్షణకు శిక్షణ పొందిన సైన్యం అంటూ ఒకటివుంది. కాబట్టి మీరు ఇక్కడ నుంచి తరలిపోవటం దేశద్రోహం కాదు—అని చెప్పాడు కెప్టెన్.

గ్రామ పెద్దలందరూ ఇక వాదించకుండా మౌనంగా వెళ్ళిపోయారు. ప్రజల ముఖాలలో విచారం గూడు కట్టుకుని ఉంది. దుఃఖాన్ని లోలోపలే అణుచుకుని అందరూ సామానులు సర్దుకోవటంలో నిమగ్నులయ్యారు. ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకుకూడా వాళ్ళకి నోళ్ళుపెగలటంలేదు. దుఃఖంతోగొంతులుపూడుకుపోయాయి. మాట్లాడితే ఇక ఏడుపే బయటపడుతుంది. సర్దేసిన సామానులను లారీలలోకి ఎక్కిస్తున్నారు. ప్రసాద్ సీమాను చూడటానికి,

లెఫ్టినెంట్ రాజీని చూడటానికి వెళ్ళారు.

శివరామ్ వెళ్ళేసరికి రాజీ గుమ్మంలోనే నుంచునివుంది. గూడాన్ని ఖాళీ చేస్తున్నారని ఆమెకూ తెలిసింది. ప్రజలంతా విచారంతో గుడిసెలు ఖాళీచేసి, సామాన్లు లారీల్లోకి చేరవేస్తున్న దృశ్యాన్ని చూస్తూ నుంచుంది. లెఫ్టినెంట్ వెళ్ళి "ఇంకా నీ సామాను సర్దటం కాలేదా రాజీ. ఇలాగే నిలబడ్డావేం? త్వరపడాలి. ఇంకాసేపటిలో లారీలన్నీ బయలుదేరి వెళ్ళిపోతాయి" అని హెచ్చరించాడు.

"నేను వెళ్ళటం దేనికి శివరామ్? మీ సేనలు ఇక్కడ ఉన్నంతకాలం మీకు సేవ చేస్తానని మొగతే కల్నల్‌తో చెప్పాను. ఆయన అంగీకరించారుకూడా. మిమ్మల్ని విడిచి నేను ఎక్కడికి వెళ్ళలేను. మామూలుగా యీ గుడిసెలోనే ఉంటూ, రోజూ స్థావరానికి వస్తూవుంటాను."

"అదికాదు రాజీ. నిర్జనమైన యీ గూడెంలో బిక్కు బిక్కుమంటూ ఒంటరిగా ఎలా వుంటావు? ఇక్కడ నీకు పలకరించే దిక్కు కూడా ఉండదు. ఇంకా ఒకటి రెండురోజుల్లో ఇక్కడ పరిస్థితి మరీ తీవ్రమౌతుంది. ఇది యుద్ధరంగమవుతుంది. నువ్వు ఇక్కడ వుండటం చాలా ప్రమాదం."

రాజీ చిన్నగా నవ్వింది. "ప్రమాదం మన ఇద్దరికీ సమానమేగా శివరామ్. ప్రమాదమైనా, ప్రమోదమైనా ఇద్దరం సమానంగానే పంచుకుందాం. అయినా యిక్కడ గాయపడ్డ సైనికులకు సేవచేయడానికి ఎందరు డాక్టర్లూ, నర్సులూ ఉన్నా చాలరు. నేను ప్రాణాలు కోల్పోనంతవరకూ మరికొన్ని ప్రాణాలను కాపాడగలనేమో. నా అవసరం మీకు ఉంటుందని తెలిసికూడా ఇక్కడినుంచి ఎలా వెళ్ళగలను శివరామ్."

ఇక ఆమె నిర్ణయం మారదని ఊరుకున్నాడు శివరామ్. ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు. తర్వాత ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని "క్షేమంగా తిరిగివస్తే రేపే నిన్ను కలుసుకుంటాను రాజీ. రాలేకపోతే ఇదే కడపటి వీడుకోలు. మళ్ళీ జన్మయెత్తి నీకోసం ఎదురుచూస్తూవుంటాను" అన్నాడు. రాజీ అదిరిపడింది. అతనిచేతిలో ఆమె చేయి కంపించిపోయింది.

"ఏమిటి శివరామ్ నువ్వంటున్నది. వీడుకోలేమిటి?"

"ఈరోజే నేను ముందు స్థావరానికి వెళ్తున్నాను రాజీ. ఇప్పటి యుద్ధరంగం అదే. ఈ పాటికి అంతా బయలుదేరుతూ ఉంటారు. నాకోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఇక వెళ్తాను", శివరామ్ గొంతులో విషాదం కలిసిన జీర ధ్వనించింది.

రాజీ కన్నులనుంచి జలజలా నీళ్ళు రాలాయి. అతని అరచేతిని గట్టిగా హృదయానికి హత్తుకుంది. రుద్ధమైన కంఠంతో "అలా అనకు శివరామ్. 'వెళ్ళివస్తాను' అను. వస్తావనే ఆశతో ఎదురుచూస్తూఉంటాను" అంది. లెఫ్టినెంటు మెల్లగా చేతిని విడిపించుకుని స్థావరం దిశగా నడిచి వెళ్ళిపోయాడు. రాజీ గుమ్మంలోనే నుంచుని అతను వెళ్ళినవైపు చూస్తోంది. అతను వెనక్కి తిరక్కుండా సూటిగా ముందుకు పోతున్నాడు.

కెప్టెన్ వెళ్ళేసరికి సీమా ఇంట్లో అందరూ సామాన్లు సర్దేసి హడావిడిగా ఉన్నారు. ఒక మూలగదిలో సీమా ఒకతే తన దేవతదగ్గర తపస్సు చేస్తున్నట్లుగా కూర్చుంది, ఒక చిన్న ప్రమిద వెలుగుతోంది. గదిలో వస్తువులేమీ లేవు. అంతా ఖాళీగాఉంది. నిశ్శబ్దంగా, కొంచెం చీకటిగాఉంది. ఆమె అక్కడ ఉంటుందని అతనికి తెలుసు. తిన్నగా ఆ గదిలోకి వెళ్ళాడు. అతని రాకనుచూచి ఆమె లేచినుంచుని తలవంచుకుంది. అతను దగ్గరకు వెళ్ళాడు. ఆరోజు అతను యుద్ధంలోకి వెళ్తున్నసంగతి ఆమెకుతెలుసు. కానీ ఆమె ముఖంలో భయంగానీ, ఆందోళన గానీ కనిపించ లేదు. ప్రశాంతంగా, గంభీరంగా, అప్పుడే తపస్సు చాలించిన యోగినిలా ఉంది. దేవత పాదాలచెంత ఉన్న ప్రమిదలాగా ఆమెముఖం పవిత్రంగా వెలుగుతోంది.

ప్రసాద్ ఆమె శిరస్సుపై చేయి వేసి, ఆమె ముఖాన్ని తనవైపు తిప్పుకున్నాడు. ఆమె కన్నులుఎత్తి అతని కన్నుల్లోకి చూస్తుంది. ఆమె చూపులు అతని కన్నుల్లోంచి పయనించి సూటిగా హృదయాన్ని స్పృశించాయి. అతని హృదయం ఎన్నెన్నో భావాలను వ్యక్తం చేయాలనీ, ఏమేమో మాట్లాడాలనీ వేదనపడుతుంది. కాని ఆమె భాష తనకు రాదు. అయినా ఆ భావాలను ఏ భాషా వ్యక్తం చేయలేదని అనిపించింది. ఆ భావాలను ఇముడ్చుకోగల వైశాల్యం ఏ భాషకూ లేదు. భాషరానిభావానికిమల్లే అతని హృదయం మథనపడింది. కాని అతని కన్నులే అతని భావాలను వ్యక్తం చేశాయి. బాధను భాషలో చెప్పలేని అతని నిస్సహాయతను ఆమె గ్రహించింది. "నువ్వేమీ చెప్పనక్కరలేదు. నీ హృదయమంతా నాకు తెలుసు. నేనున్నదే నీ హృద

● కమల: "నీకు అద్భుతమైన, అందమైన, ధగధగ మెరిసే అమ్మాయి కనబడితే ఏం చేస్తావు?"

విమల: "కొంతసేపు చూస్తాను. ఇంకా కొంతసేపు చూస్తాను. ఇహ విసుగుపుట్టి అద్దం కిందపెట్టేస్తాను."

యంలో' అని చెప్పాయి ఆమె కన్నులు. 'అవును. విశ్వజనీనమైన హృదయభాష ఉండగా మన ప్రేమకు వేరే భాషతో నిమిత్తమేముంది' అనుకున్నాడు. సీమా దేవత పాదాల చెంత ఉన్న దారంతీసి అతని ముంజేతికి కట్టింది. మళ్ళీ ఏలోకంలో కలుస్తామో అన్నట్లు ఆమె రెప్పవాల్చకుండా అతని ముఖంలోకి చూస్తున్నది. అతను ఆమె శిరస్సును దగ్గరకు తీసుకుని తన గుండెకు చేర్చుకున్నాడు.

• • •

గూడెంలో ప్రజలందరూ ఎన్నో తరాలుగా నివసిస్తున్న గృహాలను వదిలి, సామానులు చేతబుచ్చుకుని కాందిశీకులై బయలుదేరారు. అందరి ముఖాలూ విషాదాశ్రువులతో మలినమై ఉన్నాయి. అందరూ లారీలు ఎక్కారు. లారీలు ఒక్కొక్కటీ వరసగా బయలుదేరుతున్నాయి. తాము పుట్టి పెరిగిన మట్టి, తమను గుండెలో పెట్టుకుని కాపాడిన గుడిసెలు దూరమవుతుంటే ప్రజలు దీనంగా కన్నీరు కారుస్తున్నారు. 'కడసారిగా తమ గుమ్మాలకేసి చూసి తల తిప్పుకుంటున్నారు. కదలలేని, మాట్లాడలేని గుడిసెలు బిక్కు బిక్కు మంటూ ఉండిపోయాయి. చివరిలారీలో చిట్టచివర నుంచున్న సీమా కెప్టెన్ వంక చూస్తూ ఉండిపోయింది. కెప్టెన్ అలాగే చూస్తూ నిలిచిపోయాడు. క్రమంగా వారి చూపులను దూరంచేస్తూ లారీ కదిలిపోయింది. ఆ చూపులు ఏకమై కొంతసేపటికి గాలిలో కరిగి కలిసిపోయాయి. కెప్టెన్ కు కన్నులఎదుట శూన్యం మిగిలింది.

మనుషులులేని గూడెం శ్మశానంలా మారిపోయింది. కెప్టెన్ చుట్టూచూశాడు. కనుచూపుమేరలో ఎక్కడా మనిషి కనిపించలేదు. ఎక్కడా పిట్టకూడా అరవటంలేదు. సీమా ఇంటి కిటికీకేసి చూశాడు. 'ఒకప్పుడు అక్కడ సీమా కళ్ళు మెరుస్తూ వుండేవి' అనుకున్నాడు. అప్రయత్నంగా అక్కడికి నడిచి వెళ్ళాడు. ఒక్కసారి ఆ కిటికీ తలుపులను ప్రేమగా స్పృశించాడు. వెనక్కి తిరిగి చకచకా స్థావరానికి నడక సాగించాడు.

22

స్థావరానికి రాగానే లెఫ్టినెంట్ ముందు స్థావరానికి బయలుదేరేందుకు చేసుకోవలసిన ఏర్పాట్లలో మునిగిపోయాడు. సైన్యం చాలా భాగం వెళ్ళిపోవటంవల్ల స్థావరం ఖాళీగా, నిశ్శబ్దంగా ఉంది. కెప్టెన్ ప్రసాద్ కల్నల్ తో మాట్లాడుదామని వెళ్ళి గదిబయటే ఆగిపోయాడు. గదితలుపులు వేసివున్నాయి. లోపల నుంచి కల్నల్ గొంతూ, మరొక ఆఫీసరుగొంతూ వినిపిస్తున్నాయి. వాళ్ళు తనను గురించే ఏదో రహస్యంగా మాట్లాడుకుంటున్నారనీ తెలిసి అక్కడే ఆగిపోయాడు కెప్టెన్. వరండాలో ఎవ్వరూ లేరు. నిశ్శబ్దంగా వుంది. లోపలినుంచి ప్రతిమాటా స్పష్టంగా వినిపిస్తోంది. కల్నల్ మాట్లాడుతున్నాడు:

'ఇంత ఆపదసమయంలో, ఇటువంటి క్లిష్టపరిస్థితిలో ఈ టెలిగ్రామ్ రావడం మనదురదృష్టం. మనకు అన్నీ దెబ్బమీద దెబ్బ తగులుతున్నాయి. ఇప్పుడు దీన్ని కెప్టెన్ కు ఇవ్వాలో మానాలో తెలియటంలేదు. అతను ఇక్కడ ఉండటం ఇప్పట్లో చాలా అవసరం. ఉన్న వాళ్ళందరిలోనూ అతను చాలా సమర్థుడు. అతనూ మేజర్ రాయ్ నా దగ్గరఉంటే నాకు ఎంతో ధైర్యంగా ఉంటుంది. కానీ అతను వెళ్ళకపోతే ఆమె బ్రతకకపోవచ్చు. ఆమె మరణానికి మనం బాధ్యులము అవుతాము. ఇది అతనికి ఇవ్వకపోవటం ఇక్కడ మనపరిస్థితి దృష్ట్యా దేశ శ్రేయస్సు దృష్ట్యాచాలా మంచిది. కానీ మనం అతనికి వ్యక్తిగతంగా ద్రోహం చేసినట్లు అవుతుందేమో. అతని వ్యక్తిగత విషయంలో జోక్యంచేసుకున్నట్లు అవుతుందేమో. మిగతా ఉత్తరాలను ఎన్నింటిని సెన్సార్ చేసినా, ఇటువంటిదాన్ని మాత్రం దాచటం తప్పు అవుతుంది. దీన్ని అతనికి ఇవ్వటం, ప్రయాణానికి అనుమతించటం మన కర్తవ్యం. ఆ పైన అతని ఇష్టం. ఇక్కడి పరిస్థితి అంతా అతనికి తెలిసిందేకదా'

'కానీ కల్నల్, బహుశ ఈపాటికే ఆమె మరణించి ఉంటుందని నా అనుమానం. ఈ టెలిగ్రామ్ రావటమే ఆలస్యమయింది. ఇప్పుడు అతను అక్కడికి వెళ్ళి చేయగలిగిందేమీ లేదుకూడా. పైగాఅతను ఇక్కడలేని లోటు మనను చాలా దెబ్బతీయవచ్చు. ఆపద్ధర్మంగా ఈ టెలిగ్రామ్ ను దాచేసి, తర్వాత నెమ్మదిగా చెప్పకూడదా' అన్నాడు రెండో ఆఫీసరు.

"నువ్వు చెప్పింది నిజమే. అతను వెళ్ళి చేసేదేమీలేదు. నువ్వు చెప్పినట్లు టెలిగ్రామ్ ని దాచేసి తర్వాత చెప్పినా అతను మనల్ని క్షమించగలడు. ఆ ఔదార్యం అతనిలోవుంది. కానీ దాన్ని అతనికి ఇవ్వటమే మన ధర్మం. అతని బాధ్యత అతనికి తెలుసు. నాకు అతనిమీద పూర్తి విశ్వాసం ఉంది' అన్నాడు కల్నల్.

కల్నల్ మాట్లాడుతున్న ఒక్కొక్క మాట తన వ్యక్తిత్వానికి సవాలుగా వినిపించింది. పరిస్థితి అర్థమైంది. మెదడులో పెద్ద హోరు ప్రారంభమైంది.

● హోటల్లో ఒకడు : 'ఏమోయ్, నీకేగా పెసరట్టుతెమ్మనిచెప్పాను?'
సర్వరు : 'అవునండి.'
'ఓ, ఇంకా వున్నావన్నమాట. ఎలా వున్నారు నీ మనవలు?'

కళ్ళు బైర్లు గమ్ముతున్నాయి. తనువెల్లా ఏదో అశక్తత ఆవహించింది. స్పర్శ నశించినట్లు, శరీరంలోని కీళ్ళు అన్నీ వశం తప్పుతున్నట్లు అనిపించింది. నిర్వేదం, నిరాశ, నిస్పృహ, నిస్సహాయత ఒకవైపు, కర్తవ్యం, ధర్మం, ఆత్మవిశ్వాసం, సంకల్పం మరొకవైపు చేరి భీషణయుద్ధం సాగిస్తున్నాయి. మనస్సు రణరంగమయింది. అవ్యవస్థ ఏర్పడింది. శవంలా బల్లమీద కూలబడి పోయాడు. బృహత్ ప్రయత్నంతో మనస్సులోని హోరును అణిచివేశాడు. గోడకి చేరగిలబడి కొంచెం విశ్రాంతి తీసుకుని, ఊపిరి పీల్చుకున్నాడు. ప్రశాంతంగా ఆలోచన ప్రారంభించాడు.

తల్లి, తండ్రి, చెల్లి, ఇల్లు, దగ్గరి బంధువులు, స్నేహితులు, చిన్నప్పుడు ఆడుకున్న ప్రదేశాలు, చేసిన అల్లర్లు జ్ఞాపకం వచ్చాయి. చెల్లెలు ఉత్తరంలో వర్ణించిన అమ్మ ముఖం, తన మీది బెంగతో చిక్కిపోయి దీనంగా ఉన్న ముఖం కళ్ళముందు కనిపించింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కళ్ళ ముందరి దృశ్యం కన్నీళ్ళతో అలుక్కుపోయింది. ఆ దృశ్యంలో అమ్మతో తనకుగల అనుబంధం దర్శనమిచ్చింది. తన చిన్నప్పటి అమ్మ తనను ఒళ్ళో కూర్చోబెట్టుకుని, పెరట్లో చెట్టుమీది కాకిని చూపిస్తూ గోరుముద్దలు తినిపిస్తోంది. తనకి నీళ్ళుపోసి, బట్టలుతొడిగి, బొట్టుపెట్టి తలదువ్వి, తన అందాన్ని చూసి మురిసిపోతోంది. వెన్నెల్లో పారిజాత చెట్టుకింద మంచంమీద తన పక్కన కూర్చోబెట్టుకుని భారతంలో అర్జునుడి కథ చెబుతోంది. పొద్దున్నే పలకాబలపం చేతికిచ్చి బడికి పంపిస్తూ బుగ్గమీద ముద్దు పెట్టుకుంటోంది. దేవుడి మందిరం దగ్గర తనకూ చెల్లాయికీ భగవద్గీతలోని శ్లోకాలు చదివి వినిపిస్తోంది. సైన్యంలో చేరడానికి వెళ్ళిపోతుంటే గుమ్మంలో నుంచుని కళ్ళనీళ్ళు పెట్టుకుంటోంది.

ఒక్కక్షణం కెప్టెన్ మనస్సు శూన్యంగా ఉండిపోయింది. మళ్ళీ కల్నల్ చెప్పిన మాటలు, సైన్యంలో చేరేటప్పుడు ప్రమాణంచేస్తూ తాను చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. దేశంకోసం వ్యక్తిగతమైన సర్వస్వాన్ని త్యాగం చేయడానికి తాను ఇక్కడకు వచ్చాడు. తను త్యాగం చేయగలడని దేశప్రజలు తనపై విశ్వాసం ఉంచారు. ఒక్కక్షణం మనోదౌర్బల్యానికి లోనై అందరి విశ్వాసాన్ని భగ్నం చేయకూడదు. తల్లి, తండ్రి, చెల్లెలు, ఇల్లు – వారిపై తన మమకారం – ఇవన్నీ వ్యక్తిగత విషయాలు. ఇటువంటి వ్యక్తులు కొన్ని కోట్లమంది ఈ దేశంలో ఉన్నారు. తన ఒక్కడి తల్లికోసం అన్ని కోట్లమంది తల్లులకు అపచారం చేయకూడదు. తన ఒక్కడి స్వార్థం కోసం అందరి ఆశలు ఆరిపోకూడదు.

కెప్టెన్ మనోనేత్రం ఎదుట భారతమాత మహోద్భుత విరాట్స్వరూపం సాక్షాత్కరించింది. ఆదర్శాలవలె మహోన్నతమైన పర్వత శిఖరాలూ ఆ శిఖరాలపై మంచుకరిగి ప్రవహించి, సెలయేళ్ళై, వాగులై, జలపాతాలై, నదులై, సువిశాల మైదానాలను సస్యశ్యామలం చేస్తూ కోట్లాది ప్రజలను బ్రతికిస్తున్న పవిత్రజలాలూ వజ్రాలు, బంగారం కడుపులో దాచుకున్న గనులూ, విస్తారమైన అరణ్యాలూ దర్శనమిచ్చాయి. దేశంలోని ఎన్నో మహానగరాలూ, పట్టణాలూ, గ్రామాలూ, సస్యక్షేత్రాలూ కర్మాగారాలూ, విద్యాలయాలూ, దేవాలయలూ దర్శనమిచ్చాయి. అనుక్షణం ఆశలు సృష్టించుకుంటూ జీవిస్తున్న వృద్ధులూ, యువకులూ, బాలలూ, స్త్రీలూ ఎందరో కనిపించారు. దేశమంటే కేవలం నాలుగు ఎల్లల మధ్యఉన్న కొన్నివేల చదరపు మైళ్ళ మట్టికాదు – ఆ మట్టిలో పుట్టి పెరిగిన ప్రజానీకం ఎన్నో సహస్రాబ్దాలుగా అనేక మతాలమధ్య, భాషల మధ్య, ఆచారాల మధ్య సమన్వయాన్ని సాధిస్తూ భిన్నత్వంలో ఏకత్వాన్ని నిరూపించుకున్న, వైవిధ్యపూర్ణమైన ఒక మహోజ్వల సంస్కృతికి ఆలయం ఈ దేశం. గతంలో ప్రస్తుతంలో, భవిష్యత్తులో జీవించిన, జీవిస్తున్న, జీవించనున్న కోటికోట్ల ప్రజలకు తల్లి ఈ దేశం. ఈ ప్రజలందరికీ ఇల్లూ, ఆస్తీ సర్వస్వం దేశమే. ఈ తల్లిని కాపాడి, ఈ ఇల్లును నిలబెట్టే బాధ్యత ఇక్కడ నిలిచిన సైనికులపై ఉంది. ఇక్కడి సరిహద్దు కేవలం భూభాగానికి మాత్రమే పరిమితమైనది కాదు. ఇది మన సంస్కృతికి, మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకూ కూడా సరిహద్దు. చైనా దురాక్రమణ మన భూమి మీదనేకాదు. అది మన సంస్కృతిమీదా, స్వాతంత్ర్యంమీదాకూడా దురాక్రమణ. ఈ సరిహద్దు రక్షణకు కోటగోడలాగా నిలిచింది ఇక్కడి సైన్యం, తాను ఈ స్థానం నుంచి తొలగితే ఈ గోడల మధ్యనుంచి ఒక పెద్దరాయిని పెకలించినట్లు అవుతుంది. గోడ బలహీనపడుతుంది, శత్రువు చొరబడటానికి అదే ఆధారం కావచ్చు.

కెప్టెన్ ఆలోచనల నుంచి తేరుకునేసరికి ఎదురుగా కల్నల్ కనిపించారు. వెంటనే లేచి శాల్యూట్ చేశాడు. కల్నల్ అప్పటికే ప్రసాద్ పరిస్థితిని గుర్తించాడు. టెలిగ్రామ్ అందించి "నీకు సెలవుగ్రాంట్ చేస్తున్నాను. వెంటనే బయలుదేరి వెళ్ళవచ్చు. జీపుకూడా సిద్ధంగా ఉంది" అన్నాడు.

"థాంక్యూ సర్. ఇక్కడి పరిస్థితి నాకు తెలుసు. నేను ఇక్కడ ఎంత అవసరమో తెలుసు. నా బాధ్యత తెలుసు. నేను వెళ్ళి ప్రయోజనంలేదు. నాకు సెలవు అక్కర్లేదు. ఇక్కడే ఉంటాను. ఇంకొక పావుగంటలో పనిముగించి ముందు స్థావరానికి బయలుదేరి వెళ్తాను" అన్నాడు కెప్టెన్. కల్నల్ మహాకృతజ్ఞతా సూచకంగా, ప్రశంసాపూర్వకంగా కెప్టెన్ భుజం తట్టి, అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

(సశేషం)

శతవృద్ధు

ఆయన మళ్ళీ సరిగ్గా అదే సమయానికి అక్కడ కనబడ్డాడు!

ఆయన చుట్టూతా పదిమంది చిన్నపిల్లలు, అల్లరిచేస్తూ కొందరు, నవ్వుతూ గెంతుతూ కొందరు; గులకరాళ్ళు కాలవలోకి విసిరివేస్తూ మరికొందరు.

ఓ కుర్రవాడు కొంటెగా అడుగుతున్నాడు. 'తాతా!—నీ వయసెంత!'

'ఆఁ! ఎంతరా?—రేపు శ్రావణ మాసానికి పదమూడేళ్ళు.' ఆయన బోసినోట్లో మాట వంకర్లు తిరిగింది.

చమత్కారం మాటవిని తలపైకెత్తి చూశాను. సాయంకాలపు నీరెండ ఆయన బట్టతలపైబడి సిగ్గుతో ప్రక్కకు జారిపోతోంది. శరీరం ముడుతలుపడి, ముడుతలమధ్య శరీరపు ఎర్రదనం చిక్కబడుతోంది. వెడల్పు పెదిమలు. నొసటన గంధాక్షతలు. ఆయన చేతిలో కర్ర గాలికి వణుకుతున్నది.


నేనా వూరికి క్రొత్త. జనాభా లెక్కల ఆఫీసరుగావచ్చి, ఊరికి దూరంగావున్న కాలనీలో వో ఇల్లు అద్దెకు తీసుకున్నాను. ఎవరూ ఇంకా పరిచయం కాలేదు. సాయంకాలం పూట కృష్ణకాల్వ, ఉదయంపూట ఇంట్లో శ్రీమతీ మాత్రమే నన్ను చనువుగా పల్కరించే నా వాళ్ళు.

వచ్చినప్పటి నుంచీ, ప్రతిసాయంత్రం, అక్కడే కూచుంటున్నాను. నా చుట్టూతా కంటికి ఆనందంగా నేల మీద తివాచీ పర్చినట్లున్న పేరు తెలీని పూలు.

నాకు కొంచెం దూరంలో ఆయన. ఆయన చుట్టూతా పేరుతెలీని పూల వంటి అల్లరి పసిపిల్లలు.

'తాతా! నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోరాదూ?'

'ఒరేయ్! ఇక్కడెవరూ అందమైన ఆడపిల్లల్లేర్రా! - మీ బామ్మ వెళ్ళింది పైనెవరన్నా వున్నారేమో కనుక్కొస్తానని. ఇంకా ఉత్తరం రాలేదు. రాగానే, నేనే అక్కడకు వెళ్తాను-కొత్త పెళ్ళికొడుకునై.'



'నువ్వెళ్ళేటప్పుడు నన్ను తీసుకెళ్ళవూ?'

అయన వంగాడు, ఆ పసిదాన్ని ముద్దుపెట్టుకుందామని. చెవులమధ్య నిలువని కళ్ళజోడు, ముక్కుమీదకు జారి క్రింద పడిపోయింది. తాతకు కళ్ళజోడు దొరక్కుండా చేద్దామని ఆ పిల్లలు 'దొంగాట' ఆడడం మొదలెట్టారు. 'ఇయ్యండర్రా! కళ్ళు కనుపించవ్' అంటున్నాడాయన దీనంగా. నా కెవిటో అది బాధ అనిపించింది. పండిన పండు ఆ మనిషి. ఎప్పుడో రాలిపోతుంది. దాన్ని మనం బంతిలా ఆటలాడకూడదు. లేచి వెళ్ళి, ఓ పిల్ల తన చేతిలో వెనగ్గా దాచుకొన్న ఆ కళ్ళజోడును గభాలున లాక్కుని 'ఇదిగోనండి!' అన్నాను—మర్యాదనంతా కంఠంలోకి తెచ్చుకుంటూ.

ఆయన ఉలిక్కి పడ్డాడు. కళ్ళజోడు పోగొట్టుకున్న ఆ పిల్ల నావేపు కోపంగా చూస్తున్నది.

'థ్యాంక్స్!' అని ఆయన నానుండి ఆజోడు నందుకుని 'ఏం తల్లీ?—కోపం వచ్చిందా?— ఇదిగోనమ్మా జోడు—తీసుకో' అంటూ మళ్ళీ ఆ అమ్మాయికే ఇయ్యబోయాడు.

"జోడు లేకపోతే మీకు కష్టం కాదా?"

ఆయన నవ్వాడు. "నిజంగా నాకు 'సైట్' వుందను కొంటున్నారా?" అన్నాడు. "ఈపిల్లలకు నేను జోడు లేకపోతే గ్రుడ్డివాణ్ణయితే, అదో తమాషా,అదోఅట. వాళ్ళ ఆనందాన్ని నేనెందుకు పాడుచేయాలి?—నాసేపు నాకు కళ్ళు కనిపించకపోతే ఏం?"

నేను మాట్లాడకుండా నుంచోవడం చూసి మళ్ళీ ఆయనే అన్నాడు. "చూశారా—నా చాదస్తం? ఎంతసేపటికి నన్ను గూర్చే మాట్లాడుకొంటున్నాను కాని, మిమ్మల్ని గూర్చి తెలుసుకోలేదు."

ఆయన ఆయాసంతో ఆగాడు. "పెద్దవాణ్ణి! మాట్లాడ్తే ఆయాసం వస్తుంది. నడుద్దామనీ, ఏదోఒకపని చెయ్యాలనీ వుంటుంది. చెయ్యలేను."

ఆడుకొంటున్న పిల్లలు, నన్నో ఆటంకంగా భావించి, తమ విసుగుదలనంతా మొహాల్లో చూపిస్తున్నారు.

ఉన్నట్టుండి ఓపిల్లవాడు అన్నాడు "మనం వెళ్ళిపోదాం, రా తాతా! కథలు చెప్పుకుందాం."

ఆయన నవ్వి, "వీళ్ళే నాకు కాలక్షేపం" అని, "వస్తాను" అన్నట్టుగా తలవూపి, పిల్లలతో కలిసి నాలుగడుగులువేసి, మళ్ళీ జ్ఞాపకంవచ్చి ఆగి, "మర్చిపోయ్యాను, మీ పేరేమిటున్నారు?" అని అడిగాడు.

నా పేరుతో మాత్రమే ఆగక, అక్కణ్నుంచి నడిచి ఒక్కొక్క అడుగేవేస్తూ, నా ఉద్యోగం, పిల్లలూ అన్నీ వివరంగా అడిగి, "రేపు కలుద్దాంమళ్ళీ" అని వెళ్ళిపోయాడు.

ఆరాత్రి, భోజనాలదగ్గర, చారుమతి చెప్పింది "ఇది విన్నారా అని?"

అట్లా ప్రశ్నతో ప్రారంభిస్తే ఏదో పెద్ద విశేషమే వుందని నాకు అనుభవం నేర్పిన పాఠం. "ఏమిటి?" అన్నాను, అడగలేదన్న నెపం నామీద ఎందుకని. నాకు, ఆ ముసలాయనను గురించి చెప్పాలని ఎంతో ఉబలాటంగా వుంది.

"అదేనండీ! మన పొరుగింట్లో ఓ ముసలాయనున్నాడు."

"పొరుగింట్లోనే కాదు, ప్రతి ఇంట్లోను వుండొచ్చు."

"అబ్బ! అదికాదండీ! ఆయనకు తొంభై ఒక్క ఏళ్ళుట."

సాయంకాలం చూసిన ఆ ముసలాయన రూపం నాకు చటుక్కున జ్ఞాపకానికి వచ్చింది. ఆయనకెంత వయసు?-పదమూడుఏళ్ళు—మై గుడ్‌నెస్! సరిగ్గా తొంభై ఒకటి. ఆయనా, ఈయనా ఒకటి కావచ్చు. నాకు ఉత్సుకత ఎక్కువైంది. "అట్లాగా!" అన్నాను ఆత్రుతగా, ఆ తర్వాత చెప్పమన్నట్టు. చారుమతి ఒక్కసారి తన జడలో పువ్వులు సర్దుకొంది. మెళ్ళోవున్న గుళ్ళకాసులపేరు సరిచేసుకుంది.

"ఆయన ఇంకా నడుస్తాట్టండీ! చూపు అనుతుందట! చెవులు వినబడతాయట. అన్నం అరుగుతుందట."

"పాపం, పళ్ళేలేవు."

"మీరు చూశారేమిటిఆయన్ను!" చారుమతి కళ్ళు చేపలే అయ్యాయి.

"చూడడమే కాదు, మాట్లాడాను కూడాను."

చారుమతి మొహం 'మంచిపని చేశారు' అన్నట్లు, ఆనందంతో మందార పుష్పమే అయింది.

"మనింటి కోసారి తీసుకురారూ ఆయన్ను. నాకుచూడాలనివుందండీ." చారుమతి తండ్రి, ఆమె పదేళ్ళ వయసులో వుండగా పోయేడు. దాని మేనమామే దాన్ని పెంచి, నన్నో యింటివాణ్ణి చేశాడు. దానికి ముసలివాళ్ళన్నా, పిల్లలన్నా జాలీ-ప్రేమా అప్పట్నుంచి.

"అట్లాగే పిలుస్తానులే."

మా యింట్లో కూచుంటే, ఎదురింట్లో వారి వంటింటి గుమ్మంవరకూ కన్పిస్తాయి. ఆయన ఆ మర్నాడూ, ఆ తర్వాతా దూరదూరంగా కన్పించడమే తప్ప, దగ్గరకు రాలేదు. పిల్లలు రానిచ్చి వుండరు.

ఒకటి రెండుసార్లు, మా యింట్లో వుంటేనే, ఎదురింట్లోనుంచి పెద్దగా కేకలు విన్పించాయి.

"పెద్దవాడివైనావ్! ఇల్లు కదిలి వెళ్ళదంటే, విన్పించుకోచేం—ఏ బస్ కిందో పడితే అప్రతిష్ఠ మాకు!"

ఆవిడ కంఠంతో, చారుమతి కంఠాన్ని పోల్చుకుని, నా అదృష్టాన్ని అభినందించుకొన్నాను.

"వెళ్ళనులేవే!" ఆయన కంఠం వణుకుతూ, మెల్లగా, సిగ్గుపడుతున్నట్లు విన్పించింది.

ఆ రాత్రి చారుమతి, ఎంతో బాధపడుతూ చెప్పింది. "పాపం! ఇప్పటికీ, ఆయన నీళ్ళు ఆయనే తోడుకు పోసుకుంటాడండీ!"

నాకూ ఆ మాట వింటే బాధ కలిగింది. అంతరాంతరాళాలలో ఒక సందేహం. ఆయన నట్లా కట్టడి చేస్తున్నవాళ్ళకు, తామూ ముసలివాళ్ళమవుతామని, స్వేచ్ఛకోసం అలమటిస్తామన్న జ్ఞానం లేదా?

శీతాకాలం మనుషుల్ని వణికించేస్తున్నది. సూర్యుడు ఆలస్యంగా నిద్రలేచి తొందరగా పడుకొంటున్నాడు. ఓ రోజున అయిదింటికి మెలుకువ వచ్చి చూస్తే, ఎదిరింట్లోనుంచి, విన్పించీ విన్పించకుండా అధ్యాత్మ రామాయణ కీర్తనలు విన్పిస్తున్నాయి. అది ముసలాయన గొంతే! సందేహం లేదు. వాకిట్లోకివచ్చి, లైటువేస్తే ఆ శతవృద్ధు ఇంటిప్రక్కన వున్న విశాల

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

మైన బయలులో పాటలు పాడుకుంటూ మొక్కలకు కుదుళ్ళు చేస్తున్నాడు – బ్యాటరీలైటు చేతబుచ్చుకుని!

ఆ వ్యక్తితో పరిచయం చేసుకు తీరాలనుకొన్నాను. ఏడుగంటలకల్లా ఆయన్ని ఆహ్వానిద్దామని ఆ ఇంటికి వెళ్ళాను.

ఓ నడివయస్సు మనిషి తలుపు తీశాడు. నన్ను లోపలకు ఆహ్వానించి ఎంతో మర్యాదచేశాడు. కాఫీ తీసుకు వస్తానని లోపలకు వెళ్ళాడు. ఇంతలోకి ఆ ముసలాయన ప్రక్కగది తలుపులు తెర్చుకుని, హాల్లోకివచ్చి, నన్నుచూసి, వెనక్కు పోబోయి, మళ్ళీఆగి, "మిమ్మల్నెక్కడో చూసినట్టుందే!" అన్నాడు ఆలోచిస్తూ.

"కాలవొడ్డున!"

నేను కొంచెం పెద్దగా అన్నానేమో, ఆ ముసలాయన ఉలిక్కిపడ్డాడు. నేను మాట పూర్తిచేయకుండానే, లోపలినుంచి ఆ నడివయస్సు మనిషి కాఫీతో ప్రవేశించాడు. ప్రవేశిస్తూనే "వెళ్ళడమే లేదన్నావుగా, కాలవకు! – ఇప్పుడు చెప్పు! ఎందుకూ ఆ అబద్ధాలు! చచ్చిపోదల్చుకుంటే, ఇంట్లోనే చచ్చిపోవచ్చుగా, కాలవలోపడి ఎందుకు, నలుగురికీ తెలవడంకోసమనా? పో. పో. గదిలోకి. ఎక్కడికీ కదలకుండా అక్కడే పడుండు."

ఆ ముసలాయన వంచిన తల ఎత్తలేదు. మెల్లగా ద్వారం పట్టుకు నిలబడి, నావేపుచూట్టానికి ప్రయత్నం చేసి, చూడలేక, తల అడించి, తప్పటడుగులు వేస్తూ లోపలకు వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్నప్పుడు, ఆయన కంటివెంట కారిన కన్నీటి చుక్క, నేలమీదపడి అరిపోబోయింది.

"తొంభైఏళ్ళపెద్దమనిషి. ఎప్పుడో అప్పుడు చచ్చిపోతాడు. ఎంత జాగ్రత్తగా వుండాలి." నేనేమీ సమాధానం చెప్పకపోవడం చూసి, మళ్ళీ ఆయన అన్నాడు. "ఆయన నాకు మామగారులెండి! పిల్లనిచ్చాడు కదండీ! అంచేత నా దగ్గరేవుంటున్నాడు; దమ్మిడీ ఆస్తి లేకపోయినా!"

"పాపం! పెద్దవాడు." అంతకన్నా ఏమనటానికీ నాకు అవకాశం లేక, పిల్లలమధ్య ఆయనను చూసిన దృశ్యాన్ని వివరించలేక, ఆ పెద్దమనిషిని లోపలకు పంపించి, నేను బయటకు వచ్చేశాను. వచ్చేస్తుండగా కిటికీ ప్రక్కనుండి, "ఏవండోయ్! ఓసారిటురండి." అన్నమాటవిన్పించింది. తలెత్తిచూస్తే, కిటికీ వూచల అవతల ఆయన, కిటికీకి, పూలమొక్కలకూ మధ్య నేను.

"మీరేం అనుకోకండి. వాళ్లూ చాలామంచివాళ్లు!– నామీద ప్రేమతోనే అట్లా అంటారు. వాళ్ళను అపార్థం చేసుకోకండి. ఏం?"

నేను తలవూపి ఇంటికివచ్చేశాను.

ఇంటికి రాగానే చారుమతి అడిగింది, "ఆయన్ను చూశారా? — రమ్మన్నారా? ఏవన్నాడాయన?"

"ఆయనో పెద్ద జైల్లో ఉన్నాడు" అని మాత్రం జవాబుచెప్పి, లోపలకు వెళ్ళిపోయాను. నా సమాధానం చారుమతికి సంతృప్తి నివ్వలేదని నాకు తెలుసు. ఐనా, నాకు ఆఫీసుటైము అయిపోయింది. సాయంకాలం నేను ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికి, ఎదురింటినిండా జనం. వాకిట్లో ఏడుకట్ల సవారీ తయారవుతోంది.

చారుమతి మా యింటి వరండాలో నిలబడి గ్రుడ్ల నీళ్ళు గ్రుడ్ల కుక్కుకుంటోంది.

నన్ను చూడగానే "ఆయన చచ్చిపోయినాడండీ!" అన్నది బావురుమని.

"ఎందుకని?" నా కంఠంలో తడి లేదు.

చారుమతి చాలా మెల్లగా చెప్పింది. "మధ్యాహ్నం ఒకసారి వరండాలోకి వచ్చాను — వీధిలో ఏదో కేక వినపడితేను! ఆయన మెల్లిగా, దొంగ దొంగగా తమ యింటిమెట్లు దిగుతున్నారు. పక్కనే ఎవరో పిల్లవాడున్నాడు. ప్రొద్దున్న మీరుచెప్పింది నాకు మనసులోవుండి, ఆయనతో మాట్లాడదామని, "తాతగారూ!" అంటూ బిగ్గరగా కేకలేశాను, "ఇల్లా ఒక్కసారి వచ్చిపొండి" అంటూ. ఆయన నావేపు బెదురుకళ్ళతో చూసి, నాకు నమస్కారం పెట్టూ ఆ కుర్రాణ్ణినాదగ్గరకు పంపించారు. వాడు నాదగ్గరకుపరుగెత్తుకు వచ్చి, "ఏమండీ! మా అక్కయ్యకు జబ్బుగా వుందండీ. తాతయ్యా! తాతయ్యా! అంటూ ఒకటే కలవరిస్తోంది. మాఅమ్మేమో, ఈయన్ను పిల్చుకు రమ్మంది. పిన్నిగారేమో లోపల పడుకుని నిద్రపోతున్నారు. లేస్తే మళ్ళీతాతయ్యను రానివ్వదు. అందుకని, తాతయ్య మీకు పెద్దగా అరవొద్దని నమస్కారం పెడ్తున్నాడు. తర్వాతొస్తాట్ట. పిచ్చిమొహందాన్ని, అట్లాగే చూస్తూ నుంచుండిపోయాను. ఆయన, ఆ కుర్రవాడి భుజంమీద చెయ్యివేసి, చెప్పనైనా లేకుండా వెళ్ళిపోయారు.

"నాకు తర్వాత కథ చెప్పనక్కరలేదు." అంటూ కళ్ళల్లో నీళ్ళతో, వాకిట్లోకి వచ్చేశాను. అంతకు క్రితమే ఇహలోకం వీడిన ఆ శతవృద్ధు–కూతురు, శాపాదపీ శరాదపీ మాట్లాడుతోంది, శవసంస్కారాలు ఒక చెంపన పూర్తి చేయిస్తూనే.

"నిజానికి నాకేం దుఃఖంలేదు– ఆయనట్లా అర్థాంతరపు చావు చనిపోయారే అని తప్ప. ఆయన కాబట్టి ఆ లారీక్రింద బడ్డా సరిపోయింది. అదే, ఆయన్ను తీసుకెళ్ళడానికి వచ్చిన ఆ కుర్రవాడు పడితే—మం ప్రతిష్ట ఏమైపోయేది, ఇహమేం తల ఎత్తు తిరగగలిగేవాళ్ళమా?" గోడను స్నానానికని ఆనించిన ఆశవం, ఆవిడ మాటలు విని నవ్వుతోంది; జనాభా లెక్కల్లోంచి ఒక్కణ్ణి తగ్గించమని నన్ను హెచ్చరిస్తోంది.

□□□

చిత్రరథుని

చైత్రయాత్ర

"పాండవవనవాసం"

ఆంధ్ర మహాభారతం, వ్యాస భారతం మొదలైనవెన్నో పరిశోధించి, తెలుగు సినిమా అవసరాలకు అనుగుణ్యంగా కథను రూపొందించి, అమిత వ్యయప్రయాసలతో నిర్మించిన భారీచిత్రం మాధవీప్రొడక్షన్స్ వారి "పాండవ వనవాసము". కొత్త సంస్థ మంచి భవిష్యత్తుకల కొత్త నాట్యతారలను పరిచయం చేసింది. నిర్మాత శ్రీ ఏ. ఎస్. ఆంజనేయులు. పాతకథే అయినా, పూర్వం కొన్ని తెలుగు చిత్రాలలో కథా భాగాలు కొన్ని వచ్చివున్నా, సినిమా ఆధునిక విజ్ఞానాన్ని సద్వినియోగంచేసి, శరవేగంతో కథ నడిపించి, కొత్త సంఘటనలతో ఉత్సుకత నిలువుతూ పూర్వపు చిత్ర కథాంశాలను కొంగ్రొత్త విధానంతో ప్రదర్శించే "పాండవవనవాసము"ను మాధవీసంస్థ మధురచిత్రంగా రూపొందించింది.

హేమా హేమీ, తారాసాంకేతిక బృందం వున్న ఈ మహాభారత గాథలో ఒక్కొక్కరు చూపిన విశేష ప్రజ్ఞను మాత్రము (బెస్ట్‌పీస్) ఇక్కడ పొందుపరుస్తున్నాము.

కథ : "పాండవ వనవాసము" కథ క్రింది పది ముఖ్య సంఘటనల పై శరవేగముగా సాగింది.

1. ద్రౌపదీ వస్త్రాపహరణము

2. ద్వైతవనములో భీమునిచే కిమ్మీర రాక్షస సంహారము

3. ద్వైతవనములో పాండవులను భంగపరచవచ్చిన దూర్వాస మహామునికే గర్వభంగము

4. కురువంశీకులచే ద్వైత వన దహనము–ఘటోత్కచునిచే పాండవ రక్షణ

5. పాండవులచే గంధమాధన పర్వతవాసం


7. భీమ – హనుమంత సంవాదము

7. సౌగంధిక కమలసాధనలో భీమరాజు గజరాజును వధించుట

8. ద్వైతవనములో పాండవులు సద్యస్కందయాగము చేయుచుండగ ఘోష యాత్ర మిషపై వచ్చిన దుష్టచతుష్టయము నృత్య వినోదములతో యాగభంగమునకు యత్నించుట.

9. కేళీసరోవరములో స్నానము చేయబోయిన దుష్టచతుష్టయమును గంధర్వ రాజు చిత్రసేనుడు చిత్రహింసలకు గురిచేయగ, భీముడే తుదకు వారిని రక్షించి పంపుట.

10. శశిరేఖా పరిణయము కళాకారులు సాంకేతికజ్ఞులు తమ విశేష ప్రతిభతో కన్పించిన సందర్భాలు (బెస్ట్‌పీస్ అన్నమాట):



మాధవీప్రొడక్షన్స్‌వారి "పాండవ వనవాసము"లో రంగారావు

భీముడు (రామారావు) గంధర్వరాజు చిత్రసేనుడు (ధూళిపాళ) చే పట్టురజ్జుచే బంధించబడిన దుర్యోధనుని కట్లను, ధర్మజుని సమక్షమున, భీముడు విప్పుతూ "దుర్యోధనా! నాడు ద్యూతమందిరంలో ఆడదాని (ద్రౌపది) కన్నీటితో రాజ్యం సంపాదించుకొన్నామని అపహసించావు. నేడు నీఅర్ధాంగి భానుమతి కన్నీటితో ప్రాణాలు దక్కించుకొన్నావు. అడువు తెచ్చుకొన్న ప్రాణాలు అరచేతిలో పుచ్చుకొని హస్తినాపురంచేరుకోపో!" అనిగర్జించుతూ నటించిన ఘట్టం.

దర్శకుడు (కమలాకర కామేశ్వర రావు) : దుర్యోధన నూతన మందిరములో ద్యూతక్రీడ ప్రారంభమైనది మొదలు ఘోషయాత్రానానంతరం హస్తినాపురికి తిరిగివచ్చిన, దుర్యోధనునిలో పరాభవ ప్రళయాగ్ని పర్వతం బ్రద్దలుకాగా శకుని వచ్చి కృష్ణబలరాములపై భేదాస్త్రం ప్రయోగించవలెనని చెప్పే ఘట్టంవరకు కామేశ్వర సిద్ధహస్తం హమేషా కన్పిస్తుంది.

కవి(సముద్రాల రాఘవాచార్య): ద్యూతక్రీడా సన్నివేశంనుంచి శశిరేఖ లక్ష్మణకుమార వివాహ లగ్నంవరకు రాఘవాచార్య కలం రమణీయంగా చిందులు త్రొక్కింది.

కళాదర్శకుడు (ఎస్. వి. కృష్ణారావు) : ద్యూతక్రీడామందిరం.

సంగీతం (ఘంటసాల) : "హిమగిరి సొగసు" పాటలో, మరి రెండు మూడు సందర్భాలలో.

దుర్యోధనుడు (ఎస్. వి. రంగారావు): ఘోషయాత్ర పరాభవానంతరం హస్తినాపురికి తిరిగివచ్చి మూడద్దపు పెంకులలో ఆత్మఘోష వెల్లడి చేసినప్పుడు.

శకుని (ముదిగొండ లింగమూర్తి): ద్యూతక్రీడలో సూత్రధారి అలుక సందర్భం; పాండవులు సద్యస్కందయాగం తలపెట్టినట్లు దుష్టచతుష్టయం వినగా దుర్యోధనునికి "మహారాజు తనవారి మేలుకన్నా ఎదుటివారికీడే ఎక్కువ కోరాలి" అనీ "రాజనీతిసారం" చెప్పినప్పుడు.

ద్రౌపది(సావిత్రి) : వస్త్రాపహరణ ఘట్టములో నటన.

ధర్మరాజు (గుమ్మడి), శ్రీకృష్ణుడు (టి. ఎల్. కాంతారావు), చిత్రసేనుడు (ధూళిపాళ) కన్పించిన ప్రతి సన్నివేశంలోనూ.

ప్రత్యేక ప్రశంస: ఘోషయాత్ర వినోదార్థులముందు న్యూఢిల్లీ నర్తకి హేమా మాలినిచేసిన నృత్యం.

● ● ●

కామేశ్వరరావు కొత్త చిత్రాలు

"పాండవ వనవాసము" దర్శకుడు కమలాకర కామేశ్వరరావు నాలుగు చిత్రాలు డైరెక్టు చెయ్యడానికి కంట్రాక్టులపై సంతకాలు చేశాడు. ఒకటి "ధనలక్ష్మి" సాంఘికం. రెండు "ఇరుగు పొరుగు" భాగస్వాములు తలపెట్టిన జానపదం. ఫిబ్రవరి—మార్చిలలో సెట్స్‌కు వెడుతుంది. పింగళి నాగేంద్రరావు కథ, సంభాషణలు, పాటలు సమకూర్చుతున్నారు. పబ్లిసిస్టు ప్రకాశరావు నిర్మించే "వీరహనుమాన్" మూడవది. నాల్గవది షూటింగ్ జోరుగా సాగుతున్నది—రాజ్యం పిక్చర్స్‌వారి "శకుంతల." "వీరహనుమాన్"కు మల్లాది రామకృష్ణశాస్త్రి సాహిత్యం సమకూర్చుతున్నారు.



"సుమంగళి"లో నాగేశ్వరరావు, సావిత్రి

పరిశీలన :

"సుమంగళి"

ముందుమాట : అశ్లీలానికి చోటు లేకపోయినా దానికి ఎలాగో అలా చోటు కల్పించి ప్రేక్షకులను హుషారెత్తించి లక్ష్మీప్రసన్నం చేసుకోడమనేది యీ కాలపు భారత బాక్సాఫీస్ సినీసూత్రాలలో ముందుమాట. తద్భిన్న దృక్పథంతో సాగిన ఏకైక చిత్రం వీనస్ పిక్చర్స్ సమర్పించు అశోక్ మూవీస్ వారి "సుమంగళి." కథకు ప్రాతిపదిక నిజానికి ఒక అశ్లీల అంశం. నిర్మాతలు తలచుకొంటే దానిపై చిలవలు పలవలు అల్లి బాక్స్ ఆఫీస్ కొల్లకొట్టవచ్చు. కాని కళారాధకులైనవారు అలా చేయక కరుణ స్పందనకు ఆ అంశమును వినియోగించడం మిక్కిలి శ్లాఘనీయం. ఒక ప్రమాదములో—అశ్లీలంగా చెప్పాలి అంటే "నపుంసకుడైన" భర్త, ఈకాలగతి గమనించి అభ్యుదయ భావ

ముతో పునర్వివాహము (భార్యకు) తలపెట్టుతాడు. చిత్రంలో ఎచ్చటా 'నపుంసక' పదము తేక 'దాంపత్య జీవితానికి అనర్హు"డనే సుతి మెత్తని పదము ఉపయోగించి। ఆ పాత్రపైన, భార్య పాత్రపైన కరుణ। కలిగే విధముగా సంభాషణలను, కథను నడిపించారు. అశ్లీలమునకు ఏ మాత్రము సూచన వచ్చినా నీడలతో నడిపించారు సంభాషణాది తతంగమంతా. దాదాపు ప్రతి సన్నివేశం సంభాషణ కర్తకు, ఛాయాగ్రహణానికి, దర్శకునికి పరీక్ష. విప్లవాత్మకమైన, సాహసవంతమైన సబ్జెక్టు, కాలగతికి సరిపోయేదే అయినా మన సినీ ప్రేక్షక కాలగతికి ఎదురీదితే ఎదురుదెబ్బ తగులవచ్చు. ప్రతి సంఘటన పరీక్షగా నిలచిన ఏకైకచిత్రం 'సుమంగళి.' ఈ పరీక్షలో 'పసుపు కుంకుమల' తో 'సుకుసుమాలతో'— అనగా జయంగా—ఆదుర్తి బృందం బైటపడింది.

ముగింపుమాట : శాంతారామ్ మొదలైన మేటి దర్శకులు కొన్ని సమస్యలను తీసుకొన్నప్పుడు, సమస్యను హృదయాలకు హత్తుకొనేటట్లు చిత్రీకరించి, పరిష్కారమార్గాన్ని చెప్పక ప్రేక్షకుల విచక్షణకు, విజ్ఞానానికి వదలివేస్తారు. అరటిపండు వలచి నోట్లో కుక్కడం దర్శకుని పనికాదు. వలచి యివ్వడంవరకే ఆయన పని. 'సమస్య ఇది. సావకాశాలు యివి. తర్వాత మీ — — ' అని వదలివేస్తారు. ఈ కోవకుచెందినది ఆదుర్తి ఎదురీత చిత్రం. దాదాపు ప్రతి సంఘటన, సన్నివేశం, పరిణామం సహేతుకంగా, సమంజసంగా, సున్నితంగా, సరళంగా సాగించుకొని పోవడంలో ఆయన ప్రతిభ, రచయితప్రభద్యోతకమైనవి. తుదకు హాస్యసన్నివేశాలు కూడా లలితపరిమితులలో వుండడం హర్షదాయకం. చిత్రంలో శేఖర్, శారద—విశ్వం వివాహ పరీక్షా సమయంలో తెర దర్శనమివ్వడం, దంపతులకు దాంపత్య జీవితార్హత లేదన్నప్పుడు వారి మధ్యనే అతడు మసలడం, ఆయననే కథకు, ప్రళయాలకు, ప్రణయాలకు (స) (వి) పరిణామాలకు పరికరంగా ఉపయోగించుకొనడం నేర్పుగా, నేత్రానందకరంగా (కళకు సంబంధించినంతవరకు) సాగింది. చిత్రీకరణశైలి (టేకింగ్) లో దర్శకుని విన్నాణం, భావనాపటిమ, వ్యుత్పన్నత పగిలిన అద్దంపైవిశ్వంను కలవడంలో ఆయన ఊహాశక్తి వ్యక్తమైనవి. మహాదేవన్ సంగీతం 'గంగగోవుపాలు' సామెత, ఆత్రేయ మాటలు, వాటికి మించిన పాటలు తెలుగు తియ్యందనానికి నిదర్శనాలు. దీపావళి సంచిక సందర్భంగా నాగేశ్వరరావుతో గోష్ఠి జరిపినప్పుడు 'సుమంగళి' ప్రస్తావనరాగా 'అందులో నాగేశ్వరరావు ఏమి యాక్ట్ చేస్తారు. స్కోపేదీ లేడీసబ్జెక్ట్' అన్నారు అక్కినేని.

కాని, చిత్రం చూడగా విశ్వఖ్యాతి నార్జించగల విధంగా నటించారు. శారద సావిత్రి సినీనటునలో విశారద సావిత్రి. ముగింపు మాటకు మర్యాద ఆమె నటనా ప్రశంసతో ముగించినప్పుడే.



శ్రీ వాణీ ఫిలింస్‌వారి "నాదీ ఆడజన్మే" లో ఒక సన్నివేశం

"నాదీ ఆడజన్మే"

పార్వతీ విలాస్ : అది నిజంగా 'నాదీ ఆడజన్మే' లో ఒక ముఖ్య భూమిక. అందులోని పాత్రలతోనే కథ అల్లబడింది.

పార్వతి : ఈమె లేదు. గతించింది. కాని, కనిపించని యీ పాత్రపైనే కథ అంతా సాగుతుంది. కథకుడు శైలేష్‌డే.

విజయరాజేంద్రప్రసాద్ : పార్వతి భర్త (రంగారావు), ఈజమీందారు, భార్య గతించినప్పటినుంచీ పార్వతి విలాస్ దాటి వెళ్ళలేదు. పడకగదిలోనే మంచంమీదే మనుగడ. ఆయనకు మిగిలిందల్లా రెండే. ఒకటి పార్వతి చిత్రపటుముందు నిలబడి తనేమి చేసినా, చేయాలనుకున్నా అదొకధోరణిలో భారంగా 'ఆమె'తో భాషించడం. రెండవది పార్వతి అంత పసిమితో లక్ష్మీవలె కళ కళలాడే

పిల్లను తన పెద్దకోడలు చేసుకోవాలని.

భాస్కర్ : సౌందర్యారాధకుడు, చిత్రకళాకారుడు అయిన భాస్కర్ (రామారావు) రాజేంద్రప్రసాద్ కుమారుడు. అందగత్తె బంగారు బొమ్మ అర్ధాంగి కావాలని ఆశించాడు. వివాహం దైవనిర్ణయం అని ఓ పెద్ద అంటే మానవనిర్ణయం అని సవాలు చేశాడు. ఏమైనాసరే ఆ సవాలుకు నిలబడాలనుకొన్నాడు ఆ విద్యాధికుడు.

చంద్రం : లక్ష్మణుడి వంటివాడు భాస్కర్‌కు చంద్రం (హరనాథ్). రాజేంద్రప్రసాద్ రెండవకుమారుడు, హుషారైనవాడు, పార్క్ సైడ్, రోడ్ "రాంగ్ సైడ్" (స్కూటర్) రైట్ రోమియో!

సింహాద్రిఅప్పన్న : ఆ పట్టణంలోనే ఉంటున్న సాదరుకొట్టు స్థాపకుడు (సింహాద్రి అప్పన్న (అల్లు రామలింగయ్య). ఆయనకు ఉన్న భారమల్లా లక్ష్మీసరస్వతుల వంటి ఇద్దరు సోదరీమణుల వివాహ సమస్య.

కళ్యాణి : లక్ష్మి వంటి సిరికల కళ్యాణి (సావిత్రి) అప్పన్న పెద్ద చెల్లెలు. కళకళలాడే ముఖమే అయినా శరీరచ్ఛాయ కారునలుపు, కారునలుపు. సౌందర్యారాధకులకు శత్రువు. బంగారు కోడలును కోరే మామకు కారడవిచిచ్చు. భార్యను కోరే విద్యాధికునికి ఊహకే బహు భారం కాగల నిరక్షరకుక్షి. ఈ "నల్లపక్షి" కళ్యాణికి కళ్యాణ మోక్షం ఉంటుందా? అవిద్య, దారిద్ర్యం, "శనిదెయ్యం" రంగు ఆమె సొత్తు, అయినా ఆమె లక్ష్మి.

మాలతి : చదువులకు సరస్వతి మాలతి (జమున). "రైట్ రోమియో" లతో "లెఫ్ట్ రైట్" పాటుపాడగల గాయని. బంగారువన్నె. నల్లకళ్యాణి ఎర్ర చెల్లెలు,

దశరథరామయ్య : పేరుకు దశరథరాముడే (రమణారెడ్డి). కాని పదితలలు మార్చగల, తొమ్మిది తలలు చేర్చుకోగల రావణాసురుడు. ప్రతిమాటతో ప్రతి అంగతో విత్తం మొత్తం చేసుకొనే నక్క జీవితం గుత్తకు తీసుకొన్నాడు. సాక్షాత్తూ కీ॥ శే॥ పార్వతి సోదరుడు. పార్వతీ విలాస్‌లోనే విడిదిచేసివున్న సకుటుంబ పందికొక్కు. పార్వతి పేరుచెప్పి పర్వతమంత జమీందారీ ఆస్తి భుక్తం చేసుకోడానికి ప్లాను వేసుకొన్నాడు. ప్లానులో అణువు అణువుకూ కవిషన్. బంగారుబొమ్మ మాలతి చంద్రంను ప్రేమిస్తుంటే చంద్రం అన్న భాస్కర్‌కు ఆ బొమ్మను పెళ్ళిచూపులలో చూపి నల్లపిల్లనిచ్చి వివాహంచేసి "టూ బర్డ్స్ ఎట్ ఏ షాట్" లా జమీందారునూ, భాస్కర్‌నూ పట్టీలు కొట్టించాడు. తండ్రీ బిడ్డలమధ్య, అన్నదమ్ముల మధ్య, భార్యాభర్తల మధ్య, యువ ప్రేమీప్రేమికులమధ్య



విజయలక్ష్మి పిక్చర్స్‌వారి "విజయ సింహ"లో విజయలక్ష్మి

ప్రేల్చాడు ద్వేష విషంబాంబు, అనుమానపు క్రిమిబాంబు.

నలుపయినా, అ ఆ లు వ్రాయ నేర్వకపోయినా, "పార్వతీవిలాస్"లో విలాసం బదులు విషాదమే క్రమ్మింగినా కళ్యాణి తన నలుపులోనే తెలుపు చూపింది. "అ", "ఆ" లే కాదు మతలబు దస్తావేజులే చదివింది. విష కలుషితమైన పార్వతీ విలాస్‌లో తుదకు హర్షం వర్షింపజేసింది. ఇంటికి లక్ష్మి అనిపించుకొన్నది. లక్ష్మీ సరస్వతులవంటి కళ్యాణి మాలతులు కోడళ్ళుకావడమే తన జీవితానికి "షుగర్" అని అన్నాడు షుగర్ కంపెయింటు పేమెంటు విజయరాజేంద్ర ప్రసాద్.

ఈ విస్మయ వినోద విచిత్ర సంఘటనలు ఎలా జరిగినవో విభ్రాంతి దిగ్భ్రాంతి భ్రాంతీ కలిగించే విధంగా చూపిన 17 రీళ్ళ—4848 మీటర్ల చిల్లర చలనచిత్రకళాచిత్రం శ్రీ వాణీ ఫిలిమ్స్ వారి "నాదీ ఆడజన్మే".

అందంకంటే ఆత్మ సౌందర్యం ప్రధానమని నిరూపించిన ఈచిత్రంలో దర్శకుడు త్రిలోక్ చందర్ పార్వతి విలాస్ వాతావరణంలోకి ప్రేక్షకులను శీఘ్రమే తీసుకొని వెళ్ళడంలోను, కథా సమస్యను

మొదటిరీలులోనే ముడి వేయడంలోను, కనిపించని పార్వతి కనిపించేలా కథ నడపడంలోను, పాప కోసం కలవరిస్తోన్న కళ్యాణి, బొమ్మ పోకాడడంచూస్తూ అసలు పాపను ఊహించుకొన్నట్లే చూపి బాధను అధికంగా చూపకలగడంలో, ఎనిమిది గంటలవేళ గంటలతో దృశ్యపు విలువలు పెంచడంలో, హుషారుప్రేక్షకులకు వెర్రి హుషారు కలిగించేటట్లు జమున అండ్ హరనాధ్ కొంటె పాటలు చిత్రీకరించడంలో ప్రజ్ఞ, ఉవజ్ఞచూపారు.

ముఖ్యనటుడు ఎస్.వి."ఎస్." అనగా శోకనటనలో "వి" అనగా విశిష్టత కనపరచిన రంగారావు "రాజేంద్ర" నటన రాజేంద్రుని హోదాలోనే వుంది.

సావిత్రి ప్రతికూల వాతావరణంతో మైత్రి నెరవుకొంటూ మైనస్‌ను ప్లస్ చేసిన వసగల భూమికకు పసిమి తెచ్చింది "నల్లసావిత్రి" నటన.

రామారావు: పాత్రపరిమితులలో రమ్యంగానటించారు; ప్రసంగించారు.

సంగీత దర్శకుడు సుదర్శన్: లలిత సంగీతాభిమానులకు పసందైన విందుచేశారు. నేపథ్యం ప్రశంసనీయం.

చిత్ర విజయానికి తోడ్పడిన "త్రీ మస్కెటీర్స్" ఛాయాగ్రాహక స్వామి ముత్తుస్వామి, గీతాసాహితీ రథసారథి దాశరథి, సంభాషణలరాజు డి. వి. నరసరాజు.

"రామదాసు"

నటులే దర్శకులయేతరంసమాప్తమౌతున్నది. ఉత్తరాదిలో అలనాటి బరువా, సొహ్రాబ్ మోడి సంప్రదాయాలను నేటికీ రాజకపూర్‌వంటి వారు నిలుపుతున్నారు. ఈతరంకూడా దాటిపోతే నట-దర్శకులు లేకపోవచ్చు.

ఇక్కడ దక్షిణాదిలో అలనాటి వై. వి. రావు నటదర్శక సంప్రదాయం నేడు నాగయ్యవరకు నిలచివుంది. ఈ తరం తర్వాత నట-దర్శక సంప్రదాయం వుంటుంది.

అలనాడు విష్ణుపంత్ పగ్నిస్, సైగల్, పహిసన్యాల్, సురేంద్ర, షాహు మోడక్ భక్తుల భూమికలు నిర్వహించి, స్వయంగా పాడి చలనచిత్ర సమగ్ర కళకు ఉడుతాభక్తి సేవ చేసివున్నారు.



"మంగమ్మ శపథం"లో జమున, ఎన్. టి. రామారావు

భరత్ భూషణ్ కూడా భక్తుల, కవుల వేషాలు ధరించి వున్నారు. ఆ పాత తరానికిచెంది, యిప్పటికీ "ఫైల్"లో వున్న గాయకనటుడు నాగయ్య. ఆ గాయకులు స్వయంగా చిత్రాలను డైరెక్ట్ చెయ్యలేదు. ఈ గాయకుడు మొన్న త్యాగయ్యను, నిన్న "రామదాసు"ను డైరెక్ట్ చెయ్యడమేగాక, నిర్మించారు కూడా. ఆ తరానికి ఈ తరానికి వారధి వంటివారు నాగయ్య. అలానే ఆయన చిత్రం 'రామదాసు' కూడా పాత కొత్తల చలనచిత్రకళ శాఖల మేలు కలయిక వంటిది.

సినిమా శాఖలన్నింటిలోను ఉద్దండపండితుడైతేనే దర్శకుడుగా మిక్కిలి రాణించగలుగుతాడు. వై. వి. రావు, ఎల్. వి. ప్రసాద్, శాంతారామ్, సొహ్రాబ్ మోడి, బరువా, రాజకపూర్‌ల విజయాలకు కీలకం అందులోనే వుంది. సంగీతం, అభినయం, దర్శకత్వాది శాఖలలో అపా

రానుభవం గడించిన నాగయ్య వాటికి ప్రాధాన్యంకల, ఆయన అభిరుచులకు సరిపోయిన 'రామదాసు' తీశారూ అంటే దాని ప్రమాణాన్ని ఉజ్జాయింపుగా ఊహించుకోవచ్చు. ఈ ఆశలకు 'రామదాసు' నిరాశ కలిగించదు. పైగా ఈ కాలంలోనూ ఆకాలంలో అంతటి ఉత్తమ చిత్రం తీయవచ్చుననే నూతన ఆశాభావం చిగురించుతుంది.

తిరుపతి శ్రీ వెంకటేశ్వరుని ఏడుకొండల నిలయం తర్వాత ఆంధ్రావనిలో ప్రసిద్ధిచెందినది భద్రగిరి. శ్రీరామ భద్రాలయం నిర్మించి, అందులకు చెర, నానాచెరలూపడిన కంచెర్ల గోపన్న అనే రామదాసుకథ, ఆయన కీర్తనలు, ఆయన రచించిన దాశరథీ శతకం, ఆయనపై నాటకాలు తెలుగు వారికి ఉగ్గుపాల దశనుంచీ విన్నవీ, కన్నవేను.

తెలుగు టాకీ మొదటిరోజుల్లో రెండు రామదాసులు వచ్చాయి. నాటకరంగంపై అభూమికలకు ప్రసిద్ధిచెందిన ఆరణి సత్యనారాయణ, యడవల్లి సూర్యనారాయణ తెరపై అభూమికలు ధరించారు, 'హిరణ్యకశిపుడు' బళ్ళారి రాఘవకూడా రామదాసుకు స్టేజిలో నవ్యరూపమిచ్చి వున్నారు. అలనాటి యాక్టింగ్ స్టాండర్డుకు సముజ్జీగా, నాటికి మించిన సంగీతపు విలువలతో నాగయ్య రామదాసు దర్శనమిచ్చారు.

ఆ కాలంలోలేని శక్తిసామతలు ఈ కాలంలో నాగయ్యకు లభించడం కూడా గమనార్హం. రఫీవంటి పాటగాడు, ముదిగొండ లింగమూర్తి (మాదన్న పాత్రధారి) వంటి నటుడు, మేటి ఛాయాగ్రాహకులు శబ్దగ్రాహకులు వి. ఎన్. ఫిలిమ్స్‌కు లభించారు. అంచేతనే17వ శతాబ్ది మధ్యగాథ 21 రీళ్ళలోమనోహరంగా అమరింది.

మచ్చలేని చంద్రుడు రావాలి.

అయితే చంద్రునికి మచ్చలా 'రామదాసు'కూ మచ్చలేకపోలేదు. ఆంధ్రుల హృదయసీమపై శాశ్వత పూజ్యముద్ర వేసుకొని వున్న ఈ భక్తుని గాథను చాలావరకు పూజనీయ స్థాయిలో తీసుకొనివెళ్ళినా కొన్ని చోట్ల లాభాపేక్షతో చరిత్రకుఎదురు తిరిగారు. గౌతమబుద్ధుడు నాటకంలో బుద్ధుడు పాత్రధారి భార్యను, బిడ్డను, రాజ్యాన్ని, సర్వస్వాన్నీ త్యజించి, అట్టి నటనతో ప్రేక్షకుల అభిమానం చూరగొని, చివరకు నాటకం అయిపోయాక బుద్ధుడి డ్రెస్సులో ఒక బహుమతికప్పు తీసుకోడానికి ఆశించి స్టేజీమీదకువస్తే ఎలా వుంటుందో 'రామదాసు' వంటి గొప్ప చిత్రంలో ఆ చారిత్రక వ్యతిరేక దృశ్యాలు అలాంటి భావాల్ని కలిగించాయి. డాక్యుమెంటరీ విలువలుకల సబ్జెక్టును నాగయ్యగారు పూర్తిగా ఎక్స్‌ప్లాయిట్ చెయ్యకపోవడం కూడా కొంతవిచారకరం.

క్షేత్రయ్య వంటి గాథలు తెరకెక్కించగల శక్తిమంతుడు నాగయ్య.



ఆలయ ఫిలిమ్స్ "వీలునామా"లో గీతాంజలి

"ఫేస్ వాల్యూ" స్టార్ సావిత్రి

సాధారణంగా 'ఫేస్ వాల్యూ' అనేపదం 'పైకికన్పిస్తున్న దానినిబట్టి' అనే అర్థంలో వాడుతారు. పైన కన్పించే దొకటి లోపల కన్పించే దొకటి (ఇంట్రిన్సిక్ వాల్యూ) రెండూ వేర్వేరు అన్న ధోరణిలో ఆయా పదాలు ఉపయోగిస్తూ వుంటారు. ఎప్పుడైనా ఆశాభంగం కలిగితే 'పైన పటారం లోన లొటారం' అన్న ధోరణిలో 'ఫేస్ వాల్యూ చూసి మోసపోయాం' అని అంటూ వుంటారు.

ఒక దశాబ్దమున్నర సినీ అనుభవం గడించి దక్షిణభారతంలో, విశేషించి తమిళనాడులో 'హీరోయిన్ వర్షిప్' పొందుతున్న నటి కె. సావిత్రికి ఉన్నదే 'ఫేస్‌వాల్యూ.' అయితే ఈ ఫేస్‌వాల్యూ పైన, మొదట పేర్కొన్న, వాడుకలోవున్న

"ఫేస్ వాల్యూ" అర్థాలకే అనర్థం తెచ్చిపెట్టేది!

సావిత్రి ముఖమంత ఫొటోజెనిక్ ఫేస్ ఈనాడు దక్షిణ, ఉత్తరభారతాలలో (స్త్రీలలో) చాలా చాలా అరుదు. నిధి, పెన్నిధి, "ఫేస్" ఒక్కటే అయినా ఫేస్ వాల్యూ ఒకటి, ఇంట్రిన్సిక్ వాల్యూ ఇంకొకటి కాదని ఆమె నిరూపించింది. నిన్నటి "నాదీ ఆడజన్మే"లో ఆమెకు "ఫేస్ వాల్యూ" లేదు. కాని చిత్రవిజయానికి సగం కారణం సావిత్రి "ఇంట్రిన్సిక్" వాల్యూయే.

ఫేస్ వాల్యూకుమించినఇంట్రిన్సిక్ వాల్యూ కల తార సావిత్రి. పలకల ముఖంలో సప్తస్వరాలూ పలికిస్తుంది, నవరసాలూ చిలికిస్తుంది, షడ్రుచులూ చవిచూపిస్తుంది. సంభాషణ నాభిలోనుంచి పుట్టినరీతిగా ముఖముపై పల్కుతుంది. వాచికానికి, అభినయానికి విశిష్టసమ్మేళనం సావిత్రిలో కన్పించినంత ప్రస్ఫుటంగా మరెవ్వరిలోనూ కన్పించలేదంటే అతిశయోక్తికాదు. క్విక్ ఎక్స్‌ప్రెషన్, సాలిడ్ ఎక్స్‌ప్రెషన్, క్లియర్ డైలాగ్ డెలివరీ ఏకసంతగ్రాహ్యత సావిత్రి సొత్తు.

చిన్నతనంలో దిష్టిబొమ్మవు, వికారివి, మాతో ఫొటోకు రాకు" అని తోటిపిల్లలు గేలిచేస్తే పంతంకొద్దీ సింగారించుకొని వచ్చి ఫొటో తీయించుకొంది.

బాల్యంలోనే నాట్యంపై అభిరుచి మళ్ళి నాట్యం నేర్చుకుంటూనూ అంటే "డాన్సు మాష్టారు" నీవు నాట్యానికి పనికిరావన్నారు. అయినా ఆమె ఎనిమిదవ ఏటనే కూచిపూడి, భరతనాట్యాలలో శ్రీ శిష్టా కృష్ణమూర్తి, శ్రీ కోట సుబ్రహ్మణ్యశర్మ గారలవద్ద శిక్షణపొందారు. 13 వ ఏట ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక పోటీలలో గెలుపొంది పృథ్వీరాజ్ మన్ననలు స్వయంగా పొందారు. నవ్వీన నాపచేను పండించారు.


13వ ఏటనే మద్రాసువచ్చి, సారథీ వారి "అగ్నిపరీక్ష"లో వాంప్ పాత్రకు స్క్రీన్ పరీక్ష చేయించుకొంటే "మరీ చిన్నదానివిగా వున్నావు, సారీ ప్లీజ్" అన్నారు. జెమినీవారు వెంటనే ఒక స్క్రీన్ టెస్ట్ చేశారు. ఆ సంస్థ కాస్టింగ్ డిపార్ట్‌మెంట్ మనిషి చెప్పిన రిజల్టు "ఆపరేషన్ సక్సెస్‌ఫుల్..." అన్నట్టుగా వుంది. "అమ్మాయీ నీవు సినీమాకు బాగా పనికివస్తావు. కాని ఇప్పుడు..." విజయవాడ తార పరాజయంతో వెళ్ళిపోయింది. కాని ఆమెకు ట్రాంబండ్ల సరదా మద్రాసులో తీరింది. పెళ్ళి సరదా, తర్వాత తీరింది. ఆ కాస్టింగ్ డిపార్ట్‌మెంట్ మనిషి ఆమె మనిషి జెమిని గణేష్.

మద్రాసులో మొదటియత్నం విఫలమైనా సావిత్రి పంతం సడలలేదు. సంసారంలో కమల పాత్ర

ధరించేందుకు మళ్ళీమద్రాసువచ్చింది-15వ ఏట. అప్పటికే ఆమె సినిమాలు తెగచూస్తూ వుండేది. "బాలరాజు" అంజలి, నాగేశ్వరరావు ఆమె అభిమాన తారలు. నర్గీస్, దిలీప్‌కుమార్ చిత్రాలు వదిలేదికాదు.

మద్రాసు రెండో 'ట్రిప్' లో మళ్ళీ నాగేశ్వరరావు తగిలారు. మొదటి ట్రిప్‌లో వాహినీ స్టుడియోలో నాగేశ్వరరావును చూశారు. అభిమాన నటుణ్ణి చూచి పలకరించ ఎంతో యత్నించారు కాని మాట పెగలలేదు. బెట్టుసరి నాగేశ్వరరావు సావిత్రి తండ్రితో గుట్టుగా మాట్లాడి వెళ్ళినారేకాని సావిత్రివైపు కన్నెత్తి చూడలేదు. సావిత్రి కదికన్నెర్ర. రెండో 'ట్రిప్'లో "సంసారం"లో నాగేశ్వరరావు ప్రక్కనే కమల (ఉపనాయిక) పాత్ర ధరించవలసివచ్చింది. 15 రోజులు షూటింగ్ జరిగింది. సినిమా కొత్త. చిన్న పిల్ల బిడియం. మాట త్వరగా పెగలదు. గొంతుక బాగాలేదనిచెప్పి సావిత్రిని దించారు. కమలపాత్రే సహనాయిక భూమిక అయితే ఆమె క్లాస్‌మేట్స్ గ్రూపులో ఒకరైన ఏక డైలాగు పాత్ర మాత్రము సావిత్రికిచ్చారు. ఆ డైలాగు నాగేశ్వరరావును చూసి "నువ్వు హీరో నాగేశ్వరరావులా వున్నావే" అన్నది.

అంతటి స్వల్పాతి స్వల్పమైన వేషంతో, నాగేశ్వరరావుతో నేమాట్లాడలేని స్థితిలో సినీ జీవితం ఆరంభించిన సావిత్రి నేడు ఆయన ప్రక్క పాప్యులర్ హీరోయిన్ (టాప్‌స్టార్).



"ప్రేమించిచూడు"లో కొత్తనటి కాంచన, జగ్గయ్య

"ఆ సంసారం" రోజులలో ఆనాటి శోభనాచల స్టుడియోస్‌లో కమలవేషం ధరించినప్పుడు కూర్చునేందుకు బల్లయినా యిచ్చేవారులేక చెట్లక్రింద నిలబడడం కళ్ళారా చూచాను. అదే కళ్ళతో ఆ మధ్య ఒక స్టుడియోలో పెళ్ళికూతురు వేషంలో ముస్తాబయి ఫ్లోర్‌కు వస్తుంటే కుర్చీలలో వున్నవారు తటాలున లేచి రాజమర్యాదలు

చేసి సెట్ ప్రాపర్టీ సింహాసనాలు యిస్తుంటే చూశాను.

దేవదాసు పార్వతితో సావిత్రి గొప్ప నటిగా స్థిరపడిపోయారు. 'మనసు మెచ్చిన మగడు' అనే తమిళ చిత్రంలో నటిస్తూ ఆ సినిమా జీవితమునే నిజజీవితం చేసుకొన్నారు. ఆ సినిమాలో ఆమెకు హీరో జెమినిగణేశ్. గృహజీవితంలో కూడా అయన్నే తదనంతరం హీరో చేసుకొన్నారు.

వాంప్ పాత్రలు, వినోద భూమికలు, నాట్యసుందరుల వేషాలు సినిమాలలో ఆమె వేసినా అలనాటి పురాణ సావిత్రివలె పట్టుదలకల 'రోల్స్'లోనే ఆమె అద్వితీయంగా రాణించారు.

'అర్థాంగి'లో సావిత్రి అటువంటి పాత్ర. 'తోడికోడళ్ళు'లో అటువంటి భూమిక. కె. వి. రెడ్డి, పింగళి చిత్ర సృష్టి 'మాయాశశిరేఖ'గా సావిత్రి అంత రాణించారూ అంటే అందులో కార్యసాధనఅంశం వుండడమే కారణం. 'నాదీ ఆడజన్మే' లోను శిలవంటి మామను శిల్పంగా మలచే కృషి వున్నంతసేపూ సావిత్రి అద్వితీయురాలుగా కన్పించారు. ఒక విధంగా శకుంతల అట్టి భూమికే.

ఏ భూమిక ధరించినా 'సావిత్రి నటిస్తున్నారు.' అని కొట్టవచ్చినట్లు లేనిపోని మూతి విరుపులు, కళ్ళ గెంతులు పకపకలు, చేతుల విదిలింపులు తెచ్చిపెట్టుకోరు. నిశ్శబ్ద నిశ్చల నటనకు సావిత్రిది పెట్టిందిపేరు. ఒకే రకం పాత్రను అనేక చిత్రాలలో ఆమె ధరించి వుండవచ్చు. కాని ప్రతి దానిలోను ఏదో ఒకకొత్తదనం చూపిస్తూనేవున్నారు. అదీ లేకపోతే ఈనటన చెరగని ముద్ర అయ్యేటట్లు చేస్తున్నారు.

ఏ నటి గొప్పతనమైనా సగటున నటనాప్రమాణం నిలుపుకొనడంలోనే వుంటుంది. అనగా ఒక చిత్రం నటనలో 90 మార్కులు తెచ్చుకొని ఇంకో చిత్రంలో తొమ్మిది మార్కులు తెచ్చుకోరాదు. 150 చిత్రాలలో నటించిన, నటన పూర్తి చేసిన సావిత్రికి ఏ చిత్రంలోను 100 కి 51 మార్కులు తగ్గవు.

ఈ కోవకు రాగల తారలు దేశం మొత్తంలోనే చాలా చాలా తక్కువ. ఆమాటకువస్తే అటువంటి హీరోలు లేరేమోకూడా. హీరోలను మించిన హీరోయిన్ సావిత్రి.

తమిళంలో 'కైకుడత్త దైవం', 'ఆయురం రూపాయి' వంటి చిత్రాలు కేవలం సావిత్రి నటనావిశేషంవల్ల అశేష జనాకర్షణ పొందినవి. గ్లామర్ వల్ల, సెక్స్ మోతాదువల్ల అశేష జనాకర్షణ ఉండనచ్చు. కాని కేవలం కళద్వారా, అభినయకౌశలం ద్వారా అశేష కళారాధకులను కూడగట్టుకొనడం తమిళంలో సావిత్రికే చెల్లింది. అభినయ కళారాణి అని అనిపించుకొన్నారు కె. సావిత్రి.

అయితే ఆమెకూ కొన్ని లోపాలు లేకపోలేదు: ఆకృతిని అదుపులో ఉంచుకోవాలని ఆమె పట్టుదలతో ఉపోషాలు చేశారు; ఆహారాది నియమాలు పాటించారు; పెద్దలు, శ్రేయోభిలాషులు చెప్పిన రీతిలో తనకిష్టం లేకపోయినా— దుస్తులు ధరించారు. కాని ఇందులో మాత్రం ఈ సావిత్రికి పూర్తివిజయం లభించలేదు.

సినిమాకు సావిత్రికి ఆకృతి ఎంత యిబ్బంది కలిగిస్తున్నదో 'ఫేస్' అందుకు రెండింతల మంచి మేలుచేస్తున్నది. చిత్రానికి చిత్రానికి ఆమె ముఖవర్చస్సు సినిమా శోభకు వన్నె తెచ్చేదిగా రూపొందుతున్నది. అందువల్లనే అన్నది 'సావిత్రి ఫేస్ వాల్యూ స్టార్' అని!

చలన చిత్ర వార్తలు

తేనె మనసులు

తెలుగులో తొలి రంగుల చిత్రం 'తేనెమనసులు' కు అడయార్‌లోను, అడయార్‌కు కొద్ది మైళ్ళ దూరంలోవున్న తీరంలోను షూటింగ్ జరిగింది. సంధ్య, రామమోహన్‌లపై చిత్రీకరణ జరిగింది. మార్చి ఒకటవతేదీన ఈ చిత్రం విడుదలచేసి తెలుగుసినిమా 'మార్చ్'ను చూపాలని నిర్మాతలు బాబూమూవీస్ వారు తలపోస్తున్నారు.

నాగిరెడ్డి శరవేగ చిత్రాలు

విజయా ప్రొడక్షన్స్ అధినేత శ్రీ బి. నాగిరెడ్డి తెలుగు తమిళ భాషలలో సంవత్సరానికి నాలుగు చిత్రాలు నిర్మించేందుకు కనివిని ఎరుగని స్పీడ్ షెడ్యూల్స్ వేసివుంచారు. 'దైవత్తాయి' అనే తమిళచిత్రాన్ని వెంటనే తెలుగులో నిర్మిస్తారు. ఎమ్. జి. ఆర్. ప్రమేయంకల 'తల్లిబిడ్డ' అనే తమిళచిత్రం.(దర్శకుడు ఆదుర్తి) ను కూడా తెలుగులో నిర్మించే ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. 'ఆలీబాబా 40 దొంగలు' తీస్తున్నట్లు ఇదివరకే ప్రకటించారు. కె. వి. రెడ్డి, పింగళి కాంబినేషన్‌తో ఓ జానపద చిత్రంకూడా తీయవచ్చునని అనుకొంటున్నారు. అన్నింటికి చక్రపాణి సహసారథ్యం వుంటుంది.

● ● ●

విజయావారి 'హరిశ్చంద్ర' ఫైనల్ ఎడిటింగ్ జరుగుతున్నది. రేణిగుంట సమీపాన కొంత ఔట్‌డోర్‌పని జరిగింది.

● ● ●

ప్రసాద్ ప్రొడక్షన్స్‌వారు తమ చిత్రానికి 'ఇల్లాలు' అని నామకరణం చేశారు. ఈచిత్రం కొన్ని భాగాలు రంగులలో తీయబడుతుంది.

● ● ●

అన్నపూర్ణా పిక్చర్స్‌వారు 'పూలరంగడు' టైటిల్‌ను రిజిస్టర్ చేసుకొన్నారు. వారి 11 వ చిత్రానికి ఆదుర్తి దర్శకుడు.

యాజమాన్యం తదితర వివరాలు

"జ్యోతి"

ఫారం 4 (8 వ నిబంధనప్రకారము)

ప్రచురణ స్థలం	:	విజయవాడ.
ఎంతకాలానికొకసారి	:	మాసపత్రిక.
ముద్రాపకుని పేరు	:	వి. వి. రాఘవయ్య,
జాతి	:	భారతీయుడు,
విలాసము	:	బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.
ప్రకాశకుని పేరు	:	వి. వి. రాఘవయ్య,
జాతి	:	హిందువు,
విలాసము	:	బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.
సంపాదకుని పేరు	:	వి. వి. రాఘవయ్య,
జాతి	:	భారతీయుడు,
విలాసము	:	బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.
పత్రిక యజమానులు	:	శ్రీమతి వి. లీలావతి, లబ్బీపేట, బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.

పై విషయాలు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేయుచున్నాను.

విజయవాడ-2, (సం.) వి. వి. రాఘవయ్య

ది 30-12-64.

JYOTI FEBRUARY '65 Regd No. H-368

